





www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ

సంపుటి 29, సంచిక: 64 | శనివారం | 22-08-2026 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00


అర్హులైన ప్రతి పేద కుటుంబానికీ ఇందిరమ్మ ఇల్లు
మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా
ఆందోళన చేస్తున్న విద్యార్థులతో మంత్రి వివేక్ ముఖాముఖి
03

## బకాయి మిల్లర్లపై ఉక్కుపాదం



సివిల్ సప్లయిస్‌లోకి (గేహౌండ్స్), ఆక్టోపస్ కమాండోలు
28 మందితో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్.. రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు : ఎం.స్టీఫెన్ రవీంద్ర
03

## రాహుల్‌గాంధీ
# మెరుపుధర్నా

- పెల్లెట్ గన్ బాధిత యువకుడి ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా న్యాయానికి భయపడుతున్నారని విమర్శ
- పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత





యువకుడు పెల్లెట్ గాయాలకు గురైన ఘటనపై ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరు గంటల పాటు ధర్నా నిర్వహించగా ఎట్టకేలకు ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. బాధితుడు సాహిల్ లోచబ్ తల్లి నుండి మాకు ఫిర్యాదు అందిందని, ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని వర్గాలు పేర్కొన్నాయి.

**న్యూఢిల్లీ :** ఢిల్లీలో 'కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి)' ఆధ్వర్యంలో జులై 20న విద్యార్థులు, యువత చేపట్టిన 'పార్లమెంట్ మార్చ్' సందర్భంగా పోలీసులు పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరపడాన్ని లోక్‌సభలో ప్రతిపక్ష నేత తీవ్రంగా విమర్శించారు. నిరసనలో పెల్లెట్ గాయాలకు గురైన ఒక యువకుడు ఇచ్చిన ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేసే వరకు తాను కదిలేది లేదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ శుక్రవారం పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో ఆరు గంటల పాటు ధర్నాకు దిగారు. రాహుల్ గాంధీ నిరసనకు దిగడంతో అప్రమత్తమైన పోలీసులు పార్లమెంట్ పోలీస్ స్టేషన్ వెలుపల భారీగా బలగాలను మోహరించారు. పరిస్థితి అదుపు తప్పకుండా ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందిని కూడా రంగంలోకి దించారు. కొద్దిసేపు పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. బాధితుడైన 19 ఏళ్ల సాహిల్ లోచబ్‌తో కలిసి వచ్చిన రాహుల్‌గాంధీ, పై స్థాయి నుంచి ఆదేశాలు ఉన్నందున ఎఫ్ఐఆర్ నమోదు చేయలేమని పోలీసు అధికారులు తనకు చెప్పారని పేర్కొన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా న్యాయానికి తరువాయి 8లో

## సిఎం రేవంత్‌రెడ్డి యుఎస్ పర్యటనకు
# అనుమతి నిరాకరణ


ఆక్స్‌ఫర్డ్ వర్సిటీని సందర్శించిన సిఎం

- నిర్దిష్ట నిబంధనలు పాటించలే : రణధీర్ జైస్వాల్
- రాజకీయ కారణాలతో అనుమతి నిరాకరించడం పట్ల ముఖ్యమంత్రి విస్మయం

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రపంచంలోనే అత్యంత పురాతన, ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల్లో ఒకటైన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సందర్శించారు. దాదాపు 900 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ విశ్వవిద్యాలయంలో సిఎం ప్రతినిధి బృందంతో కలిసి పర్యటించారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ పరిధిలోని బ్లావాట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను కూడా ముఖ్యమంత్రి సందర్శించారు. ఆక్స్‌ఫర్డ్ అనుబంధ విద్యాసంస్థలలోని నూతన సంస్థల్లో ఇది ఒకటి. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మాయా ట్యూడర్, ప్రొఫెసర్ ఫైసల్ దేవ్జీ తెలంగాణ ప్రతినిధి బృందాన్ని క్యాంపస్‌లో కలిశారు. సమావేశంలో ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతో పాటు ఇతర అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు. తెలంగాణకు సంబంధించిన పలు అంశాలు, పాలన, విద్య, ప్రజా విధానాలపై చర్చించారు.

కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ అనుమతి నిరాకరించిన నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం అమెరికా పర్యటన రద్దయింది. ముఖ్యమంత్రి నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఇంగ్లాండ్, అమెరికా దేశాల పర్యటనకు వెళ్లాల్సి ఉండగా, రాజకీయ కోణంలో అనుమతి నిరాకరించబడిందని కేంద్రం తెలియజేసిన నేపథ్యంలో సిఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనను రద్దు చేసుకున్నారు. విధివిధానాలు, ప్రోటోకాల్ ప్రకారం సిఎం ఇంగ్లాండ్ అమెరికా పర్యటనకు రాష్ట్రం కేంద్ర అనుమతి కోరింది. తొలుత ఇంగ్లాండ్ పర్యటనకు మాత్రమే అనుమతి లభించింది. అధికారిక ప్రతినిధి బృందం ఇంగ్లాండ్‌కు చేరుకున్న తర్వాత అమెరికా తరువాయి 8లో



## షావుకారు జానకి
# కన్నుమూత

సిఎం రేవంత్ రెడ్డి సహా పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు సంతాపం

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రముఖ నటి షావుకారు జానకి (94) కన్నుమూశారు. గత కొంత కాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో శుక్రవారం మధ్యాహ్నం తుది శ్వాస విడిచినట్లు ఆమె సన్నిహితులు పేర్కొన్నారు. జానకి మృతిపట్ల సిఎం రేవంత్‌రెడ్డి సహా పలువురు రాజకీయ సినీ ప్రముఖులు విచారం వ్యక్తం చేశారు. ఆమె మృతికి సంతాపం తెలిపారు. షావుకారు జానకిగా ప్రసిద్ధిచెందిన శంకరమంచి జానకి (జననం 1931 డిసెంబరు 12) అలనాటి రంగస్థల, సినీ కథానాయిక. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో 370కి పైగా సినిమాల్లో నటించింది. ఇందులో సుమారు 2 వందలకి పైగా కథానాయిక పాత్రలు పోషించింది. ఆమె రేడియో నాటికల ద్వారా కెరీర్ ప్రారంభించింది. తెలుగు, తమిళ భాషల్లో ఎన్. టి. రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, ఎం.జి.ఆర్, శివాజీ గణేశన్ మొదలైన నటుల సరసన కథానాయికగా చేసింది. ఆమె చెల్లెలు కృష్ణకుమారి కూడా సినిమా నటి. భారత ప్రభుత్వం ఆమెను 2022లో పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రిలో, కన్నడ మాధ్వ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించింది. తండ్రి తరువాయి 8లో

## కాంగ్రెస్‌కు నష్టం కలిగించేలా వ్యవహరిస్తే
# కఠిన చర్యలు తీసుకోవాలి

- పార్టీ అధిష్టానాన్ని కోరిన 20 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- కొండా సురేఖ కూతురు సుస్మిత వ్యాఖ్యలపై దుమారం
- షోకాజ్ నోటీసులపై క్రమశిక్షణ కమిటీకి అంతా చెప్పా : కొండా సురేఖ



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీలో దుమారం చెలరేగుతోంది. సుస్మిత ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు తీవ్రంగా ఖండించారు. సిఎల్‌పి వేదికగా దాదాపు 20 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మీడియా సమావేశం నిర్వహించి పార్టీకి నష్టం కలిగించే విధంగా మాట్లాడే వారిపై చర్యలు తీసుకోవాలని అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. కుమార్తె వ్యాఖ్యలతో తనకు సంబంధంలేదని చెబుతున్న మంత్రి సురేఖ తన కుమార్తెకు వారసత్వ ఆస్థి ఇవ్వడంలేదా, అలా ఇచ్చినప్పుడు కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తల్లి కూడా బాధ్యత వహించాలి కదా అని తరువాయి 8లో

## ఎల్‌నినో సవాళ్లను
# సమష్టిగా ఎదుర్కొందాం

- విపత్తుగా కాకుండా అవకాశంగా మార్చుకోవాలి
- రాజేంద్రనగర్ టిజిఐఆర్‌డిలో రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో మంత్రులు తుమ్మల, సీతక్క, శ్రీహరి సూచన
- నీటి సంరక్షణ, ప్రత్యామ్నాయ పంటలు, గ్రామీణ ఉపాధిపై ప్రత్యేక దృష్టి సారించామని వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున, తెలంగాణ ప్రభుత్వం ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉందని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క, వాకిటి శ్రీహరి అన్నారు. ఎల్‌నినో సవాళ్లను సమష్టిగా ఎదుర్కొందామని, దానినొక విపత్తుగా కాకుండా అవకాశంగా మార్చుకోవాలన్నారు. రాజేంద్ర నగర్‌లోని తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థ (టిజిఐఆర్‌డి)లో శుక్రవారం ఎల్‌నినో ప్రభావం, శాఖల సమన్వయంతో చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై నిర్వహించిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో మంత్రులు పాల్గొన్నారు. ఈ వర్క్‌షాప్‌లో రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ తరువాయి 8లో





## యువతను విస్మరిస్తే
# పతనం తప్పదు

- 'దిమాగి నక్సల్స్' ప్రకటన అసహనానికి నిదర్శనం
- అధ్యయనం, పోరాటం అలవర్చుకోవాలి
- యువజన సమాఖ్య జిల్లా మహాసభలో కూనంనేని
- పోరాటాల కాణాచి యువజన సమాఖ్య : ధర్మేంద్ర, వల్లీ

ప్రజాపక్షం/ఖమ్మం

పాలకులు యువతను విస్మరిస్తే పతనం తప్పదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి , ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఉపాధి ఉద్యోగ రంగాలు వట్టి పోతున్నాయని తద్వారా దేశంలో నిరుద్యోగం పెరిగిపోతుందని ఉపాధి లేక యువశక్తి నిర్వర్యం అవుతుందని ఆయన తెలిపారు. అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) ఖమ్మం జిల్లా 25వ మహాసభలు శుక్రవారం చింతకాని మండలం కొదుమూరు గ్రామంలో పగడాల భరత్ ప్రాంగణంలో జరిగింది. మహాసభకు ముందు గ్రామంలోవందలాది మంది యువకులు భారీ ప్రదర్శన నిర్వహించారు.మహాసభ ప్రారంభ సూచికగా ఎఐవైఎఫ్ పతాకాన్ని కొండపర్తి గోవిందరావు , అమరవీరుల స్థూపాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆవిష్కరించారు. మహ్మద్ గౌస్ పాషా, అబ్బూరి మహేష్, దండి శ్రీజ, మామిడి కిరణ్, యుమున అధ్యక్షవర్గంగా వ్యవహరించిన మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ యువజన సమాఖ్య కార్యకర్తలు సామాజిక కర్తవ్యాన్ని నెరవేర్చే క్రమంలో ముందు వరుసలో నిలబడాలని సూచించారు. దేశ జనాభాలో సగం కలిగిన యువత హక్కుల కోసం పోరాడాలని, పోరాడకుండా ఏ హక్కులు సాధించబడలేదన్నారు.సమాజాన్ని మార్చగలిగే శక్తి యువతరానికి ఉందని అందుకే తరువాయి 12లో

## రాయదుర్గ్‌లో ఎకరా ధర
# రూ.264 కోట్లు

- వేలంలో రికార్డుస్థాయిలో ధరలు
- 5.25 ఎకరాల భూమి రూ.1,386 కోట్లకు విక్రయం



ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో మరో సంచలన రికార్డు నమోదైంది. రాయదుర్గ్‌లోని టిజిఐఐసి ప్లాట్ నంబర్ పి1 ఎకరాకు ఏకంగా రూ.264 కోట్ల ధర పలికింది. 5.25 ఎకరాల ఈ భూమి ఈవేలంలో మొత్తం రూ.1,386 కోట్లకు విక్రయమైంది. హైదరాబాద్‌లో ఇప్పటి వరకు నమోదైన అత్యధిక భూమి ధరల్లో ఇది కీలక రికార్డుగా నిలిచింది. టిజిఐఐసి నిర్ణయించిన ఎకరాకు రూ.175 కోట్ల రిజర్వ్ ధరతో పోలిస్తే తుది ధర తరువాయి 12లో


## రాజస్థాన్‌లో సిజెపి బృందంపై
# బిజెపి కార్యకర్తలు దాడి



- పాఠశాలలను తనిఖీ చేయనీయకుండా వెళ్లగొట్టిన కాషాయ మూకలు
- బిజెపి గూండాల పనేనని అభిజీత్ దీప్కే మండిపాటు
- రాజస్థాన్ ప్రజాస్వామ్యానికి ఇది ఒక చీకటి రోజు : రంకా

జైపూర్ : రాజస్థాన్‌లోని పాఠశాలల్లో నెలకొన్న దయనీయస్థితి, తమ బండారం ఎక్కడ బయటపడుతుందోన్న భయంతో అధికార పార్టీకి చెందిన కార్యకర్తలు కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) బృందంపై ఓ గ్రామంలో దాడికి పాల్పడ్డారు. దీంతో ఆగ్రామంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. 'స్కూల్ ఠీక్ కరో' (పాఠశాలను బాగుచేయండి) ప్రచారంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలను పరిశీలించడానికి వెళ్ళిన తరువాయి 12లో

ఓరుగల్లు కాంగ్రెస్‌లో మళ్లీ ముసలం
పరకాల సభలో అభ్యర్థి ప్రకటనతో వివాదం
03



ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
శనివారం
22-08-2026
www.prajapaksham.in

# ఎడిట్
PEOPLE'S VIEWS

## ఝార్ఖండ్ ఆందోళన పరిష్కారంలో చిక్కుముడి

నీట్ తదితర పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజి, పరీక్షల రద్దుపై నరేంద్రమోదీ ప్రభుత్వం మెడలు వంచటంలో ఢిల్లీలో సిజెపి పిలుపుపై విద్యార్థులు, యువత ఆందోళన సఫలం కావటాన్నుండి స్ఫూర్తిపొందిన ఝార్ఖండ్ రాష్ట్ర విద్యార్థులు చేబట్టిన ఆందోళన – విద్యార్థులు, ప్రభుత్వం మధ్య కుదిరిన ఒప్పందంతో ఈనెల 18న ముగిసింది. ఆ ఒప్పందానుసారం ప్రభుత్వం 22 రిక్రూట్మెంట్ పరీక్షలను, రిక్రూట్మెంట్‌ను రద్దుచేస్తూ, మరో 22పరీక్షలు అవకతవకలపై దర్యాప్తుకు ఆదేశిస్తూ 19వ తేదీన ఉత్తర్వులు చేసింది. దేవేంద్ర మహతో తన 16 రోజుల నిరాహార దీక్ష విరమించారు. ఢిల్లీ ఆందోళనలో దెబ్బతిన్న బిజెపి ఝార్ఖండ్ ఆందోళనలో చేరి ఢిల్లీ ఉద్యమాన్ని మించి దీనికి ప్రచారం ఇవ్వటానికి ప్రయత్నించింది. ఝార్ఖండ్ జెఎంఎం ప్రభుత్వంలో కాంగ్రెస్ పార్టీ భాగస్వామిగా ఉన్నందున, రాహుల్‌గాంధీని అప్రతిష్ట పాల్జేయటానికి ప్రయత్నించి భంగపడింది. ప్రభుత్వం – విద్యార్థి నాయకుల ఒప్పందంతో విద్యార్థు లు ఆందోళన విరమించటంతో శుభం కార్డు పడిందని భావించబడింది. అయితే గతంలో నోటిఫికేషన్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు పొందినవారు తమ పొట్టకొట్టటం అన్యాయం, చట్టవిరుద్ధమంటూ హైకోర్టును ఆశ్రయించటం, రిక్రూట్మెంట్లను రద్దు చేసిన ప్రభుత్వ ఉత్తర్వుపై జస్టిస్ దీపక్ రోషన్ 20వ తేదీన స్టే విధించటంతో ప్రభుత్వ చర్యకు బ్రేకుపడింది. హైకోర్టు స్టే విధించిన ప్రభుత్వ ఉత్తర్వులు జెపిఎస్‌ఇ 11వ, 13వ పరీక్షల ద్వారా చేసిన నియామకాలు, ఆహార భద్రత అధికారుల నియామకానికి సంబంధించినవి. సమాధానం దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ, తదుపరి విచారణను న్యాయమూర్తి సెప్టెంబర్ 15కు వాయిదా వేశారు. ఆ రోజున, ఒక వేళ తీర్పు యిస్తే అది మైలురాయి కాగలదు.

విచారణ సందర్భంలో న్యాయమూర్తి మౌఖికంగా చేసిన వ్యాఖ్యలు గమనార్హం. మొత్తం విషయాన్ని దర్యాప్తు చేయటానికి రాష్ట్రప్రభుత్వమే సిఐడిని ఆదేశించినపుడు, ఏ పర్మినెంట్ ఉద్యోగినీ సహజన్యాయం సూత్రాన్ని పాటించకుండా తొలగించటానికి వీల్లేదు. ఈ సమస్యకు సంబంధించి యదార్థ నిర్ధారణ రిపోర్టు ఏమైనా ఉందా, కేవలం ఒక ఉత్తర్వు జారీ చేయటం ద్వారా ప్రభుత్వం పర్మినెంట్ ఉద్యోగిని తొలగించగలదా? అని ప్రశ్నించారు. పరీక్షలు, నియామకాల రద్దుకు చట్టప్రకారం అనుసరించాల్సిన క్రమాన్ని పాటించలేదని వ్యాఖ్యానించారు. ఇదిచాలా సమంజసమైన ప్రశ్న. ఇది ఏ రాష్ట్రానికైనా వర్తిస్తుంది. ఆందోళన విరమింపజేసేందుకై రాష్ట్రప్రభుత్వం కుట్రపూరితంగా తమను దగా చేసిందని ప్రతిపక్ష బిజెపి, విద్యార్థి నాయకులు ఆరోపిస్తున్నారు.

ఢిల్లీ ఆందోళనకు విద్యార్థులు, యువత ఆన్‌లైన్ సందేశాలతో భావోద్వేగంతో తమంతటతాము సమీకృతులైనారు. ఝార్ఖండ్ ఆందోళన తద్భిన్నం, బహు నాయకత్వంతో నడిచింది. జెపిఎస్‌సి–జెఎస్ఎస్‌సి రిఫామ్ మంచ్ జులై 25న రాంచీలో జైపాల్ సింగ్ స్టేడియంలో ఆందోళన ప్రారంభించింది. కునాల్ ప్రతాప్‌సింగ్ దాని నాయకుడు. 14వ జెపిఎస్‌సి తదితర పరీక్షల రద్దు, సిబిఐచేత లేదా రాష్ట్రేతర రిటైర్డ్ జడ్జీలతో విచారణ వారి ప్రధాన డిమాండ్. ఆందోళన విస్తరించిన సమయంలో దేవేంద్రనాథ్ మహతో నిరాహారదీక్ష వల్ల ఆయన గ్రూపు ప్రజల దృష్టిని ఆకర్షించింది. ఆయన కొత్త రాజకీయ పార్టీ లోక్‌తాంత్రిక్ క్రాంతికార్ మోర్చాకు చెందినవారు. టైగర్ మహతోగా పిలవబడే జైరాం మహతో గ్రూపు ఆగస్టు రెండవ వారంలో చురుకుదనం పొందింది. వీరు రిఫామ్ మంచ్‌కి వ్యతిరేకులు. మరికొన్ని స్వతంత్ర గ్రూపులు కూడా ఉన్నాయి. బిజెపి, దాని విద్యార్థి విభాగం ఎబివిపి వంటి రాజకీయ మద్దతుదారులు ఉండనే ఉన్నారు.

జులై 2న ప్రకటించిన జెపిఎస్‌సి పిటి ఫలితాల్లో అవకతవకల ఆరోపణలతో ప్రారంభమైన విద్యార్థుల ఆందోళన అనేక మలుపులు తిరిగి ఆగస్టు 18న ప్రభుత్వంతో ఒప్పందంతో ముగిసింది. ఆందోళన చేస్తున్న విద్యార్థులను సంతృప్తిపరిచేందుకై ప్రభుత్వం వారితో చేసుకున్న నియామకాల రద్దు ఒప్పందాన్ని అనుసరించి జారీ చేస్తున్న ఉత్తర్వులను – ఉద్యోగ నియామకం పొందినవారు హైకోర్టులో సవాలు చేయటం, ప్రభుత్వ ఉత్తర్వులను (ఇప్పటికి రెండు) కోర్టు నిలుపుచేయటంతో సమస్యకు మళ్లీ చిక్కుముడి పడింది. ఈ పరిణామం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు గమనించదగింది.



### బిజెపి గూండాలు దాడిచేయటం హేయం

రాజస్థాన్‌లో సిజెపి వలంటీర్లపై బిజెపి గూండాలు దాడిచేయటం హేయం. విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని గళమెత్తిన విద్యార్థులను అడ్డుకుంటారా? చిన్నారులను నిరక్షరాస్యులను చేయాలని బిజెపి భావిస్తోందా? దేశంలో ఏం జరుగుతోంది? పాఠశాలలను తనిఖీ చేయటానికి వెళితే వారిపై భౌతిక దాడికి పాల్పడటం బిజెపి గూండాయిజాన్ని బట్టబయలు చేసింది.

– ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్




## గడప లోపలే మతం - గడప దాటితే విశ్వ బంధువులం

మతం, కులం, విశ్వాసాలను పాటించడానికి రాజ్యాంగం హక్కులను కల్పించింది. కులమతాలు మన వ్యక్తిగత అంశాలు. కులమతాలు మానవాళి ఐక్యతకు, ప్రపంచ శాంతికి అడ్డుపడరాదు. మాట్లాడడం, అభిప్రాయాలను వ్యక్తం చేయడం, విశ్వాసాలు పాటించడం, ఆచారాలను గౌరవించడం, పరమత సహనం కలిగి ఉండడం పౌర సమాజ కనీస కర్తవ్యం. మతం లేదా విశ్వాసం ఆధారంగా హింసాత్మక చర్యల బాధితులు లేదా వారి కుటుంబ సభ్యులను స్మరించుకోవడం లేదా సహాయం చేయడానికి ప్రతి ఏట 22 ఆగష్టు రోజున మతం లేదా విశ్వసం ఆధారంగా హింసాత్మక ఘటనల బాధితులను స్మరించుకునే అంతర్జాతీయ దినం పాటించాలని ఐరాస సర్వసభ్య సమావేశం తీర్మానించడం హర్షదాయకం. మతం ఆధారంగా ఒక వర్గానికి చెందిన గృహాలను ధ్వంసం చేయడం, హింసాత్మక ఘటనలకు పూనుకోవడం, ఆస్తులు/వ్యాపారాలు/విద్యాలయాలు/సాంస్కృతిక కేంద్రాలు/ప్రార్థనా స్థలాలపై పలు రకాలుగా హింసాత్మక చర్యలకు పూనుకోవడం లాంటి సంఘటనలను తీవ్ర స్థాయిలో వ్యతిరేకించాలి లేదా ఖండించాలి.

**పెహల్గామ్ హింసాత్మక దుర్ఘటన మతపరమైనదే :**

మైనారిటీల హక్కుల పరిరక్షణ, పరమత సహనం, మతం లేదా విశ్వాసాలను స్వేచ్ఛగా వినియోగించుకునే హక్కులను కల్పించడం మానవాళి కనీస కర్తవ్యం. భావ ప్రకటన, మత విశ్వాసాలు పాటించడం, అభిప్రాయాలను వ్యక్తం చేయడం, శాంతియుతంగా సమావేశాలు నిర్వహించుకోవడం లాంటి అంశాలకు పూర్తి స్వేచ్ఛ కల్పించబడింది. ఒకరి మత విశ్వాసం మరొకరికి అడ్డు పడరాదు. ఇతరుల మత విశ్వాసాలను గౌరవించడం అలవాటు కావాలి. ఇలాంటి హక్కులకు భంగం కలిగితే శాంతియుత వాతావరణం వేడెక్కి వివాదాస్పద హింసాత్మక ఘటనలకు దారితీస్తాయి. ఇటీవల 22 ఏప్రిల్ 2025 రోజున పెహల్గామ్ దుర్ఘటనలో హిందూ మతస్తులపై పాకిస్థాన్ ముస్లిమ్ ఉగ్రవాదులు భయంకరమైన దాడి చేసి 26 మంది ప్రాణాలు బలిగొనడం చూసాం. ఈ దుర్ఘటన మతపరమైన హక్కులకు భంగం కలిగించడమే కాకుండా ఒక మతానికి చెందిన వారిని ఏరి కోరి కాల్చి వేయడం జరిగింది. ఈ తీవ్రవాదుల దుశ్చర్యకు ప్రతీకారంగా 07 మే 2025 రోజున భారత త్రివిధ దళాలు ఆపరేషన్ సింధూర్ పేరుతో జరిపిన బాంబుదాడుల్లో పాకిస్థాన్ ఉగ్రవాద శిక్షణ కేంద్రాలు, మిలటరీ కేంద్రాలను ధ్వంసం చేయడంతో పాకిస్థాన్ చేతులు ఎత్తి, ఓటమిని అంగీకరించి, కాల్పుల విరమణ ప్రతిపాదన తేవడం జరిగింది.

మతం మానవత్వానికి అడ్డు కారాదు. ఒకరి విశ్వాసాలు మరొకరికి విశ్వాసాలకు భంగం కలిగించరాదు. ప్రపంచ మానవాళి శ్రేయస్సు కోరి మత విశ్వాసాలను వ్యక్తిగతంగా మాత్రమే పాటిస్తూ, మరొకరికి అడ్డు కాకుండా చూసుకోవాలి. జాతి, కులం, మతం, విశ్వాసం, ఆచారం లాంటివి గౌరవించబడాలి. మన విశ్వాసాలు మరొకరి హక్కులకు భంగం కలిగించరాదని గమనించాలి. హింసాత్మక ఘటనలు సమాజ అస్థిరతకు కారణం అవుతాయి. పరస్పర పరమత సహనం మన నిత్య మంత్రం కావాలి. ఒకరి మతం మరొకరి విశ్వాసాలను వ్యతిరేకించరాదు. అన్నీ మరిచి మానవత్వమే సాధనంగా ప్రపంచ సమైక్యతకు పునాదులు వేయాలి, హింస లేని ప్రపంచం నిర్మించబడాలి.

(22 ఆగష్టు మతం లేదా విశ్వాసం ఆధారంగా హింసాత్మక ఘటనల బాధితులను స్మరించుకునే అంతర్జాతీయ దినం సందర్భంగా)

# ప్రజా ఉద్యమాల దిశానిర్దేశకుడు సుధాకర రెడ్డి



మారుపాక అనిల్ కుమార్
9440482429

భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో అనేక మంది నాయకులు కేవలం రాజకీయ పదవులను అలంకరించిన వ్యక్తులుగా కాకుండా, ఒక భావజాలానికి, ఒక విలువల రాజకీయానికి, ప్రజల పట్ల అచంచలమైన నిబద్ధతకు ప్రతీకలుగా నిలిచారు. అలాంటి నాయకుల్లో కామ్రేడ్ సురవరం సుధాకర రెడ్డి ఒకరు. ఆయన జీవితం వ్యక్తిగత విజయాల గాథ కాదు; అది భారత శ్రామికవర్గం, రైతాంగం, పేదలు, అణగారిన వర్గాల విముక్తి కోసం సాగిన నిరంతర రాజకీయ ప్రయాణం. 2025 ఆగస్టు 22న ఆయన మరణంతో భారత కమ్యూనిస్టు ఉద్యమం ఒక అనుభవజ్ఞుడైన నాయకుడిని కోల్పోయింది. అయితే ఆయన రాజకీయ వారసత్వం, సిద్ధాంత స్పష్టత, ప్రజల పట్ల అంకితభావం వామపక్ష ఉద్యమాలకు దిక్సూచిగా నిలుస్తున్నాయి. ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన జీవితాన్ని స్మరించుకోవడం అంటే ఒక నాయకుడిని మాత్రమే కాదు, ప్రజా రాజకీయాల అసలైన అర్థాన్ని గుర్తు చేసుకోవడం కూడా. సురవరం సుధాకర రెడ్డి యువకుడిగా ఉన్న రోజులే భారతదేశంలో తీవ్రమైన సామాజిక, రాజకీయ మార్పుల కాలం. స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ పేదరికం, భూమిలేని రైతులు, నిరుద్యోగం, కుల వివక్ష, సామాజిక అసమానతలు దేశాన్ని వెంటాడుతున్నాయి. రాజకీయ స్వాతంత్ర్యం మాత్రమే సరిపోదు; సామాజిక, ఆర్థిక సమానత్వం కూడా రావాలని భావించిన వేలాదిమంది యువకులలో ఆయన ఒకరు. విద్యార్థి దశలోనే ప్రజా సమస్యల పై ఆసక్తి పెంచుకున్న ఆయన, సామాజిక మార్పుకోసం సంఘటిత రాజకీయాల అవసరాన్ని గుర్తించారు. మార్క్సిస్టు సాహిత్యం, భారత స్వాతంత్ర్య ఉద్యమం, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వంటి చారిత్రక సంఘటనలు ఆయన రాజకీయ అవగాహనకు మరింత పదును పెట్టాయి.

సురవరం సుధాకర రెడ్డి రాజకీయ జీవితంలో అత్యంత విశిష్టమైన అంశం ఆయన సిద్ధాంత నిబద్ధత. ఆయన వ్యక్తిగత జీవితం అత్యంత నిరాడంబరంగా ఉండేది. ఉన్నత రాజకీయ పదవుల్లో ఉన్నప్పటికీ ఆడంబరానికి దూరంగా ఉండేవారు. కార్యకర్తలతో సమానంగా కూర్చొని భోజనం చేయడం, వారి అభిప్రాయాలను శ్రద్ధగా వినడం, ప్రతి చిన్న కార్యకర్తను గౌరవించడం ఆయన నాయకత్వ శైలిలో ముఖ్య లక్షణాలు. నాయకుడు అంటే ఆదేశాలు ఇచ్చే వ్యక్తి కాదని, ప్రజలతో కలిసి నడిచే వ్యక్తి అని ఆయన తన ఆచరణతో నిరూపించారు.

సురవరం సుధాకర రెడ్డి దృష్టిలో ఎన్నికలు రాజకీయ జీవితంలో ఒక భాగం మాత్రమే. కానీ ప్రజల దైనందిన సమస్యలపై జరిగే ఉద్యమాలే అసలైన ప్రజాస్వామ్యానికి ప్రాణం అని ఆయన నమ్మారు. రైతుల భూమి సమస్యలు, కార్మికుల వేతనాలు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, విద్య, వైద్యం, ఉపాధి, సామాజిక న్యాయం ఈ అంశాలన్నింటిపైనా ఆయన ఉద్యమాలకు నాయకత్వం వహించారు. యువజన ఉద్యమంలో కీలక నాయకుడిగా పనిచేశారు. ఆయన అఖిల భారత యువజన సమాఖ్య జాతీయ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో, యువతకు 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించాలని దేశవ్యాప్త ఉద్యమానికి నాయకత్వం వహించారు. ఈ ఉద్యమంలో కేరళ కు చెందిన సి.కె. చంద్రప్పన్ వంటి నాయకులతో కలిసి విస్తృత ప్రచారం, ఆందోళనలు నిర్వహించారు. ఆ ఉద్యమం ఫలితంగా తర్వాత భారత రాజ్యాంగంలోని 61వ రాజ్యాంగ సవరణ (1988) ద్వారా ఓటు హక్కు వయస్సు 21 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలకు తగ్గించబడింది. ఈ విజయానికి సురవరం సుధాకర రెడ్డి గారి దీర్ఘకాల పోరాటం కూడా ఒక ముఖ్యమైన కారణంగా గుర్తించబడుతుంది. విదేశాల్లో దాచిన నల్లధనం వల్ల దేశానికి భారీ ఆదాయ నష్టం జరుగుతుందని, అదే సమయంలో పేదలపై పన్నుల భారం పెరుగుతుందని ఆయన వాదించేవారు. ఈ సమస్యపై అన్ని రాజకీయ పార్టీలూ కలిసి పోరాడాలని కూడా పిలుపునిచ్చారు. విదేశీ బ్యాంకుల్లో భారతీయుల నల్లధనం అంశాన్ని పార్లమెంట్‌లో అనేక సందర్భాల్లో లేవనెత్తారు. 2జీ స్పెక్ట్రం కేటాయింపుల్లో అవినీతిపై పార్లమెంట్‌లో తీవ్రంగా స్పందించారు. ప్రజా సంపద ప్రజలకే దక్కాలని, సంపద కేటాయింపులో పారదర్శకత తప్పనిసరి అని, అవినీతి ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరగాలని పార్లమెంటు సాక్షిగా కేంద్ర ప్రభుత్వంపైన పోరాటాలు నిర్వహించారు సురవరం సుధాకర రెడ్డి. పార్లమెంట్‌లో మహిళల రిజర్వేషన్ హక్కులకు సంబంధించిన



కామ్రేడ్ సురవరం సుధాకర రెడ్డి గారి ప్రథమ వర్ధంతి సందర్భంగా

అంశాలపై నిరంతరం మాట్లాడారు. మహిళల సమాన హక్కులు, భద్రత, ఆర్థిక సాధికారత, రాజకీయ ప్రాతినిధ్యం కోసం ఆయన మద్దతు తెలిపారు. మహిళల సమస్యలను ఆయన కేవలం సంక్షేమ అంశాలుగా కాకుండా సామాజిక న్యాయం, లింగ సమానత్వం, రాజ్యాంగ హక్కుల కోణంలో ప్రస్తావించేవారు. ముఖ్యంగా పేద, దళిత, గిరిజన, శ్రామిక మహిళల సమస్యలను పార్లమెంట్ దృష్టికి తీసుకురావడంలో ఆయన చురుకైన పాత్ర పోషించారు.

### నేటి తరానికి ఆయన స్ఫూర్తి

ప్రస్తుతం దేశంలో ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయి. నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, మత విద్వేష రాజకీయాలు, రాజ్యాంగ విలువలపై సవాళ్లు వంటి పరిస్థితుల్లో సురవరం సుధాకర రెడ్డి చూపిన రాజకీయ దారి మరింత ప్రాసంగికంగా కనిపిస్తోంది. ఆయన జీవితం మనకు ఒక స్పష్టమైన సందేశం ఇస్తుంది. ప్రజల పక్షాన నిలబడే రాజకీయాలే శాశ్వతమైనవి; విలువల కోసం పోరాడే నాయకత్వమే చరిత్రలో నిలిచిపోతుంది.

భారత కమ్యూనిస్టు ఉద్యమం కేవలం ఎన్నికల రాజకీయాలకే పరిమితం కాకుండా ప్రజల నిత్యజీవిత సమస్యల పరిష్కారాన్ని లక్ష్యంగా పెట్టుకున్న ఉద్యమం. ఆ ఉద్యమానికి సైద్ధాంతిక బలం, రాజకీయ దిశ, ప్రజలతో నిరంతర అనుబంధం అవసరం. ఈ మూడు లక్షణాలు సమపాళ్లలో కలిగిన నాయకుడు కామ్రేడ్ సురవరం సుధాకర రెడ్డి. రాష్ట్ర స్థాయి నాయకుడిగా ప్రారంభమైన ఆయన రాజకీయ ప్రస్థానం క్రమంగా జాతీయ స్థాయికి చేరుకుంది. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ప్రధాన కార్యదర్శిగా ఆయన పార్టీని క్లిష్ట రాజకీయ పరిస్థితుల్లో ముందుకు నడిపించారు.

సురవరం సుధాకర రెడ్డి పార్టీకి నాయకత్వం వహించిన కాలంలో భారత రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. ఒకవైపు ప్రపంచీకర ణ, ప్రైవేటీకరణ, ఉదారవాద ఆర్థిక విధానాలు వేగంగా అమలవుతుంగా, మరోవైపు మతతత్వ రాజకీయాలు బలపడుతున్నాయి. ఈ రెండు ధోరణులు దేశ సామాజిక నిర్మాణానికీ, ప్రజల జీవన ప్రమాణాలకూ ప్రమాదకరమని ఆయన విశ్లేషించారు. సిపిఐ ప్రధాన కార్యదర్శిగా దేశవ్యాప్తంగా పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడంపై ఆయన ప్రత్యేక దృష్టి పెట్టారు. రాష్ట్ర కమిటీలను బలోపేతం చేయడం, యువ నాయకత్వాన్ని ప్రోత్సహించడం, మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం, కార్మిక–రైతు సంఘాలతో సమన్వయం సాధించడం వంటి అంశాలను ఆయన పార్టీ నిర్మాణంలో ప్రధాన ప్రాధాన్యంగా తీసుకున్నారు. పార్టీ బలం కార్యాలయాల్లో కాదు, ప్రజల మధ్య ఉంటుంది. ప్రజల పోరాటాల్లో భాగస్వామ్యం కాని పార్టీ బలపడదు.

### పార్లమెంట్‌లో ప్రజల సమస్యలకు స్వరం

సురవరం సుధాకర రెడ్డి పార్లమెంట్‌ను కేవలం చట్టాలు చేసే వేదికగా కాకుండా, ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే ప్రజాస్వామ్య వేదికగా ఉపయోగించారు. ప్రభుత్వ విధానాలను విమర్శించినప్పుడు కూడా ఆయన వ్యక్తిగత విమర్శలకు పోకుండా, గణాంకాలు, వాస్తవాలు, రాజ్యాంగ సూత్రాల ఆధారంగా తన వాదనను వినిపించేవారు. అందుకే రాజకీయ ప్రత్యర్థులు కూడా ఆయనను గౌరవించేవారు. భారత రాజ్యాంగంలోని లౌకికవాదాన్ని సుధాకర రెడ్డి భారత ప్రజాస్వామ్యానికి మూలస్తంభంగా భావించారు. భారత దేశం అనేక మతాలు, భాషలు, సంస్కృతులు, జాతులు కలిసిన దేశం. ఈ వైవిధ్యాన్ని కాపాడే శక్తి లౌకికవాదమేనని ఆయన విశ్వసించారు. మతం పేరుతో విద్వేషాన్ని రెచ్చగొట్టడం, ఎన్నికల ప్రయోజనాల కోసం సమాజాన్ని విభజించడం దేశ భవిష్యత్తుకు ప్రమాదకరమని ఆయన అనేక సభల్లో హెచ్చరించారు.

### రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల కోసం నిరంతర పోరాటం

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగాన్ని సురవరం సుధాకర రెడ్డి అత్యంత గౌరవంతో చూసేవారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని, కానీ ఆ హక్కులు ఆచరణలో అమలుకావాలంటే ప్రజా ఉద్యమాలు అవసరమని ఆయన స్పష్టం చేసేవారు. భావ ప్రకటనా స్వేచ్ఛ, సంఘటిత హక్కు, కార్మిక హక్కులు, రైతుల హక్కులు, రాష్ట్రాల హక్కులు వంటి అంశాలపై ఎలాంటి దాడి జరిగినా ఆయన గట్టిగా వ్యతిరేకించారు. ఆర్థిక సంస్కరణల పేరుతో ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించే విధానాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రభుత్వరంగ సంస్థలు కేవలం వ్యాపార సంస్థలు కావని, అవి దేశ అభివృద్ధికి, ఉపాధికి, సామాజిక సమానత్వానికి పునాది అని ఆయన వాదించారు. రైల్వేలు, బీమా, బ్యాంకింగ్, బొగ్గు, ఉక్కు, విద్యుత్ వంటి కీలక రంగాలను ప్రైవేటీకరించడం వల్ల సామాన్య ప్రజలపై భారాలు పెరుగుతాయని ఆయన హెచ్చరించారు.

ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం అంటే ప్రభుత్వాన్ని అడ్డుకోవడం కాదని, ప్రజా ప్రయోజనాలను కాపాడటం అని ఆయన భావించేవారు. ప్రజలకు మేలు చేసే విధానాలకు మద్దతు ఇవ్వడం, ప్రజావ్యతిరేక విధానాలను నిరసించడం ఇదే బాధ్యతాయుతమైన ప్రతిపక్ష రాజకీయమని ఆయన ఆచరణలో చూపించారు. అందుకే ఆయన కేవలం సిపిఐ నాయకుడిగానే కాకుండా, భారత ప్రజాస్వామ్య ఉద్యమానికి చెందిన ఒక విలువైన రాజకీయవేత్తగా గుర్తింపు పొందారు. యువత రాజకీయాలకు దూరంగా ఉండకూడదని, సమాజ సమస్యలను అర్థం చేసుకోవాలని, చరిత్రను అధ్యయనం చేయాలని ఆయన పిలుపునిచ్చేవారు. రాజకీయ శిక్షణ, పుస్తక పఠనం, ప్రజల మధ్య పని, శాస్త్రీయ దృక్పథం ఈ నాలుగు అంశాలను ఆయన యువ కార్యకర్తలకు నిరంతరం సూచించేవారు.

**ఆయన మాటల్లో:** ఉద్యమానికి నినాదాలు మాత్రమే సరిపోవు. అధ్యయనం, ఆలోచన, ఆచరణ కలిసినప్పుడే శాశ్వత మార్పు సాధ్యమవుతుంది. ఈ ప్రథమ వర్ధంతి సందర్భంగా కామ్రేడ్ సురవరం సుధాకర రెడ్డికి మనం అర్పించే నిజమైన నివాళి – ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడం, రాజ్యాంగ విలువలను కాపాడడం, కార్మిక–రైతు–దళిత–ఆదివాసీ–మైనారిటీ ప్రజల హక్కుల కోసం ప్రజాస్వామ్య పద్ధతుల్లో నిరంతరం పోరాడడం.

### ఎర్రమందారం సురవరం

పల్లవి
అమరుడా !సురవరం అందుకో లాల్ సలామ్
సురవరం సుధాకర్ రెడ్డి అందుకో లాల్ సలామ్
గరిబోల్ల గొంతుకై గర్జించిన సింగమా..
అసమర్థుల పాలనపై గళమెత్తిన గానమా!

చరణం
కయ్యానికి సైయంటూ కాలు దువ్వి లేచినోడా!
నీ ఆశయ సాధనలో ఆటంకాలెన్నొచ్చిన
భయానికి తావు లేదు కమ్యూనిజం మార్గంలో
చివరి వరకు పోరినావు చెదర లేదు నీ శౌర్యం

సమసామజ స్థాపనకై నిరంతరం పోరినోడా!
నియంత పాలనపై నిప్పు కణిక వైనోడా!
పేగునిండ బువ్వ లేని పేదొల్లను కూడగట్టి
మతిలేని నాయకుల చెమటలు పట్టించినోడా!
అంతరాల సమాజాన్ని అంతు సూడ లేచినోడా!
అడ్డంకులు ఎన్నొచ్చిన అధిగమించి పోరినోడా!
జగ మెరిగిన నేతవై ప్రజా పోరు సలిపినోడా!
కడవరకు కమ్యూనిస్టు జెండ వట్టి సాగినోడా!

అనితర సాధ్యుడా!విజయ నాథుడా!
పోరులోన గెలిచినావు ఔరా అని నిల్చినోడ
మదిలోన సంకల్పం అవహించుకున్నోడా!
దెబ్బదిన్న చిరుతోలె ముందుండి కదిలినోడా!

నీ పోరును మరువ లేము నీ దారిని వీడలేము
నువు సూపిన దారిలోనే మేమంతా సాగుతాము
సమసమాజ స్థాపనకై ఏకమై పోరుతాము
ఎర్రజెండ నీడకింద కడవరకు చేరుతాము

గడ్డమీది చంద్రమోహన్ గౌడ్
9866510399

# శ్రమతో ఆర్జించే వారిదే 'అర్జక్ సంఘ్' : రామ్ స్వరూప్ వర్మ

ప్రొ.దేవరాజు మహారాజు

దేశంలోని ఉత్తర దక్షిణ రాష్ట్రాలను నిశితంగా పరిశీలిస్తే – దక్షిణాది రాష్ట్రాలలో విద్యావంతులు ఎక్కువ. పెరియార్, గోరా, కందుకూరి, త్రిపురనేని, కోవూర్ వంటి వారి కృషితో దక్షిణాన చైతన్యమెక్కువ. హేతువాదులెక్కువ. నిజమే! కానీ ఉత్తర భారత దేశంలోని రాష్ట్రాల నుంచి కూడా కొంతమంది సంఘ సంస్కర్తలు, హేతువాదులు, బౌద్ధ అనుయాయులు వచ్చారు. వారు చేయగలిగినంత చేశారు. సామాజిక, ఆర్థిక, రాజకీయరంగాలలో జనాన్ని చైతన్యవంతుల్ని చేశారు. అయినా కూడా వారి ప్రభావం ఏమాత్రం లేకుండా జనాన్ని మూఢత్వంలో ముంచి, దౌర్జన్యాలు చేస్తూ అక్రమ మార్గంలో అధికార పీఠాలు ఆక్రమించినవారిని మనం ఇటీవల చూస్తున్నాం. ఒకప్పుడు ఉత్తరప్రదేశ్ నుండే రామ్‌స్వరూప్ వర్మ, లలైసింగ్ యాదవ్‌లు వచ్చారు. బీహార్ నుండి బాబు జగదేవ్‌ప్రసాద్ వచ్చాడు. బ్రాహ్మణిజం ఆధిపత్యాన్ని తగ్గించడానికి, బహుజనులు అధికారం చేపట్టడానికి కావల్సిన నేపథ్యాన్ని వారు సమకూర్చారు. రామ్‌స్వరూప్‌వర్మ, బాబు జగదేవ్‌ప్రసాద్‌లు స్వయంగా రాజకీయాల్లోకి దూకి, ఆయా రాష్ట్రాల్లో మంత్రులుగా కొంతకాలం పరిపాలన సాగించారు కూడా! వీరిలో రామ్‌స్వరూప్ వర్మది ప్రత్యేకమైన కృషి. జన్మ, పునర్జన్మ, ఆత్మ, పరమాత్మ కర్మఫలితం వంటి కల్పించిన మాటలతో, తప్పుడు సిద్ధాంతాలతో జనాన్ని భయానికి గురిచేసి, లేని దేవుణ్ణి ప్రతిష్ఠాపించి, వారు చెప్పిన మాటలన్నీ భగవంతుడు చెప్పాడని బొంకుతూ, కష్టపడకుండా దోచుకుతింటున్న బ్రాహ్మణ ఆధిపత్యాన్ని నిర్ద్వంద్వంగా నిరసించినవాడు రామ్‌స్వరూప్ వర్మ. మనుస్మృతిని చీల్చి చెండాడుతూ పుస్తకాలు రాసి, రామ్‌చరిత్‌మానస్‌ను (రామాయణాన్ని) బహిరంగంగా తగులబెట్టి, తన ఆలోచనలకు ఉద్యమ రూపమిచ్చిన క్రియాశీలి. ఇప్పటిదాకా మానవుడి కేంద్రంగానే విషయాలన్నీ వెలుగులోకి వచ్చాయని, ఇకముందు కూడా అలాగే జరుగుతుందనీ – దేనిలోనూ ఏ శక్తీ ఏ మహత్తూ లేదని, ఏ మతమూ ఏ దేవుడూ లేడని కరాఖండిగా చెప్పి, కష్టజీవుల పక్షాన నిలిచిన మేధావి, మానవవాది రామ్‌స్వరూప్ వర్మ.

కులాల్ని, వర్గాల్ని, వర్ణాల్ని, మతాల్ని అందులోని శాఖల్ని త్యజించి అన్నింటికీ అతీతంగా మానవీయ విలువల్ని నిలుపడం కోసం ఒక ప్రత్యేకమైన సంఘాన్ని ఏర్పాటు చేశాడు రామ్‌స్వరూప్ వర్మ. దానిపేరు అర్జక్ సంఘ్ – అంటే శారీరక శ్రమతో మాత్రమే డబ్బు సంపాదించుకుని జీవనం సాగించే వారి సంఘం. శారీరక శ్రమ సౌందర్యానికి అత్యున్నతమైన గౌరవమిచ్చే సంఘం. వర్ణవ్యవస్థను కాలరాసి, వైజ్ఞానిక అవగాహనతో జన్యుశాస్త్రం రుజువుపరిచిన – ''మనుషులంతా ఒక్కటే'' నన్న భావనతో అందరినీ కలుపుకుపోయే సంఘం – అర్జక్ సంఘ్! అర్జక్ – అంటే ఆర్జించేవాడు. కూర్చుని దొంగమాటలు చెప్పి, డబ్బు లాగేవారు కూడా ఆర్జిస్తున్నారు కదా? – అంటే.. వారు ఈ సంఘంలో సభ్యులు కారు. ఎంతటి మేధావి అయినా, ఎంత గొప్ప ప్రణాళికలు రూపొందించినా – అవి వాస్తవ రూపం దాల్చాలంటే శ్రమ శక్తి తోడు కావాల్సిందే! ఆలోచనలు ఆలోచనలుగా ఉంటే లాభం ఉండదు. అవి వాస్తవ రూపాలు సంతరించుకుంటేనే సమాజానికి ఉపయోగం! అందువల్ల, అర్జక సంఘంలో కష్టపడి, చెమటోడ్చి పనిచేసే కర్షక, కార్మిక వర్గాల వారికే ప్రాధాన్యత ఉంటుంది. శ్రమకూ, మానవీయ విలువలకూ ప్రాధాన్యమిచ్చే ఆలోచనాపరులు కూడా ఈ సంఘంలో భాగస్వాములు కావచ్చు. అయితే, వారు తమతమ కులమతాల్ని, ఆర్థిక స్తోమతల్ని పక్కకు నెట్టి, మానవ శ్రేయస్సు కోరుకునే స్వేచ్ఛా జీవులు కావాలి! అన్న విషయం రామ్‌స్వరూప్ వర్మ తన సంఘానికి సంబంధించిన 'బైలాస్'లో రాసుకున్నాడు. 1970 తొలినాళ్ళలో ప్రారంభమైన ఈ సంఘాన్ని ఆయన అనుయాయులు ఈనాటికీ క్రియాశీలంగానే ఉంచారు. ఆ సంఘం వారు అధికారికంగా నిర్వహించుకుంటున్న యూట్యూబ్ ఛానెల్ ఇప్పటికీ పనిచేస్తూనే ఉంది. హేతువాదాన్ని, శాస్త్రీయ అవగాహనను, మానవ వాదాన్ని ప్రచారం చేస్తూనే ఉంది.

రామ్‌స్వరూప్ వర్మ చెప్పినదాన్ని బట్టి – ''బ్రాహ్మణిజం ఒక చెట్టు లాంటిది. పునర్జన్మ దాని తల్లివేరు. మనిషి చేతిలో ఏమీలేదు. అంతా విధిరాత అని ప్రగాఢంగా నమ్మే ఆలోచనా ధోరణి (FATALISM) ఆ చెట్టు కాండమైతే, వర్ణ వ్యవస్థ ఆ వృక్షానికున్న శాఖలు. దానిమీదే కులం ఆకులుగా మొలుస్తాయి. అగ్రవర్ణం, నిమ్నవర్గం లాగా కొన్ని పుష్పాలు వృక్షం అగ్రభాగాన పూస్తే, కొన్ని పువ్వులు కింది భాగంలో అంచెలంచెలుగా పూస్తాయి. శ్రమదోపిడీ ఈ వృక్షపు ఫలాలు!''– భారతదేశంలో శతాబ్దాలుగా వేళ్ళూనుకుని ఉన్న బ్రాహ్మణిజపు స్వభావాన్ని రామ్‌స్వరూప్‌వర్మ సంకేతాత్మకంగా, సందేశాత్మకంగా ఇలా వర్ణించి చెప్పాడు. వైజ్ఞానిక అవగాహనతో సమాజాన్ని అవలోకించే వారికి వర్మ వర్ణన బాగా నచ్చుతుంది. ఇది మాత్రమేగాక, ఆయన మరొక విషయం కూడా నిర్మోహమాటంగా చెప్పాడు. మనకు కొందరు సంఘ సంస్కర్తలుంటారు. వారు ఆకులు – పూలు–పండ్లు పీకేద్దామని ప్రయత్నిస్తుంటారు. దానివల్ల ఫలితం ఉండదు కదా? ఆకులు మళ్ళీ మొలుస్తుంటాయి. పూలు మళ్ళీ పూస్తుంటాయి. శ్రమదోపిడి ఫలాలు కాస్తూనే ఉంటాయి. మరి ఎలాగా? అంటే–వేళ్ళతో సహా ఆ వృక్షాన్ని ఊడబెరికితే గాని, లేదా నరికితే గాని సమసమాజ స్థాపన జరగదు! రామ్ స్వరూప్ వర్మ (22 ఆగస్టు 1923 –19 ఆగస్టు 1998) యు.పి, కాన్పూర్ జిల్లా , గౌరికరన్ గ్రామంలో కుర్మిజాతి వ్యవసాయ కుటుంబంలో పుట్టాడు. తండ్రి వంశ్ గోపాల్, తల్లి సుఖియా. విద్యార్థి దశలోనే వర్మకు సియాదులారీ అనే అమ్మాయి తో పెద్దలు పెండ్లి చేశారు. ఆ అమ్మాయి రెండేళ్ళకే చనిపోయింది. వర్మ మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. తనను తాను బహుజన ఉద్యమకారుడిగా, రాజకీయ నాయకుడిగా, మానవవాదిగా, రచయితగా, తత్త్వవేత్తగా తీర్చిదిద్దుకుంటూ, సమాజానికి దిశానిర్దేశం చేస్తూ ముందుకు సాగాడు. ఎం.ఎ.; ఎల్ఎల్‌బి డిగ్రీలు తీసుకున్నా లాయర్‌గా ప్రాక్టీసు చేయలేదు. ఐ.ఎ.ఎస్ పరీక్ష ఉత్తీర్ణుడై ఉండి కూడా ఇంటర్వ్యూకు పోలేదు. స్వేచ్ఛగా జనజీవితంతో మమేకమై పనిచేయాలనుకున్నాడు. తర్వాత కొంత కాలానికి ఆచార్య నరేంద్రదేవ్ తోనూ, డా.రామ్ మనోహర్ లోహియాతోనూ పరిచయాలు పెరిగి, సోషలిస్ట్ పార్టీ సభ్యుడయ్యాడు. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీకి పలుమార్లు ఎన్నికయ్యాడు. చరణ్‌సింగ్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో 1967లో ఆయన మంత్రివర్గంలో ఆర్థిక మంత్రి అయ్యాడు. అప్పటికి ఆయనకు ఒక విషయం పూర్తిగా అర్థమైంది. సామాజిక, సాంస్కృతిక రంగాలలో సమానత్వం సాధించకుండా రాజకీయ, ఆర్థిక సమానత్వం సాధించడం కుదరదని! ఫలితంగానే అర్జక్ సంఘ్ స్థాపనకు పూనుకున్నాడు.

1972లో వర్మ సోషలిస్ట్ పార్టీ వదిలి, తనే 'సమాజ్‌దళ్' అనే కొత్త రాజకీయ పార్టీ ప్రారంభించాడు. దానికి అనుబంధంగా 'అర్జక్ సాప్తాహిక్' అనే హిందీ వారపత్రిక ప్రచురణ చేపట్టాడు. అదే సమయంలో బీహార్‌లో బాబు జగదేవ్ ప్రసాద్ సోషలిస్ట్ పార్టీ వదిలి 'శోషిత్ దళ్' పేరుతో కొత్త పార్టీనీ, అనుబంధంగా 'శోషిత్ సాప్తాహిక్' హిందీ వార పత్రికను ప్రారంభించాడు. ఈ ఇద్దరి ఆలోచనలు, వారు ప్రచురిస్తున్న పత్రికల కథనాలు, చేపట్టిన కార్యక్రమాలు ఒకే విధంగా ఉండడంతో 1972లో ఇద్దరూ కలిసిపోయారు. ఇద్దరూ కలిసి సంయుక్తంగా ''శోషిత్ సమాజ్ దళ్'' పేరుతో పార్టీ ప్రారంభించారు. దానికి రామ్‌స్వరూప్‌వర్మ చైర్ పర్సన్‌గా, జగదేవ్ ప్రసాద్ కార్యదర్శిగా పనిచేయనారంభించారు.

రామ్ స్వరూప్ వర్మ రచనలన్నీ హిందీలో ప్రకటించాడు. అందులో '' మానవ వాది ప్రశ్నోత్తం'' ''మానవ వాద్ వర్సెస్ బ్రాహ్మణ్‌వాద్ '', ''మనుస్మృతి రాష్ట్రక కళింక్'', ''నిరాదర్ కైసే మిటే'', ''అఛూతోంకి సమస్యా అవుర్ సమాధాన్'', ''అర్జక్ సంఘ్ సిద్ధాంత్ – కర్తవ్య విధాన్ కార్యక్రమ్ '' వంటి శీర్షికలతో చాలా పుస్తకాలు ప్రకటించారు. 1. పుట్టుక, పెళ్ళి, చావు వంటి వాటిల్లో బ్రాహ్మణ పురోహితుల ప్రమేయాన్ని పూర్తిగా తొలగించాలి. 2.ఆచారాల పేరుతో ఆర్భాటాలు ఆపేయాలి. 3.నిజాల్ని జీర్ణించుకుని వాస్తవంలో బతకాలి. 4. మొత్తానికి మొత్తంగా బ్రాహ్మణిజాన్ని తరిమికొట్టాలి. 5.అంత మాత్రం చేత అగ్రవర్ణం వారిని ద్వేషించకూడదు 6.అందరినీ సమాన స్థాయి గల మనుషులుగా గౌరవించుకోవాలి – వంటి విషయాలన్నీ రామ్‌స్వరూప్ వర్మ తన అర్జక్ సంఘ్ బైలాస్‌లో పొందుపరిచాడు. బుద్ధుడి ఆలోచనలకు, బోధనలకు ఆకర్షితుడైన రామ్‌స్వరూప్ వర్మ, వాటిని ఆధునిక వైజ్ఞానిక కాలానికి అనుగుణంగా మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నాడు. తను అభిమానించే డా.బి.ఆర్.అంబేద్కర్ చివరి దశలో హిందూ మతం వదిలి బౌద్ధాన్ని స్వీకరించాడు. ఆయన ఇంకొంత కాలం జీవించి ఉంటే 'నవయానం'లో అనువైన మార్పులు, చేర్పులు చేసి ఉండేవారేమోనన్నది వర్మ అభిప్రా యం.

**(22 ఆగస్టు రామ్ స్వరూప్ వర్మ జయంతి)**

# ఓరుగల్లు కాంగ్రెస్‌లో మళ్లీ ముసలం

● పరకాల సభలో అభ్యర్థి ప్రకటనతో వివాదం
● కొండా సుస్మిత వ్యాఖ్యలతో దుమారం
● మంత్రి సురేఖకు వ్యతిరేకంగా ఒక్కటైన ఎమ్మెల్యేలు





**ప్రజాపక్షం/హనుమకొండ :** ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో మళ్ళీ ముసలం మొదలైంది. ఈసారి పరకాల కేంద్రంగా రాజుకున్న చిచ్చు.. ఏకంగా సిఎం రేవంత్‌రెడ్డి వరకు తాకింది. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి వర్సెస్ మంత్రి కొండా సురేఖ కుటుంబంగా సాగుతున్న రాజకీయ పోరు సిఎం పర్యటన తర్వాత మరింత ముదిరింది. మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత పటేల్ చేసిన వ్యాఖ్యలు.. ఆ తర్వాత పార్టీ క్రమశిక్షణ సంఘం మంత్రి సురేఖకు నోటీసులు ఇవ్వడం.. దానికి ఆమె ఇచ్చిన వివరణ.. తాజాగా కొండా వ్యతిరేకవర్గం నేతలు మీడియా ముందుకొచ్చి ఆమెపై చర్యలు తీసుకోవాలని ఏఐసీసీ నేతలను డిమాండ్ చేయడంతో వ్యవహారం మరింత ముదిరింది. చివరికి ఢిల్లీ పెద్దల వరకు ఫిర్యాదులు చేరాయి. ఈ క్రమంలో హైదరాబాద్‌లో మంత్రి కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అధికార ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సమావేశమై మీడియా ముందు డిమాండ్ చేయడంతో వివాదం తారాస్థాయికి చేరినట్లు అయింది.

**సిఎం పర్యటన తర్వాత వివాదం.. సుస్మిత వ్యాఖ్యలతో దుమారం**
ఈ నెల 16న పరకాలలో సిఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. ఈసందర్భంగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ డ్డిని ప్రశంసిస్తూ, రాబోయే ఎన్నికల్లో ఆయనను గెలిపించాలని పార్టీ శ్రేణులకు సీఎం పిలుపునిచ్చారు. ఈపర్యటనకు మంత్రి కొండా సురేఖ హాజరు కాలేదు. తాను పిలిచినా సిఎం సభకు మంత్రి రాలేదని ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డి బహిరంగంగానే ప్రకటించారు. ఈ సందర్భంగా బుధవారం గీసుకొండలో కొండా సుస్మిత పటేల్ చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో వివాదానికి దారితీశాయి. సిఎం రేవంత్ రెడ్డి, ఆయన సోదరులు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే రేవూరిపై ఆమె వ్యాఖ్యలు చేయడంతో పార్టీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. సిఎం వచ్చినా, రేవూరి వచ్చినా పరకాల నుంచి తానే అభ్యర్థినని ఆమె ప్రకటించింది. దీంతో దుమారం రేపిన సుస్మిత వ్యాఖ్యలపై అధిష్టానం దృష్టి సారించింది. ఈ వ్యాఖ్యలకు మంత్రి కొండా సురేఖ బాధ్యత వహిం చాల్సి ఉంటుందన్న అభిప్రాయంతో టిపిసిసి క్రమశిక్షణ సంఘం నోటీసు జారీ చేయడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**మంత్రి సురేఖ వివరణ తీరుపై భగ్గు..**
టిపిసిసి క్రమశిక్షణ సంఘం చైర్మన్ మల్లు రవికి గురువారం వివరణతో కూడిన లేఖను అందజేసిన మంత్రి కొండా సురేఖ.. సుస్మిత చేసిన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగత అభిప్రాయాలని.. వాటిని తనకు ఆపాదించడం తగదని స్పష్టం చేశారు. బంధుత్వం కారణంగా ఒకరి వ్యక్తిగత అభిప్రాయాలకు మరొకరు రాజకీయంగా బాధ్యత వహించాలనడం సము చితం కాదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హనుమకొండ డిసిసి కార్యాలయంలో ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసిన రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, రెండు జిల్లాల డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రాంరెడ్డి, ఆయూబ్ తదితరులు కొండా సురేఖ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమెను పార్టీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేయడం కలకలంగా మారింది.

**అధిష్టానం నిర్ణయంపై ఉత్కంఠ..**
ఇటీవలి పరిణామాలు చూస్తే.. కొండా సురేఖ కుటుంబం వర్సెస్ ఒక్క రేవూరి వ్యవహారం కాదని స్పష్టమవుతోంది. సురేఖ వివరణ, పార్టీ కీలక నేతల తాజా డిమాండ్ల నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది. మారింది. సుస్మిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకుంటా రా? సురేఖకు ఇచ్చిన నోటీసుపై పార్టీ ఏ నిర్ణయం తీసుకుంటుంది? కొండా వ్యతిరేకవర్గం రీ యూనియన్ నేతలు డిమాండ్లు ఏ మేరకు పరిష్కరించుకుంటారు? రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారితీసిన జిల్లా కాంగ్రెస్ రాజకీయాలు ఏవిధమైన మలుపులు తిరగనున్నాయి? అన్న చర్చ ఇటు రాజకీయ విశ్లేషకులు, అటు పార్టీ కేడర్‌లో సాగుతోంది.



# సమ్మెకు ఎఐటియుసి మద్దతు


● డ్రైవర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి: ఎస్.బాల్‌రాజ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని ఆటో, క్యాబ్, వ్యాన్, స్కూల్ వాహన డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. డ్రైవర్ల సమ్మెకు ఎఐటియుసి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఆటో, ఇతర రవాణా రంగ డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తామని ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటో డ్రైవర్ల ఆదాయం గణనీయంగా తగ్గిందని అన్నారు. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలను పెంచి డ్రైవర్లను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల కోసం సమగ్ర సంక్షేమ చట్టాన్ని తీసుకురావాలని, ప్రమాదాలకు గురైనప్పుడు నష్టపరిహారం అందించడంతో పాటు ఆటోలకు ప్రభుత్వమే బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఓలా, ఊబర్, రాపిడో వంటి ప్రైవేట్ యాప్‌లకు ప్రత్యామ్నాయంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించి డ్రైవర్లకు ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న సమ్మెలో ఎఐటియుసి ప్రత్యక్షంగా పాల్గొంటుందని ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆటో డ్రైవర్లు సమ్మెకు సంఘీభావం తెలిపి ఐక్యంగా పోరాడాలని బాల్‌రాజ్ పిలుపునిచ్చారు. పోరాటాలు, ఉద్యమాల ద్వారానే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, డ్రైవర్లకు ఎఐటియుసి అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

**ఆటో, క్యాబ్‌ల నిరవధిక రాష్ట్రవ్యాప్త బంద్‌కు సంపూర్ణ మద్దతు: తెలంగాణ టాక్సీ డ్రైవర్స్, ఓనర్స్ జెఎసి**
దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర ఆటో, క్యాబ్, యాప్ ఆధారిత సంఘాల జెఎసి ఈ నెల 23 తేదీ అర్ధరాత్రి నుండి తలపెట్టిన నిరవధిక రాష్ట్రవ్యాప్త బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని తెలంగాణ టాక్సీ డ్రైవర్స్, ఓనర్స్ జెఎసి నేతలు బైరగోని రాజు గౌడ్ (టిఎంటిడియు), సతీష్ కుమార్ (టిఆర్‌సిపిటియు), రవి గౌడ్ (టిఎస్‌సిపిఎ), కిరణ్ కుమార్ (సిసిడిఎ), వినయ్ భూషణ్ (అమ్మ క్యాబ్స్), మహేందర్ (టిఆర్‌పికె)లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది టాక్సీ, క్యాబ్ డ్రైవర్లు ఈ నిరవధిక రాష్ట్ర బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో శుక్రవారం తెలంగాణ టాక్సీ డ్రైవర్స్, ఓనర్స్ జెఎసి రాష్ట్ర నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో, క్యాబ్ డ్రైవర్లవి న్యాయమైన సమస్యలు అని, రాష్ట్ర ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండానే పరిష్కరించవచ్చని తెలిపారు. లేనిపక్షంలో ఈనెల 23 తేదీ అర్ధరాత్రి నుండి జరిగే నిరవధిక రాష్ట్ర బంద్‌లో టాక్సీ, క్యాబ్ డ్రైవర్లు ప్రత్యేక్షంగా పాల్గొని రాష్ట్రంలో రవాణా వ్యవస్థను స్థంబింపజేస్తామని వారు హెచ్చరించారు.

# అర్హులైన ప్రతి పేద కుటుంబానికీ ఇందిరమ్మ ఇల్లు

● సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
● ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు



**ప్రజాపక్షం/జగిత్యాల :** అర్హులైన ప్రతి పేద కుటుంబానికి కులం, మతం, రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇల్లు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం జగిత్యాల పట్టణంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్ సాధికారిత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సిసిఎల్ఎ కమిషనర్ లోకేష్‌కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు, హౌసింగ్ ఎం.డి. గౌతమ్, వెలమ సంక్షేమ సంఘం కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడ నరసింగరావు, జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ తదితరులతో కలిసి మంత్రి పాల్గొన్నారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కృషి చేస్తోందని, సంక్షేమ కార్యక్రమాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు.గత ప్రభుత్వం నూకపల్లి 2బీహెచ్‌కే కాలనీలో అవసరమైన మౌలిక వసతుల కల్పనపై నిర్లక్ష్యం చేసిందని మంత్రి అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి దశలో రూ.32 కోట్లతో తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. నూకలపల్లి 2బీహెచ్‌కే కాలనీలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని, బస్సు సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్‌ను మంత్రి ఆదేశించారు. కాలనీలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. 2008లో పునాది వేసిన కాలనీలో 18 సంవత్సరాల తర్వాత ప్రజలకు అవసరమైన సౌకర్యాలతో ఇళ్లు అందించగలిగామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం మరోసారి పత్రికా ప్రకటన ఇచ్చి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, క్షేత్రస్థాయిలో విచారణ అనంతరం అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నూకలపల్లి 2బీహెచ్‌కే కాలనీలో పెండింగ్ పనులు పూర్తి చేసి మౌలిక వసతులు కల్పించేందుకు రూ.72 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ధర్మపురి ప్రజల చిరకాల కోరిక అయిన రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని, ధర్మపురిలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం మంజూరు చేయాలని మంత్రి పొంగులేటిని కోరారు. మల్యాల మండలంలో చెరువులో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందిన ఇద్దరు చిన్నారుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందిస్తున్నట్లు తెలిపారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ నూకపల్లి 2బీహెచ్‌కే కాలనీలో తాగునీరు, విద్యుత్ సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం రూ.18 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఎమ్మెల్సీ ఎల్. రమణ మాట్లాడుతూ పేదలకు గౌరవప్రదమైన ఇళ్లు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో మొత్తం 10,365 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 2,208 ఇళ్లు నిర్మాణం పూర్తయ్యే దశలో ఉన్నాయని తెలిపారు. ఇప్పటివరకు 8,079 మంది లబ్ధిదారులకు రూ.227 కోట్ల 32 లక్షలు విడుదల చేసినట్లు వెల్లడించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వెలమ సంక్షేమ సంఘం కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడ నరసింగరావు మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను స్వాగతించారు. అనంతరం ఇటీవల చెరువులో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందిన ఇద్దరు చిన్నారుల కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందజేశారు. అనంతరం 12 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, అదనపు కలెక్టర్లు లత, రాజ గౌడ్, జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనభట్ల దినేష్, జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల ఆర్డీవోలు మధుసూదన్, నరసింహారావు, జీవాకర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# అనుమతి నిరాకరణపై విహెచ్ ఫైర్

తెలంగాణలో పెట్టుబడులకు కేంద్రం అడ్డంకులు సృష్టిస్తోంది



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు అనుమతి ఇవ్వకపోవడం వెనుక బిజెపి నేతల కుట్ర ఉందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు ఆరోపించారు. తెలంగాణలో పెట్టుబడులు తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతుంటే కేంద్ర ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందని విమర్శించారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వి.హనుమంతరావు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ చెబుతున్న 'వికసిత్ భారత్'లో తెలంగాణ భాగస్వామ్యం కాకుండా అడ్డుకోవాలనే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి అమెరికా పర్యటన ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ అనుమతి నిరాకరించడం సరైన చర్య కాదన్నారు. తెలంగాణలో మెజారిటీగా ఉన్న బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ వర్గాలకు జనాభా దామాషా ప్రకారం న్యాయం జరగాలన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ లక్ష్యం కోసం పార్టీ చిత్తశుద్ధితో పనిచేస్తోందని వి.హెచ్. తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జనగణనలో ఒబిసి జనాభా వివరాలను నమోదు చేయకుండా బిజెపి అడ్డంకులు సృష్టిస్తోందని ఆయన విమర్శించారు. జనాభా ప్రాతిపదికన సామాజిక న్యాయం అందాలంటే ఒబిసిలకు సంబంధించిన కచ్చితమైన గణాంకాలు అవసరమని పేర్కొన్నారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నిర్ణయం మేరకు ఈ నెల 25న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఒబిసి మహాసభ నిర్వహించనున్నట్లు వి.హనుమంతరావు వెల్లడించారు.

# బకాయి మిల్లర్లపై ఉక్కుపాదం

● సివిల్ సప్లైస్‌లోకి గ్రేహౌండ్స్, ఆక్టోపస్ కమాండోలు
● 28 మందితో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్.. రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు: ఎం.స్టీఫెన్ రవీంద్ర

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వానికి బియ్యం అప్పగించకుండా బకాయిపడిన మిల్లర్లపై తెలంగాణ పౌరసరఫరాల శాఖ కఠిన చర్యలకు సిద్ధమైంది. ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ విభాగంలో గ్రేహౌండ్స్, ఆక్టోపస్‌కు చెందిన 28 మంది అత్యుత్తమ కమాండోలను నియమించి ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసింది. బకాయి మిల్లర్లపై రాష్ట్రవ్యాప్తంగా ముమ్మర తనిఖీలు చేపట్టేందుకు ఈ బృందాలు రంగంలోకి దిగనున్నాయి. సివిల్ సప్లైస్ కమిషనర్ ఎం.స్టీఫెన్ రవీంద్ర శుక్రవారం సివిల్ సప్లైస్ భవన్‌లో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి కొత్తగా విధుల్లో చేరిన కమాండోలకు దిశానిర్దేశం చేశారు. శాఖ నిబంధనలు, చట్టపరమైన అంశాలపై కమాండోలకు ఇప్పటికే మూడు రోజులపాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. తెలంగాణ పోలీస్ అకాడమీలో నిత్యావసర వస్తువులకు సంబంధించిన చట్టాలపై వారికి అవగాహన కల్పించినట్లు చెప్పారు. కమాండోలకు ఆకస్మిక తనిఖీల్లో ఉన్న ప్రత్యేక నైపుణ్యాన్ని సివిల్ సప్లైస్ శాఖ వినియోగించుకోనుందని తెలిపారు. ప్రభుత్వ సొమ్మును పక్కదారి పట్టించినా, నిబంధనలు ఉల్లంఘించినా ఉపేక్షించేది లేదని కమిషనర్ హెచ్చరించారు. ప్రభుత్వానికి బియ్యం అప్పగించకుండా బకాయిపడిన మిల్లర్ల వద్ద ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపడతాయని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన మిల్లర్లపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**154 లక్షల టన్నుల వడ్ల సేకరణ..**
గత సీజన్ (కెఎంఎస్2025–26)లో రాష్ట్ర చరిత్రలోనే అత్యధికంగా 154 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను సేకరించినట్లు కమిషనర్ తెలిపారు. రైతుల నుంచి వడ్ల కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.40వేలకోట్లు ఖర్చు చేసిందని పేర్కొన్నారు.

# పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా

● ఆందోళన చేస్తున్న విద్యార్థులతో మంత్రి వివేక్ ముఖాముఖి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పాలిటెక్నిక్‌లను శక్తి (కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీలు గనుల) శాఖ పరిధిలోకి తీసుకురావడంపై విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. మాసబ్‌ట్యాంక్ పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థుల వద్దకు వెళ్లిన మంత్రి వారితో నేరుగా మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు. పాలిటెక్నిక్‌ల శాఖ మారినప్పటికీ విద్యార్థుల చదువులు, పరీక్షలు, సిలబస్, డిప్లొమా సర్టిఫికెట్లు, ఫీజులు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇసెట్, లేటరల్ ఎంట్రీ వంటి అంశాల్లో ఎలాంటి మార్పులు ఉండవని మంత్రి హామీ ఇచ్చారు. ఇప్పటికే పాలిటెక్నిక్‌లలో చదువుతున్న విద్యార్థుల ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలగదన్నారు.

**పాలిటెక్నిక్‌లను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదు..**
పాలిటెక్నిక్‌లను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని, అవి ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగుతాయని మంత్రి స్పష్టం చేశారు. పరిశ్రమల భాగస్వామ్యం కేవలం ఆధునిక సాంకేతిక శిక్షణ, సిఎస్ఆర్ నిధులు, ఉపాధి అవకాశాల పెంపునకు మాత్రమేనని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల విద్య, పరీక్షలు, ఫీజులు, ఇతర ప్రయోజనాలకు పూర్తి బాధ్యత వహిస్తుందన్నారు. పాలిటెక్నిక్‌లను ఆధునికీకరించేందుకు సుమారు రూ.600 కోట్ల నుంచి రూ.800 కోట్ల వరకు నిధు లు ఖర్చు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. ఆధునిక పరికరాలు, మెరుగైన మౌలిక సదుపాయాలు, కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులకు శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులను ప్రవేశపెట్టి ఉద్యోగ అవకాశాలను పెంచుతామని తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలల సిబ్బంది జీతాలు, ప్రమోషన్లు, సర్వీస్ కండిషన్లలో ఎలాంటి మార్పులు ఉండవని మంత్రి స్పష్టం చేశారు. వారు ప్రభుత్వ ఉద్యోగులుగానే కొనసాగుతారని తెలిపారు. భవిష్యత్తులో పాలిటెక్నిక్‌ల అభివృద్ధికి అనుగుణంగా మరిన్ని పోస్టులు, ప్రమోషన్ అవకాశాల కల్పనపైనా పరిశీలిస్తామని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వం పూర్తి బాధ్యత వహిస్తుందని, శాఖ మార్పుపై ఎలాంటి భయాలు, అపోహలు పెట్టుకోవద్దని మంత్రి వివేక్ వెంకటస్వామి కోరారు. విద్యార్థుల సందేహాలు, సమస్యలను నేరుగా విని పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధం గా ఉందన్నారు.

# మోదీకి నిద్ర లేకుండా చేస్తున్నది కమ్యూనిస్టులే




● రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం భూ పోరాట కేంద్రం రావి నారాయణరెడ్డి నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన ప్రజా చైతన్య యాత్ర ముగింపు సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/రంగారెడ్డి/తుర్కయంజాల్:** నరేంద్ర మోదీకి నిద్ర లేకుండా చేస్తున్నది కమ్యూనిస్టులేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలం భూ పోరాట కేంద్రం రావి నారాయణరెడ్డి నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన ప్రజా చైతన్య యాత్ర ముగింపు సభలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహా, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, ఓరుగంటి యాదయ్య, కె.రామస్వామి, బుద్ధుల జంగయ్య, పల్లె నర్సింహా, పైమీదతోపాటు ప్రజా చైతన్య యాత్ర రథసారధులతో కలిసి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా రావి నారాయణరెడ్డి కాలనీలో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ నక్సలైట్లు దేశద్రోహులని, నక్సలైట్లు లేని ముక్త్ భారత్ చేశామని పదే పదే ప్రగల్భాలు పలికే ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాలు ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఇంకా దిమాగి నక్సలైట్లు (మేదో నక్సలైట్లు) తలుచుకోవడం జరిగిందన్నారు. ఢిల్లీలో విద్యార్థులు చేపట్టిన పోరాటం వెనుక కమ్యూనిస్టులు ఉన్నారని మోదీ మాట్లాడిన విషయాన్ని సాంబశివరావు గుర్తు చేశారు. ప్రజావ్యతిరేకులైన పాలకుల శవపేటికలను తయారు చేసేది కూడా కమ్యూనిస్టులు అని ఆయన స్పష్టం చేశారు. గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు ఇండ్లు ఇప్పించేందుకు తాము గుడిసెలు వేసుకొని ఇక్కడే ఉండేందుకు వెనుకాడబోమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు భరోసా ఇచ్చారు. పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా రాజకీయ ప్రచారానికే ప్రాధాన్యత ఇవ్వడం సరికాదన్నారు. ప్రజా సమస్యలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే ప్రజా చైతన్య యాత్ర లక్ష్యమని, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా పోరాడాలని పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. ఆందోజు రవీంద్ర చారి మాట్లాడుతూ అరాచక పాలనతో విసిగిపోయిన దేశ ప్రజలు విసిగిపోయారన్నారు. వ్యవస్థలో ఉన్న అన్ని రంగాలు తీవ్రమైన లోపలతో, ఇబ్బందులతో సతమాతం అవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సామిడి శేఖర్ రెడ్డి, పబ్బతి లక్ష్మణ్, శివకుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యులు సామిడి వంశీ వర్ధన్ రెడ్డి, గ్యార క్రాంతి, శ్రీదేవి, ప్రభు లింగం, దత్తు నాయక్, మాధవ రెడ్డి, అజ్మీర్ హరిసింగ్ నాయక్, సుధాకర్, సత్యనారాయణ, మధు పాల్గొన్నారు.

సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, వెస్ట్ సర్కిల్, హైదరాబాద్.
తెలంగాణ వైద్య సేవల మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (TGMSIDC)
జిల్లా ఆసుపత్రి ప్రాంగణం, కింగ్ కోఠి, హైదరాబాద్ - 500 001.

టెండర్ నోటీసు నం: 04/SE/TGMSIDC/West Cir-Hyd/2026-27/172, తేదీ:21.08.2026

హైదరాబాద్‌లోని కోఠిలో గల DM & HS క్యాంపస్ ప్రాంగణంలో ఉన్న పాత APVVP-2 RCC ఫ్రేమ్డ్ స్ట్రక్చర్ భవనం యొక్క గ్రౌండ్ ఫ్లోర్ మరియు మొదటి అంతస్తుల మరమ్మతులు మరియు పునరుద్ధరణ పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ వేదిక ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనవి. ఉప-పనులు: A) AV సిస్టమ్ సరఫరా మరియు ఏర్పాటు. B) ఫర్నిచర్ వస్తువుల సరఫరా. ఇతర వివరాలను www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

సం/-
సూపరింటెండింగ్ ఇంజనీర్
DIPR R.O. No. : 8381-PP/CL/ADVT/2026-27, Date: 21-08-2026

GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
టెండర్ నోటీస్

| Sl. No. | NIT No. | ప్రొడక్ట్స్ / పనుల పేరు | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా, సెల్ నెం. |
| --- | --- | --- | --- | --- |
| 1 | 1/SE/SWM/ GHMC/ 2026-27, తేది: 21.08.2026 | 2026 వినాయక చవితి ఉత్సవాల కోసం GHMCకి 8 అంగుళాలు, 1 అడుగు మరియు 1.5 అడుగుల పరిమాణంలో మట్టి వినాయక విగ్రహాల సరఫరా మరియు పంపిణీకి సంబంధించి, 'L1' ధరను ఖరారు చేయడానికి ఏజెన్సీలను ఎంపిక చేయడం. | బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 22.08.2026 ఉ.10.00గం.లకు, ఆఫ్‌లైన్ బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 29.08.2026 ఉ.10.30గం.ల వరకు | ఒ/ఒ. ఎస్‌ఇ (ఎస్‌డబ్ల్యుఎం), 4వ అంతస్తు, సిసి కాంప్లెక్స్, జిహెచ్‌ఎంసి హెచ్‌ఒ, ట్యాంక్‌బండ్ రోడ్, హైదరాబాద్. సెల్: +91-8179221424 |

https://www.ghmc.gov.in లోని "downloads" - "Tender Notification" సెక్షన్ నుండి టెండర్ పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్‌డబ్ల్యుఎం), జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 8409-PP/CL/ADVT/2026-27, Date: 21-08-2026

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
శనివారం
22-08-2026
www.prajapaksham.in
మహానగరి
GREATER HYDERABAD

## ఓటరు సమగ్ర జాబితాను విధిగా పరిశీలించండి

కొందుర్గు మండల పార్టీ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి

**ప్రజాపక్షం/కొందుర్గు:** ఓటరు సమగ్ర జాబితాను విధిగా పరిశీలించుకునేందుకు ఓటర్లు కృషి చేయాలని కొందుర్గు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోగురి పురుషోత్తంరెడ్డి సూచించారు. తెలంగాణలో చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం ముసాయిదా విడుదల చేసిన నేపథ్యంలో ప్రతి ఒక్కరు తమ పేర్లను పరిశీలించుకోవాలని పేర్కొన్నారు. ఓటర్ల ముసాయిదాలో తమ పేర్లు ఉన్నాయా..లేదా అనేది ఒకటి రెండు సార్లు పరిశీలించుకోవాలని, ముసాయిదా పట్ల ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా పేర్లు లేకుండా పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఓటరు తమ పేర్లను మాత్రమే కాకుండా కుటుంబ సభ్యుల పేర్లు, స్నేహితుల పేర్లు సైతం పరిశీలించాలని సూచించారు. ఓటరు జాబితాలో పేర్లు లేకుంటే ఫామ్ నంబర్ 6 ద్వారా ధరఖాస్తులు చేసుకోవాలని ఆకాంక్షించారు. ఓటర్ల జాబితా పరిశీలనలో భాగంగా ఎవరికైనా ఎన్నికల అధికారుల నుండి నోటీసులు అంధితే నిర్లక్ష్యం చేయకుండా ఆ నోటీసులో సూచించిన విధంగా ఓటరు గుర్తింపు కార్డు లేదా ఎన్నికల సంఘం సూచించిన గుర్తింపు పత్రాలను సమర్పించాలని సూచించారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవడంతోపాటు తమ కుటుంబ సభ్యులు, పరిచయస్తుల పేర్లను తనిఖీ చేయాల్సి బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని పేర్కొన్నారు. మీ ఓటు మీ హక్కు దాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని గుర్తు చేశారు.

## హయత్‌నగర్ కోర్టులో మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తా


ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి



**ప్రజాపక్షం /హయత్ నగర్ :** హయత్‌నగర్ కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు కోర్టుకు వచ్చే కక్షిదారులు,ప్రజలు ఎదురుకొంటున్న మౌలిక వసతులు ఏర్పాటుకుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి అన్నారు .హయత్ నగర్ కోర్టు బార్ అసోసియేషన్ ప్రతినిధులు వినతి మేర శుక్రవారం శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కోర్ట్ ప్రాంగణానికి విచ్చేసి లాయర్లతో కలిసి పరిశీలించినారు .ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ హయత్‌నగర్ కోర్టులో సుమారు 200 మంది న్యాయవాదులు కోర్టుకు వచ్చే కక్షిదారులు,ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని. కోర్టు ప్రాంగణంలో పార్కింగ్,రహదారులు,డ్రైనేజీ,తాగునీరు తదితర మౌలిక వసతులను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు.కోర్టుకు వచ్చే ప్రజలు,న్యాయవాదులు ఇబ్బందులు పడకుండా అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు.బార్ అసోసియేషన్ ప్రతినిధుల వినతిని సానుకూలంగా స్వీకరించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సంబంధిత సమస్యలను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో హయత్ నగ ర్ డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు చెన్నగోని శ్రీధర్ గౌడ్,భాస్కర్ సాగర్,బోడ బిక్షపతి మరియు హయత్‌నగర్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు పల్లె లింగంగౌడ్ తదితర లాయర్లు పాల్గొన్నారు.

## పోచమ్మ ఆశీస్సులు ఉండాలి

కేశంపేట మాజీ ఎంపిపి వై.రవీందర్ యాదవ్



**ప్రజాపక్షం/కేశంపేట:** పోచమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని అమ్మవారికి వేడుకున్నట్లు మాజీ ఎంపిపి వై.రవీందర్ యాదవ్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం కేశంపేట మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్దలతో నిర్వహించారు. మాజీ ఎంపిపి వై.రవీందర్ యాదవ్ ముఖ్యఅతిధిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. బోనాల ఊరేగింపులో పాల్గొని పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పునకాలను వీక్షించారు. పోచమ్మతల్లి అమ్మవారి అశీస్సులు గ్రామస్తులందరిపై ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సభ్యుడు పల్లె నర్సింగ్‌రావు, ప్రేమ్‌కుమార్ గౌడ్, జగన్మోహన్‌రెడ్డి, సర్పంచ్ సులోచన శ్రీను, ఉప సర్పంచ్ ప్రమోద్‌రెడ్డి, నవీన్‌కుమార్, జమాల్ ఖాన్, తోట వెంకటేష్, ఉప సర్పంచ్ కంచుకోట నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## శాసన మండలిలో సిద్దాపూర్ చెత్త డంపింగ్ యార్డుపై ప్రస్తవిస్తా

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్ :** శాసన మండలిలో సిద్దాపూర్ చెత్త డంపింగ్ యార్డు విషయాన్ని ప్రస్తావించి ప్రజల పక్షాన పోరాటం చేస్తానని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి వివరించారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్సీ కార్యాలయంలో సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సిద్దాపూర్‌లో ఏకో టౌన్ పేరుతో చెత్త డంపింగ్ యార్డు ఏర్పాటు చేసేందుకు 86ఎకరాల ప్రభుత్వ భూమిని జిహెచ్‌ఎంసికి ఇస్తూ జిఒ 641 తీసుకువచ్చిందని వివరించారు. ప్రభుత్వం ఇచ్చిన ఈ జిఒను రద్దు చేసేందుకు శాసన మండలి దృష్టికి తీసుకువెళ్ళనున్నట్లు తెలిపారు. ప్రజల పక్షాన తాను ఎల్లప్పుడు పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని, ప్రజలకు అన్యాయం చేస్తే ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు. సిద్దాపూర్ చెత్త డంపింగ్ యార్డు కోసం తీసుకువచ్చిన 641జిఒను రద్దు చేసే వరకు జెఎసి నాయకులు పోరాటాలను ఉధృతం చేయాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్న పోరాటాల్లో యువతను తీసుకువచ్చి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. జెఎసి నాయకులు మాట్లాడుతూ పచ్చని పంట పోలాల మధ్య చిచ్చు పెట్టే విధంగా చెత్త డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం సరైన పద్దతి కాదని హెచ్చరించారు. స్థానిక ప్రజలు, రైతులు వ్యవసాయం, పాడి పంటలపై ఆదారపడి జీవిస్తుంటారని, అలాంటి పరిస్థితుల్లో కాలుష్యం వెదజల్లే డంపింగ్ యార్డు తీసుకురావడం సరైనది కాదని హెచ్చరించారు. ఈ సమావేశంలో జేఏసి చైర్మెన్ మూడావత్ రాంబల్‌నాయక్, కన్వీనర్ పిన పాక ప్రభాకర్, కో ఆర్డినేటర్ తిరుమలయ్య, కో చైర్మెన్లు బోధనం శ్రీనివాస్ రెడ్డి, వడ్డే బాలయ్య, ఈశ్వర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# సర్వాంగ సుందరంగా సున్నం చెరువు

ఆంజనేయ ఆలయానికి నూతన శోభ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాధాపూర్ గుట్టల బేగంపేటలోని సున్నం చెరువు రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. ఒకవైపు బోరబండ బస్తీ, మరోవైపు ఐటి కారిడార్ మధ్య మురికి కూపంగా మారిన ఈ చెరువును హైడ్రా అధికారులు సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఒకప్పుడు ఆక్రమణలు, మురుగు నీరు, చెత్తాచెదారంతో దుర్భరంగా మారిన మాధాపూర్ గుట్టల బేగంపేటలోని సున్నం చెరువు ఇప్పుడు సరికొత్త రూపును సంతరించుకుంటోంది. హైడ్రా చేపట్టిన అభివృద్ధి పనులతో చెరువు పూర్వ వైభవాన్ని తిరిగి పొందుతోంది. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన విహార కేంద్రంగా తీర్చిదిద్దే పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఆక్రమణల కారణంగా 14.20 ఎకరాలకు కుంచించుకుపోయిన చెరువును హైడ్రా చర్యలతో తిరిగి 30.5 ఎకరాలకు విస్తరించింది. శాశ్వత నివాసాలను తొలగించకుండా ఆక్రమణలను మాత్రమే తొలగించడం విశేషం. చెరువులో నిల్వ ఉన్న నీటిలో పాదరసం, సీసం, ఆర్సెనిక్, ఫ్లోరైడ్ పురుగుమందుల అవశేషాలు వంటి హానికర పదార్థాలు ఉన్నట్లు కాలుష్య నియంత్రణ మండలి నివేదిక వెల్లడించడంతో, మురుగు నీటి అక్రమ కార్యకలాపాలకు హైడ్రా అడ్డుకట్ట వేసింది. చెరువులో మూడు మీటర్ల వరకు పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి, దుర్వాసనను పూర్తిగా నివారించింది. ప్రస్తుతం చెరువు చుట్టూ నిర్మించిన విశాలమైన బండ్ ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివస్తున్నారు. అభివృద్ధి పనులు పూర్తయిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా చెరువును ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో గుడిసెల్లో నివసిస్తున్న అర్హులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అందించేందుకు కూడా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.





### ఆంజనేయ ఆలయానికి నూతన రూపు

చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో దుర్భర పరిస్థితుల్లో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయాన్ని కూడా హైడ్రా ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తోంది. ఆలయ కమిటీ ప్రతినిధులతో పలుమార్లు సమావేశమై వారి సూచనల మేరకు గోపుర నిర్మాణం చేపట్టింది. ఆలయానికి వెళ్లే మార్గాన్ని విస్తరించడంతో పాటు ప్రదక్షిణ మార్గం, భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు పాలరాతి గజిబోలను ఏర్పాటు చేస్తోంది. ఆలయం ముందు వాటర్ ఫౌంటెన్‌లో ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ అభివృద్ధి కార్యక్రమాలను ఆలయ కమిటీ స్వాగతిస్తుండగా, కొందరు వ్యక్తులు ఆలయాన్ని తొలగిస్తున్నారంటూ తప్పుడు ప్రచారం చేస్తూ గందరగోళం సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారని కమిటీ ప్రతినిధులు అంటున్నారు.

### పర్యాటక కేంద్రంగా సున్నం చెరువు

చెరువు చుట్టూ విశాలమైన వాకింగ్ ట్రాక్, రాతి బెంచీలు, గజిబోలు, పిల్లల ఆట స్థలాలు, ఓపెన్ జిమ్‌లు, పచ్చిక బయళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఔషధ, సుగంధ మొక్కలతో పాటు నీడనిచ్చే వృక్షాలను నాటి పచ్చదనాన్ని పెంచుతున్నారు. పరిసర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలను 2 నుంచి 3 డిగ్రీల వరకు తగ్గించేలా పర్యావరణ హిత చర్యలు చేపడుతున్నారు. బతుకమ్మ వేడుకల కోసం ప్రత్యేక బేబీ పాండ్‌ను సిద్ధం చేస్తుండగా, భవిష్యత్తులో బోటింగ్ సదుపాయాన్ని కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. చెరువు గట్టు చుట్టూ సోలార్ లైట్లు, పటిష్ఠమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు సమీపంలోని సహజ సిద్ధమైన కొండను కూడా ఆకర్షణీయంగా అభివృద్ధి చేస్తున్నారు. దీంతో సున్నం చెరువు నగరవాసులకు పర్యావరణ హితమైన విహార కేంద్రంగా ఆకర్షణగా మారనుంది.

## 34 శాతం బిసి రిజర్వేషన్లకు చట్టబద్ధ రక్షణ

ఎపి సిఎం చంద్రబాబుకు జాజుల శ్రీనివాస్‌గౌడ్ లేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ స్వాగతించారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలంటే న్యాయపరమైన అడ్డంకులను అధిగమించేందుకు రాజకీయంగా నిర్ణయం తీసుకోవాలని ఆయన ఎపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలంటే రాష్ట్రంలోని బిసి సంఘాలతో చర్చించి సమగ్ర కార్యాచరణ రూపొందించాలని జాజుల సూచించారు. దేశవ్యాప్తంగా సామాజిక రిజర్వేషన్లకు ఉన్న 50 శాతం పరిమితి ప్రధాన అడ్డంకిగా ఉందని పేర్కొన్నారు. ఈ పరిమితిని తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని కోరారు. తెలంగాణ, బీహార్ లో కులగణన, డెడికేషన్ కమిషన్ల ఏర్పాటు తదితర చర్యలు చేపట్టినప్పటికీ 50 శాతం పరిమితిని దాటిన రిజర్వేషన్లపై న్యాయపరమైన అడ్డంకులు ఎదురయ్యాయని గుర్తుచేశారు. ఎపిలో సమగ్ర కులగణన జరగకపోవడం, ఇటీవల ఏర్పాటు చేసిన డెడికేషన్ కమిషన్ 27 శాతం బిసి రిజర్వేషన్లకే సిఫార్సు చేయడం వంటి అంశాలు ఉన్నందున 34 శాతం రిజర్వేషన్ల అమలు అంత సులభం కాదన్నారు. బిసిలకు 34 శాతం రిజర్వేషన్లను పటిష్టంగా అమలు చేయాలంటే సిఎం చంద్రబాబు అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో భేటీ కావాలని జాజుల కోరారు. రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని తొలగించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు.

## రాష్ట్రంలో స్కూళ్లు, కాలేజీలు బాగాలేవని కెటిఆర్ పిల్లలే చెబుతున్నారు

సామ రామ్మోహన్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో స్కూళ్లు, కాలేజీలు బాగాలేవని కెటిఆర్ పిల్లలే చెబుతున్నారని టిపిసిసి అధికార ప్రతినిధి సామ రామ్మోహన్‌రెడ్డి విమర్శించారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీ, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తూ విద్యార్థులకు మెరుగైన విద్య, నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తోందన్నారు. అయితే బిఆర్‌ఎస్, బిజెపిలు విద్యార్థులను రెచ్చగొట్టి పక్కదారి పట్టించే రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. బిఆర్‌ఎస్ నేతల పిల్లలు విదేశాల్లో మెరుగైన విద్య అభ్యసించాలనుకోవడం, రాష్ట్రంలోని విద్యార్థుల భవిష్యత్తును మాత్రం నాశనం చేయాలని చూడటం సరి కాదన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఉన్నత విద్యలో అంతర్జాతీయ ప్రమాణాలను రాష్ట్రానికి తీసుకురావాలనే ఉద్దేశంతో సిఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనకు ప్రయత్నించారని, అమెరికాలో అందిస్తున్న ఆధునిక విద్యా విధానాలను తెలంగాణకు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం శక్తి స్కీమ్‌ను తీసుకొచ్చిందని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలతో పాలిటెక్నిక్‌లలో అడ్మిషన్లు పెరుగుతున్నాయని, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా విద్యార్థులకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని సామ రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.



## ఆసియా కరాటే ఛాంపియన్‌షిప్‌కు తెలంగాణ క్రీడాకారుల ఎంపిక

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 2026 ఎకెఎఫ్ క్యాడెట్, జూనియర్, అండర్–21 ఆసియా కరాటే ఛాంపియన్‌షిప్‌కు తెలంగాణకు చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ స్పోర్ట్స్ కరాటేడూ అసోసియేషన్ అధ్యక్షుడు, టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ వారిని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో సన్మానించి అభినందించారు. జోర్డాన్‌లోని అమ్మాన్‌లో సెప్టెంబర్ 4 నుంచి 11 వరకు జరిగే పోటీల్లో విశాల్ రెడ్డి అమ్రాడి, సత్య తేజ బ్రహ్మాండాని, నిష్ఠ గంగిసెట్టి, శశాంక్ సాత్విక్ లంకె తెలంగాణ తరపున బరిలోకి దిగనున్నారు. ఆసియా స్థాయిలో రాణించి పతకాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని మహేష్ కుమార్ గౌడ ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోచ్‌లు, కరాటే అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## జనసేన తెలంగాణ అధికార ప్రతినిధిగా డాక్టర్ గడల శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జనసేన పార్టీ తెలంగాణ అధికార ప్రతినిధిగా మాజీ హెల్త్ డైరెక్టర్, పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్. గడల శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు జనసేన పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన జనసేన పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు డాక్టర్. గడల శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధికార ప్రతినిధిగా బాధ్యతను వినమ్రతతో, నిబద్ధతతో స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలు, విధానాలతో పాటు ప్రజా సమస్యలపై జనసేన వైఖరిని స్పష్టంగా, హుందాగా, బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజాసేవే తన రాజకీయ ప్రయాణానికి ప్రధాన లక్ష్యమని, బాధ్యతలు మారినా ప్రజలే ప్రథమం, ప్రజాసేవే పరమావధి అన్నదే తన ధ్యేయమని స్పష్టం చేశారు. తెలంగాణలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలను నిరంతరం వెలుగులోకి తీసుకువచ్చి పార్టీకి, ప్రజలకు మధ్య బలమైన వారధిగా పనిచేస్తానని డాక్టర్. గడల శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, పార్టీ నాయకత్వం, జనసైనికులు, వీర మహిళలు, పార్టీ శ్రేణులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## చర్లపల్లి—కాకినాడ మధ్య ప్రత్యేక రైళ్లు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని చర్లపల్లి– కాకినాడ టౌన్ మధ్య ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఈ మేరకు రెండు ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేసింది. రైలు నంబర్ 07039 చర్లపల్లి నుంచి కాకినాడ టౌన్‌కు ఆగస్టు 27న (గురువారం) రాత్రి 7.50 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 9.30 గంటలకు కాకినాడ టౌన్ చేరుకుంటుంది. అదేవిధంగా రైలు నంబర్ 07040 కాకినాడ టౌన్ నుంచి చర్లపల్లికి ఆగస్టు 28న (శుక్రవారం) సాయంత్రం 6.50 గంటలకు బ యలుదేరి, మరుసటి రోజు ఉదయం 7.30 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు ఇరు మార్గాల్లో నల్గొండ, మిర్యాలగూడ, గుంటూరు, విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, తణుకు, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్లలో ఆగుతాయి. ప్రత్యేక రైళ్లలో 1,ఎసి స్లీపర్, జనరల్ సెకండ క్లాస్ కోచ్‌లు అందుబాటులో ఉంటాయని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది.

## కాలుష్యాన్ని నియంత్రించేందుకే ఎలక్ట్రిక్ వాహనాలు


షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** సమాజంలో పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు మార్కెట్‌లోకి ఎలక్ట్రిక్ వాహనాలు అందుబాటులోకి వస్తున్నాయని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. శుక్రవారం పట్టణంలో నిర్వాహకులు అక్కిగారి శ్రీధర్, అక్షయ్‌లు నూతనంగా ఏర్పాటు చేసిన ఎంజీవన్ ఎలక్ట్రిక్ వాహనాల షోరూంను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. వాహనాలను నడిపించి సంతోషం వ్యక్తం చేయడంతోపాటు నిర్వాహకులను ప్రత్యేకంగా అభినంధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ సమాజంలో కాలుష్యం విపరీతంగా పెరుగుతుందని, నియంత్రించేందుకే మార్కెట్‌లోని కొత్త కొత్త ఎలక్ట్రిక్ వాహనాలను అందుబాటులోకి వస్తున్నాయని వివరించారు. ఈ వాహనాలను ఉపయోగిస్తే కాలుష్యాన్ని నియంత్రించేందుకు అవకాశం ఉంటుందని, పర్యావరణం కాలుష రహితంగా మార్కే అస్కారం లభిస్తుందని పేర్కొన్నారు. పెట్రోల్, డిజిల్ వాహనాల కంటే ఎలక్ట్రిక్ వాహనాలను ఉపయోగించేందుకు వినియోగదారులు కృషి చేయాలని సూచించారు. కాలుష్యాన్ని నియంత్రిస్తే ఆశించిన స్థాయిలో వర్షాలు రావడంతోపాటు పాడి పంటలు బాగా ఉండటమే కాకుండా చెరువులు, కుంటల్లో నీరు పుష్కలంగా ఉంటుందని వివరించారు. భూగర్భ జలాలు పెరిగి ప్రాంతాలు అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ షోరూంలో రూ.42వేల నుండి 1.42లక్షల వరకు వాహనాలు ఉన్నాయని, 60కిలో మీటర్ల నుండి 200కిలో మీటర్ల వరకు ప్రయాణించే వాహనాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. వాహనాలు కొనుగోలు చేసే వినియోగాదారులకు తగిన గిఫ్ట్‌లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటు ధరల్లో ఆధునిక ఎలక్ట్రిక్ వాహనాలను అంధించడమే లక్ష్యంమని షోరూం నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విఠ్యాల మాజీ సర్పంచ్ పెంటయ్యతోపాటు నిర్వాహకులు పాల్గొన్నారు.

## పేదోడికి సొంతింటి కల నేరవేర్చాలన్నదే లక్ష్యం

కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు జె.సుదర్శన్ గౌడ్



**ప్రజాపక్షం/కొత్తూరు:** పేదోడి సొంతింటి కలను నేరవేర్చాలన్నదే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు జె.సుదర్శన్ గౌడ్ అన్నారు. శుక్రవారం కొత్తూరు మున్సిపల్ పరిధిలోని కొత్తూరు తండాలో రెండు ఇందిరమ్మ ఇండ్లను మున్సిపల్ కమీషనర్ సాహితితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు జె.సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజల సొంతింటి కలను నేరవేర్చేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే అనేక మంది లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడంతోపాటు పెండింగ్‌లో బిల్లులు లేకుండా చెల్లించడం జరుగుతుందని పేర్కొన్నారు. లబ్దిదారులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా సొంతింటి కోసం ఎదురు చేశామని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాతే మాకు సొంతింటి కల నేరవేరిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మెన్ తౌర్యానాయక్, మాజీ సర్పంచ్ జగన్, కాంగ్రెస్ పార్టీ మాజీ నియోజవకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు కర్రోళ్ల సురేందర్, నాయకులు ఇందూరి శ్రీనివాస్, గోవిందునాయక్, చిలకమర్రి నర్సింహులు, యువ నాయకుడు నవీన్‌చారి, అంజినాయక్, హసన్, తుప్పర బాలరాజు, తండావాసులు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలి

షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



**ప్రజాపక్షం/కొందుర్గు:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కోరారు. శుక్రవారం కొందుర్గు మండల కేంద్రంలో పోచమ్మ బోనాల ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. బోనాల వేడుకలు అత్యంత భక్తిశ్రద్దలతో నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలు, కళాకారుల ఆటపాటలతో బోనాల ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ బోనాల వేడుకలతో గ్రామంలో ఆధ్మాతిక వాతావరణం ఏర్పడిందని, చిన్న, పెద్ద అనే తారతమ్యం లేకుండా బోనాల ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహించినట్లు తెలిపారు. ఊరేగింపుగా బోనాలతో మహిళలు అమ్మవారి దేవాలయం వద్దకు చేరుకొని అమ్మవారికి బోనం నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ఎవరు కూడా మరవకూడదన్నారు. గ్రామదేవతల ఆశీర్వాదంతోనే గ్రామాలు సుఖ సంతోషాలు, పాడి పంటలతో బాగుండాలని కోరారు. ఎలినో ప్రభావం లేకుండా ఈ ఏడాది వర్షాలు ఆశించిన మేరకు బాగా కురువాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజలందరు సుఖ సంతషాలతో ఉండే విధంగా ఆశీర్వదించు తల్లి అంటూ అమ్మవారికి వేడుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటి చైర్‌పర్సన్ మన్నె కవిత నారాయణ, మాజీ వైస్ ఎంపిపి రాజేష్ పటేల్, బిఆర్‌ఎస్ మండల అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, లక్ష్మణ్‌నాయక్, కొందుర్గు సర్పంచ్ ప్రభాకర్, ఉప సర్పంచ్ చందు, మాజీ సర్పంచులు రాజ రామేశ్వర్ రెడ్డి, రాములు, వార్డు సభ్యులు సంజీవ, లింగం, నవీన్, శ్రీకాంత్, వాసూరి, వెంకటేష్, నాయకులు రెడ్డి నర్సింలు, దర్గా రామచంద్రయ్య, రజినీకాంత్, దయ్యాల శేఖర్, ఎల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగస్తుల పెండింగ్ డిఎ, పిఆర్‌సిలు తక్షణమే చెల్లించాలి

టిజిఇ జెఎసి చైర్మన్ యశ్వంత్

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** ప్రభుత్వ ఉద్యోగస్తుల పెండింగ్ డిఎ, పిఆర్‌సిలు తక్షణమే చెల్లించాలని టిజిఇ జెఎసి జిల్లా చైర్మన్ ఊటు యశ్వంత్,కన్వీనర్ డాక్టర్ కె.రామరావులు ప్రభుత్వాన్నికి డిమాండ్ చేశారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖలలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగస్తుల బిల్లులు పెండింగ్‌లో ఉండటం వల్ల కుటుంబ ఆర్థిక పరిస్థితులు సంక్షోభంతో తీవ్ర ఇబ్బందులకు గురి అవుతన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్దరిస్తామని ఉద్యోగస్తులకిచ్చిన హామిలు నిటీ మూటలుగానే మిగిలి పోయయాని విమర్శించారు.ప్రభుత్వ కార్యాలయాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగస్తులపై ఉన్నతాధికారుల వేధింపులు ఆపాలని సూచించారు. పెండింగ్ బిల్లులపై ప్రభుత్వం తక్షణమే స్పందించక పోతే ఉద్యోగ జెఎసి సంఘం ఆద్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.



## సైబర్ మోసాలపై విద్యార్థులకు 'డిజి రక్ష'

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** చేతిలో సెల్‌ఫోన్‌తో ప్రపంచం అరచేతిలోకి వస్తున్న వేళ సైబర్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని అనురాగ్ విశ్వ విద్యాలయం సమాచార సాంకేతిక విభాగం, ఐఈఈఈఎస్‌ఎస్‌ఐటీ విద్యార్థి విభాగం సూచించింది. ఘట్‌కేసర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలుర ప్రాంగణంలో డిజి రక్ష సైబర్ భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 9,10వ తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్ మోసాలు, మోసపూరిత లింకులు సంకేతపదాల భద్రత, సామాజిక మాధ్యమాల వినియోగం వ్యక్తిగత సమాచార పరిరక్షణపై అవగాహన కల్పించారు. సైబర్ ప్రమాదాలను గుర్తించే విధానాలను ప్రయోగాత్మకంగా వివరించారు. ఐఈఈఈఎస్‌ఎస్ ఐటి సభ్యులు బి.విష్ణుతేజ, డి.మృదుల, ఎన్ సాత్విక, పి.సాయి సృజన,అవగాహన కల్పించారు. కార్యక్రమానికి డా.జిఎల్ ఆనంద్‌బాబు మార్గదర్శకత్వం వహించగా జి.శేఖర్ రెడ్డి పమన్వయం చేశారు. డా.జిఎల్ ఆనంద్ బాబు మాట్లాడుతూ సాంకేతికతను బాధ్యతాయుతంగా వినియోగించాలని సైబర్ మోసాలపై అప్రమత్తత ప్రతి ఒక్కరికీ అవసరమని తెలిపారు. అప్రమత్తతే సైబర్ మోసాలకు తొలి రక్షణ కవచమని పేర్కొన్నారు.



## నూతన కమిటీలకు దరఖాస్తుల స్వీకరణ

### కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అధ్యక్షతన శుక్రవారం ఓబిసి సెల్ నూతన కమిటి కోసం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. అంతాయిపల్లిలోని ఎస్‌ఎన్‌ఆర్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఓబిసి సెల్ రాష్ట్ర కన్వీనర్ కేతురి వెంకటేష్, ఓబిసి అబ్జర్వర్ డాక్టర్ నాగలూరి అరున్‌కుమార్ గౌడ్, అలోక్‌నాథ్, శామీర్‌పేట రాజేష్, భాస్కర్‌లు దరఖాస్తు ఫారాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి, అలియబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బిపిటి రాజు, మేడ్చల్ నియోజకవర్గం డివిజన్ అధ్యక్షులు నక్క సందీప్‌గౌడ్, కర్రె రాజేష్, మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్, చాప రాజు, దోసకాయల వెంకటేష్, తుంకి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## కోర్టులో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కుషాయిగూడ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ బార్ అసోసియేషన్ సభ్యులు సునీల్ గౌడ్ విచ్చేసి సభ్యులతో కలసి పాపన్న గౌడ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బహురాజ్య స్థాపనకు కృషి చేసిన వీరుడు పాపన్నగౌడ్ అని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు అధ్యక్ష, కార్యదర్శులు టి రత్నం, దుర్గాప్రసాద్, హరికృష్ణ, డి సాయినాథ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## టిపిఎస్ కోసం పాదయాత్ర చేస్తా

### క్రై స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి హిమబిందు

**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** తెలంగాణ పబ్లిక్ స్కూల్ గబ్బిలాల్ పేట్‌లో ఏర్పాటు కొరకై మేడ్చల్ కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నామని క్రై స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి హిమబిందు తెలిపారు. పిల్లలు ఉన్నచోటే బడి కావాలనే నినాదంతో గబ్బిలాల్ పేట్ నుంచి మేడ్చల్ కలెక్టరేట్ వరకు ఈ నెల 24న నిర్వహించే పాదయాత్రలో అఖిల పక్షం నాయకులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. లక్షల జనాభా కలిగిన జవహర్ నగర్‌లో నర్సరీ నుండి 12వ తరగతి వరకు పాఠశాల ఉండాలని, విద్య అందరికి అందాలనే లక్ష్యంతో పోరాటం చేస్తున్నామని పేర్కొన్నారు. పాఠశాల దగ్గరలో లేకపోవడంతో విద్యార్థులుబాల్యవివాహాలు, మత్తు పదార్థాలకు అలవాటై బాల్యం బుగ్గిపాలవుతుందన్నారు. 5 ఎకరాల స్థలంలో తెలంగాణ పబ్లిక్ పాఠశాల తక్షణమే ఏర్పాటు చేయాలని కోరుతూ కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేస్తూ కలెక్టర్‌కు విన్నవిస్తామని తెలిపారు. పాదయాత్రలో పలువురు మేధావులు, ప్రొఫెసర్లు, రాజకీయ, విద్యార్థి సంఘాలు పాల్గొంటాయని పేర్కొన్నారు.

## ప్లాంట్ల ఆక్రమణకు యత్నాలు

### జెసిబిలతో రాత్రివేళల్లో హద్దురాళ్ల తొలగింపు

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ఘట్‌కేసర్ డివిజన్ పరిధిలోని కొండాపూర్‌లో 25 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన తమ ప్లాట్ల భూమిని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని బాధితులు ఆరోపించారు. తమకు న్యాయం చేసి ఆక్రమణ యత్నాలను అడ్డుకోవాలని అధికారులను కోరారు. ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్లాట్ల బాధితులు మాట్లాడుతూ సర్వే నంబర్ 63,67లో శ్రీనిధి ఇంపీరియల్ పార్క్ పేరుతో ప్లాట్లు విక్రయించారని తెలిపారు. పేదలు, బడుగు, బలహీన వర్గాలకు చెందిన పలువురు తమ పిల్లల చదువుల భవిష్యత్ అవసరాల కోసం అప్పట్లో ప్లాట్లు కొనుగోలు చేశారని పేర్కొన్నారు. గత కొంతకాలంగా కొందరు రాత్రివేళల్లో జెసిబిలతో వచ్చి హద్దురాళ్లు తొలగించడం భూమిలో తమకు సంబంధించిన ప్లాట్ల ప్రాంతాన్నే లక్ష్యంగా చేసుకుని ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ జెసిబిలతో వచ్చి అక్రమాలకు పాల్పడితే జరిగే పరిణామాలకు వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్లాట్ల యజమానుల హక్కులను కాపాడి వివాదం పరిష్కారమయ్యే వరకు భూమిలో ఎలాంటి చర్యలు జరగకుండా అధికారులు తక్షణమే జోక్యం చేసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు.

## రాష్ట్ర అధ్యక్షులను కలిసిన మండల అధ్యక్షులు

**ప్రజాపక్షం/బొంరాస్పేట్:** కొడంగల్ నియోజకవర్గంలోని, కొడంగల్ , దుద్యాల, దౌల్తాబాద్, బొంరాస్పేట్ మండల పరిధిలోని మండల అధ్యక్షులు భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావును రాష్ట్ర కార్యాలయంలో కలిశారు. ఈసందర్భంగా పార్టీ కార్యక్రమాలు, సమస్యలపై చర్చించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పరి జగదీశ్వర్ , అంజి, జనార్ధన్, సతీష్ రాజారంరెడ్డి, మహేందర్‌గౌడ్, గొల్లనారాయణ యాదవ్, గోవింద్‌రాజ్, కె.మహేష్‌బాబు, రామకృష్ణ,, అశోక్, మోహన్‌రెడ్డి , ప్రవీణ్, గోవర్దన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

### ఎంఎంసి కమిషనర్ హెచ్చరిక

* కాప్రా సర్కిల్ పర్యటనలో సిబ్బంది తీరుపై తీవ్ర అసంతృప్తి
* పార్కింగ్ స్థలాన్ని కబ్జా చేస్తే చోద్యం చూస్తున్నారా అంటూ ఆగ్రహం



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** కాప్రా సర్కిల్ పరిధిలో పారిశుద్యం, టౌన్ ప్లానింగ్ విభాగ అధికారులు, సిబ్బంది ఆశించిన మేరకు పని చేయటం లేదని, ఎక్కడ చూసినా దురాక్రమణలు, చెత్తా చెదారం కనపడుతున్నాయంటూ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇకనైనా తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. ప్రజా సంబంధిత విధుల్లో ఏ మాత్రం నిర్లక్ష్యం కనపరచినా కఠిన చర్యలు తప్పవన్నారు. ఏఎస్ రావు నగర్ డివిజన్‌లో క్షేత్రస్థాయి పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన సానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా ప చేస్తున్న వంశీని వెంటనే మరో ప్రాంతానికి మార్చి గతంలో ఈ ప్రాంతంలో పనిచేసిన అంజలిని నియమించాలని డిప్యూటీ కమిషనర్‌ను ఆదేశించారు. అదే విధంగా కమలానగర్, రాధికా మల్టిప్లెక్స్ ప్రాంతంలోని హాస్టల్ నిర్వాహకులతో పాటు పలువురు ఫుట్‌పాత్‌లను కబ్జా చేస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోవటం లేదంటూ టౌన్‌ప్లానింగ్ అధికారులను నిలదీసారు. శుక్రవారం ఆయన కాప్రా సర్కిల్ పరిధిలోని కమలానగర్, మహేష్‌నగర్, ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన సందర్భంలో రహదారి మార్జిన్లు, ఖాళీ స్థలాలు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త పేరుకు పోవటం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తేలా రహదార్ల పక్కనే ఉన్న విద్యుత్ స్థంభాలపై కేబుల్ వైర్లు, ఫ్లెక్సీ బ్యానర్లు, అనధికారిక వాణిజ్య సంస్థల బోర్డులను వెంటనే తొలగించాలని ఆదేశించారు. కమలానగర్ రోడ్ నంబర్ 3లో ఉన్న నిఖిల్ బాయ్స్ హాస్టల్ నిర్వాహకులు నిర్దేశిత పార్కింగ్ స్థలాన్ని కబ్జాచేసి వంట గది, కార్యాలయ గదిని నిర్మించుకొని వినియోగించుకొంటుంటే టౌన్‌ప్లానింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారా అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే తగిన చర్యలు తీసుకోవాల ని ఆదేశించారు. నిత్యం రద్దీగా ఉండే అయ్యప్ప స్వామి ఆలయ రహదారిని పరిశీలించిన కమిషనర్ పాఠశాల వాహనాలు, ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బంది దిని గమనించి అవసరమైన మార్పు చేర్పులు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బహిరంగ ప్రదేశాల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తేలా నిర్మాణ సామగ్రి నిలువ లేకుండా చూడాలన్నారు. అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన విధులను జవాబుదారీతనంతో, అంకితభావంతో నిర్వహించాలని సూచించారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందేలా చేడాలన్నారు.

## పారిశ్రామిక వ్యర్థాలు చెరువుల్లోకి రాకుండా కఠిన చర్యలు

### మూడుచింతలపల్లి మున్సిపల్‌లోని కొల్తూర్ చెరువును సందర్శించిన మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** పారిశ్రామిక కంపెనీల నుంచి వదులుతన్న రసాయనాలు చెరువుల్లోకి, కుంటల్లోకి రాకుండా కఠిన చర్యలు చేపట్టాలని పోల్యూషన్ కంట్రోల్ అధికారులకు మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ సూచించారు. శుక్రవారం మూడుచింతలపల్లి మున్సిపల్ కొల్తూర్‌లోని చెరువులో లక్షలాది చేప పిల్లలు కలుషిత రసాయన వ్యర్థాలు చెరువులోకి రావడం వలన చనిపోయాయి. ఇట్టి విషయం తెలుసుకున్న ఎంపి ఈటల రాజేందర్ స్వయంగా కొల్తూర్ చెరువు పరిసరాలను పరిశీలించి మాట్లాడుతూ జీనోమ్‌వ్యాలీ, తుర్కపల్లి, జవహార్ నగర్ డంప్‌యార్డు నుంచి వచ్చే మురుగు నీరు దుర్వాసన వలన ఈ ప్రాంత ప్రజల జీవనం దుర్భరంగా మారిందన్నారు. ఇవి మురికి కూపాలు కావని ప్రజల ప్రాణాలు తీస్తున్న నరక కూపాలని ఆవేదన చెందారు. ప్రతి పరిశ్రమలో ట్రీట్మెంట్ ప్లాంట్ పెట్టుకోవాలని, అలా కాకుండా కొద్ది మంది ఫార్మా కంపెనీల యాజమాన్యాలు బోర్లువేసి ఆ రసాయన వ్యర్థాలను భూమిలోకి పంపిస్తున్నారని ఆరోపించారు. దీని వలన చెరువులో ఉన్న చేపలు, వాటిని తిన్న కొంగలు, పక్షులు చనిపోతున్నాయని తెలిపారు. కొల్తూర్‌లోని జీనోమ్వ్యాలీ నుంచి వచ్చిన రసాయన వ్యర్థాల వలన దాదాపు రూ.15 లక్షల రూపాయల విలువ గల చేపలు చనిపోయాయని తెలిపారు. ఈ ప్రాంత ఎంపిగా ఇట్టి అంశాన్ని ఢిల్లీ వరకు తీసుకెళ్లి ముదిరాజ్‌లకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏనుగు సుదర్శన్‌రెడ్డి, వైస్ చైర్ పర్సన్ కన్‌రెడ్డి మాలతి మాధవరెడ్డి, మాజి ఎంపిటిసి బొగ్గుల వెంకటేష్, ఎంసిపల్లి బిజెపి అధ్యక్షుడు తప్పెట్ల నరేందర్ గౌడ్, మాజి అధ్యక్షుడు నందాల శ్రీనివాస్, బిజెపి సీనియర్ నాయకుడు కొండ నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

## బిఎల్‌ఓ, ఎలక్షన్ సూపర్‌వైజర్ల సమావేశం



**ప్రజాపక్షం/దుండిగల్:**దుండిగల్ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్/ ఎఇఆర్ఒ డాక్టర్ ఎస్. వెంకట మణి కరణ్ గారి అధ్యక్షతన బిఎల్‌ఓ లు, ఎలక్షన్ సూపర్వైజర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియకు సంబంధించి పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా షెడ్యూల్ ఆఫ్ హియరింగ్, నోటీస్ డిస్ట్రిబ్యూషన్ విధానాలపై సిబ్బందికి స్పష్టమైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్.వెంకట మణి కరణ్ మాట్లాడుతూ, హియరింగ్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా, అనగా ఆగస్టు 27, 2026 నుండి సెప్టెంబర్ 20, 2026 లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ సర్కిల్ పరిధిలోని బి.ఎల్.ఓ లు, ఎలక్షన్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## పెళ్లి పేరిట శారీరక సంబంధం

### యువకుడిపై కేసు నమోదు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** పెళ్లి చేసు కొంటానని చెబుతూ శారీరక సంబం ధం కొనసాగించి వంచించిన ఓ యువకుడిపై మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసారు. బాధిత యువతి పోలీసులకు ఇచ్చి న ఫిర్యాదు వివరాల ప్రకారం బోడుప్పల్ ప్రాంతంలో నివసిస్తూ స్టాఫ్‌నర్స్‌గా జీవనం గడుపుతున్న ఓ 24 ఏళ్ల యువతికి 2021లో వాట్సాప్ ద్వారా తేజావత్ సాయికిరణ్ అనే యువకుడు పరిచయం అయ్యాడు. చివరికి వారి పరిచయం కాస్తా ప్రేమగా మారటం, తాను వివాహం చేసుకొంటానంటూ ఆ యువతిని నమ్మపలుకుతూ తరచున్న క్రమం లో వారిద్దరూ తరచు శారీరక సంబంధాలు కొనసాగించారు. అప్పటి నుండి చెప్పిన విధంగా తనను పెళ్లి చేసుకోవాలని అడుగుతున్న యువతికి నేడు రేపు అంటూ గడపసాగాడు. ఇదే విధంగా నాలుగేళ్లకు పైబడి గడుస్తుండటంతో పెళ్లి చేసుకోవాలని యువతి నిలదీయటం ప్రారంభించటంతో పెళ్లికి నిరాకరించటంతో 2025లో పోలీసులను ఆశ్రయించగా పెద్దల సమక్షంలో పెళ్లి కి ఒప్పుకొని, పెళ్లి చేసుకోకుండా కాలయాప న చేయటమే కాక తన ఫోన్ బ్లాక్ చేసి తప్పించుకొని తిరుగుతూ తనను వంచించిన సాయికిరణ్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## ప్రైవేట్ ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలి : టిపిటిఎల్‌ఎఫ్ డిమాండ్



**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** జవహర్ నగర్‌లో తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫడరేషన్ మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల దారుణహత్యకు గురైన ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపల్ కీర్తిశేషులు రూపా రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ సభ్యులు కొవ్వొత్తులు వెలిగించి, రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా టిపిటిఎల్‌ఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కర్నే సురేందర్ మాట్లాడుతూ, సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న ప్రైవేట్ టీచర్లు, ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లకు ప్రభుత్వం తగిన రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులపై దాడులకు తెగబడే వారిపై, దుర్భాషలాడే వారిపై ప్రభుత్వం చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా రూపారెడ్డిని అత్యంత దారుణంగా హత్య చేసిన నిందితులను చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న కాప్రా మండల ఎంఇఒ అజముద్దీన్ మాట్లాడుతూ, నేటితరం విద్యార్థులు మత్తు పానీయాలు, చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉందని, వారిని ఎప్పటికప్పుడు గమనిస్తూ సరైన మార్గంలో నడిపించాలని సూచించారు. ఈ నివాళి కార్యక్రమంలో టిపిటిఎల్‌ఎఫ్ మండల అధ్యక్షులు అరుణ్ కుమార్, ఘట్కేసర్ మండల అధ్యక్షులు బి.గణేష్, జిల్లా నాయకులు నాగరాజు, మురళి, భాగ్యలక్ష్మి, రశ్విత, విజ్ఞాన భారతి కాలేజీ ప్రిన్సిపాల్ పరమేశ్వర్ రెడ్డి, లెక్చరర్లు జార్జ్, భాస్కర్, శ్రీనివాస్ పాల్గొన్నారు. చంద్ర పుల్లారెడ్డి వర్గం ఆల్ ఇండియా సెక్రెటరీ షేక్ సవాలి, సిపిఐ జిల్లా నాయకులు దశరథ్, బిజెపి నాయకులు జోగారావు, బాబు, పీడబ్ల్యు నాయకులు సావిత్రిలతో పాటు పలువురు ప్రైవేట్ ఉపాధ్యాయులు, లెక్చరర్లు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను వేగవంతం చేయాలి

### వికారాబాద్ కలెక్టర్ దీపక్‌తివారి




**ప్రజాపక్షం/వికారాబాద్ :** విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. జిల్లాలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచడంతో పాటు ఆధార్ అనుసంధానం, అఫర్ జనరేషన్, ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో మండలాల విద్యాశాఖ అధికారులతో విద్యాశాఖకు సంబంధించిన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా జనరేషన్, ఎఫ్‌ఎల్‌ఎన్ ప్రతిని సమీక్షించారు. ప్రతి మండల విద్యాశాధికారికి నిర్దిష్ట లక్ష్యాలను కేటాయించి , వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా ప్రీ ప్రైమరీ తరగతుల ఎన్‌రోల్‌మెంట్‌తోపాటు 1వ తరగతి విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థుల నమోదు ప్రక్రియలో ఎటువంటిఅలస్యం లేకుండా సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మండల స్థాయి అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఆధార్ , ఆఫర్ జనరేషన్ ప్రక్రియలను వెంటనే పూర్తి చేయాలని సంబంధించిన ఆన్‌లైన్ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని తెలిపారు. వికారాబాద్ జిల్లాను విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌లో రాష్టంలో ముందువరుసలో నిలిపే విధంగా ప్రతి ఒక్కరు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అదేవిధంగా విద్యార్థుల్లో ఫౌండేషన్‌లో లిటరసీ అండ్ న్యూమరసీ సామర్థ్యాలను పెంపొందించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఇఒలకు సూచించారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు చదవడం , రాయడం, అర్థం చేసుకోవడం, ప్రాథమిక గణిత, నైపుణ్యాలను సాధించేలా పాఠశాల స్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిగా సాధించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.



## జంతు సంరక్షణ సదుపాయాలు బలోపేతం చేస్తాం

### సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ డా.సృజన

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ సామర్థ్యాన్ని పెంచి మరింత బలోపేతం చేయాలని సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ డా.సృజన అధికారులను ఆదేశించారు. కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్‌కుమార్‌తో కల్సి శుక్రవారం గాజులరామారం సర్కిల్ పరిధిలోని మహదేవపురం ప్రాంతంలో ఉన్న యానిమల్ కేర్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసారు. సెంటర్‌లో జంతువుల పరిరక్షణ ఏర్పాట్లు ఏ విధంగా ఉన్నాయన్న విషయాలను అడిగి తెలుసుకొన్న కమిషనర్ భవిష్యత్ అవసరాలను సమీక్షించారు. సిఎంసి పరిధిలో వివిధ ప్రాంతాల నుండి వచ్చే కుక్కలకు అవసరమైన సేవలు అందించేలా సదుపాయాలను విస్తరించాలని సూచించారు. అదే విధంగా ఈ సెంటర్‌లో అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాన్ని పెట్ థీమ్ పార్క్‌గా అభివృద్ధి చేసేందుకు అవకాశాలను పరిశీలించిన కమిషనర్ పెట్ హాస్టల్స్, కేఫ్‌టేరియా, పెట్ స్టోర్స్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు. యానిమల్ కేర్ సెంటర్‌కు సరైన రహదారి అనుసంధానం కల్పించేందుకు సంబంధిత ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకొని అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జంతు సంరక్షణ సదుపాయాలను బలోపేతం చేయటంతో పాటు పెంపుడు జంతువులకు మెరుగైన వసతులు కల్పించే దిశగా చర్యలు చేపడుతామని ఈ సందర్భంగా కమిషనర్ పేర్కొన్నారు.

## ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి నష్టం

### అలియాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ శిరీషారెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట:**ప్లాస్టిక్ వ్యర్థాల వలన పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని, పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ డ్రైనేజి వ్యవస్థల్లో ప్లాస్టిక్ పేరుకపోయి మురుగునీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడుతుందన్నారు. ఒకసారి వాడిన ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువులు వినియోగాన్ని ప్రజలు స్వచ్ఛంధంగా తగ్గించాలని సూచించారు. ప్రజలు మార్కెట్‌లకు, దుకాణాలకు వెళ్లేటప్పుడు క్లాత్ బ్యాగు లు, జూట్ బ్యాగులు, సంచులను వాడాలని చెప్పారు. వ్యాపారులు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించాలని సూచించారు. పరిశుభ్రమైన అలియాబాద్ ప్లాస్టిక్ రహిత అలియాబాద్ లక్ష్యంగా మున్సిపాలిటి చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.



## పొంచి ఉన్న ప్రమాదం ... మరోసారి కాగ్నా వంతెనకు రంధ్రం

### వంతెనను పరిశీలించిన బిఎస్ఆర్

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు–కొడంగల్ మార్గంలోని కాగ్నా వంతెనకు మరోసారి కన్నం పడింది. ప్రమాదపు అంచున కాగ్నా వంతెన ఉండడంతో అటువైపు ప్రయాణించే ప్రయాణికులు, వాహన చోదకులు భయాందోళనకు గురవుతున్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కాగ్నా నదిపై ఐదు సంవత్సరాల క్రితం రూ.16కోట్ల నిధులతో కాగ్నా నదిపై వంతెన నిర్మాణం చేపట్టిన విషయం తెలిసిందే. కాంట్రాక్టర్ల దోపిడీతో కట్టిన ఐదు సంవత్సరాలకే వంతెన ప్రమాదపు అంచున పడింది. కాగ్నా వంతెనపై పెచ్చులూడి పోవడంతో పాటు రంధ్రం సైతం పడింది. గత జులై మాసంలో మొదటిసారి కాగ్నా వంతెనకు రంధ్రం పడిన విషయం తెలిసిందే. మరోమారు అదే వంతెనకు రంధ్రం ఏర్పాడడంతో ప్రమాదం పొంచి ఉంది. దీంతో అటు నిత్యం ప్రయాణం సాగించే ప్రయాణీకులు, వాహన చోదకులు భయభ్రాంతులకు గురవుతున్నారు. నేషనల్ హై వే 165కు కలిపే ఈ రోడ్డు మార్గంలోనే తాండూరు కాగ్నా నదిపై వంతెన ఉంది. జాతీయ రహదారి కావడంతో నిత్యం వేలాది వాహనాలు రాపోకలు సాగిస్తుంటారు. కాగ్నా వంతెనపై సంవత్సర క్రితం ఏర్పాడిన రంధ్రాన్ని సంబంధిత అధికారులు ప్రత్యేక టెక్నాలజీతో మరమ్మతులు చేయించారు. అయినప్పటికు మరో కన్నం ఏర్పడడంతో పెచ్చులు ఊడి పోవడంతో పెను ప్రమాదం పొంచి ఉందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగ్నా వంతెన నిర్మాణ సమయంలో అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోడంతో పాటు కాంట్రాక్టులు ఇచ్చే ముడుపులను పుచ్చుకున్న అధికారులు నాణ్యతకు తిలోదాకాలు ఇచ్చారన్న విమర్శలు వ్యక్తవుతున్నాయి. కాంట్రాక్టర్ నాసిరకం మెటీరియల్ ఉపయోగించారా... నిర్మాణంలో నిబంధనలను పాటించారా అనే అంశాలపై పూర్తిస్థాయిలో విచారణ జపాలని స్థానికులు కోరుతున్నారు.

**కాగ్నా వంతెనను పరిశీలించిన బిఎస్ఆర్....**

దెబ్బతిన్న కాగ్నా వంతెనను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆర్బిఐఎల్ సిఇఒ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. కాగ్నా వంతెనపై మరోసారి రంధ్రం ఏర్పడిన విషయాన్ని తెలుసుకున్న ఆయన శుక్రవారం అధికారులతో కలసిన బ్రిడ్జిని పరిశిలించారు. కాగ్నా భద్రతకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. హదారిపై మరమ్మతులను వెంటనే పూర్తి చేసి రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్‌బి అధికారులకు సూచించారు.



## ఉల్లి సాగుకు సహాయం

### ఉద్యానవన అధికారి సత్తార్

**ప్రజాపక్షం/వికారాబాద్:**జిల్లాలో ఉల్లి సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎకరాకు రూ.8000ల సబ్సిడీ అందిస్తుందని, ఉల్లి నిల్వ నిర్మాణానికి రూ.1లక్ష సహాయం అందించడం జరుగుతుందని,జిల్లా పట్టు,ఉద్యానవన అధికారి సత్తార్ తెలిపారు. ఉల్లి సాగు సబ్సిడీ, రైతులు దరఖాస్తు చేసుకోవడానికి అవసరమైన పత్రాలు : పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్, బ్యాంక్ ఖాతా వివరాలు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్, పాస్‌పోర్టు సైజ్ ఫోటో, దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ 29.08.2026 వరకు ఉందని తెలిపారు. గతసంవత్సరం సబ్సిడీ తీసుకున్న రైతులకు ప్రస్తుతం వర్తించదని అన్నారు.

## జలమండలి పేరిట మోసం



ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: జలమండలి లోగోను అనధికారికంగా ఉపయోగిస్తూ సెప్టిక్ క్లీనింగ్ కార్యకలాపాలు నిర్వహించిన ఘటనపై మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. ఏజె సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ ప్రయివేట్ లిమిటెడ్‌కు చెందిన టిజి08 వి6294 నెంబరు వాహనం జలమండలి పేరును ఉపయోగిస్తూ సెప్టిక్ క్లీనింగ్ సేవలు అందిస్తున్నట్లు గుర్తించారు.

## 'యువ' సమ్మేళనం పోస్టర్




ప్రజాపక్షం/అంబర్‌పేట్: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఈనెల 22న సాయంత్రం 6 గంటలకు అంబర్‌పేట్ మహారాణా ప్రతాప్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న యువ సమ్మేళనంలో యువతి యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని తిలక్‌నగర్ డివిజన్ బిజెపి సీనియర్ నాయకురాలు అనురాధ గుప్తా కోరారు. శుక్రవారం యువ సమ్మేళనం సంబంధించిన పోస్టర్‌ను ఆమె విడుదల చేశారు.

## టిడిపికి భయపడుతున్న పార్టీలు



ప్రజాపక్షం/ముషీరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో అధికార కాంగ్రెస్, విపక్ష బిఆర్ఎస్‌లు తెలుగుదేశం పార్టీ ప్రస్తావన లేని రోజంటూ ఉండదని సికింద్రాబాద్ పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ నాయకుడు నల్లెల కిషోర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఈ మేరకు ఆయన టిటిడిపి హైదరాబాద్ జిల్లా పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నల్లెల కిషోర్ మాట్లాడారు. సమావేశంలో సికింద్రాబాద్ పార్లమెంట్ పార్టీ నాయకుడు, మాజీ కార్పొరేటర్ పి.బాలరాజ్ గౌడ్, తడక వినోద్, గుట్ట అనిల్ కుమార్, కరణం కిరణ్, ఇ.భాను ప్రకాష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ జిమ్ ప్రారంభం



ప్రజాపక్షం/నల్లకుంట: అన్ని వయసుల వారు ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో నల్లకుంటలోని మదర్ డెయిరీ పార్క్‌ను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అమృత, బిజెపి నాయకులు లక్ష్మణ్, సంధాని శ్రీనివాస్, మురళి ముదిరాజ్, రాఘవేందర్ గౌడ్, మల్లికార్జున్ ముదిరాజ్, కిషోర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## 'నేటి' నుంచి పవర్ ఎగ్జిబిషన్



ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా చేపట్టిన అంశాలను ప్రజలకు వివరించేందుకు శనివారం నుంచి పవర్ ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్నట్లు టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి జితేష్ పాటిల్ తెలిపారు. ఈ మేరకు నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా నిర్వహించనున్న పవర్ ఎగ్జిబిషన్2026 ఏర్పాట్లను సిఎండి జితేష్ పాటిల్, ప్రాజెక్ట్స్ అండ్ ఐటీ డైరెక్టర్ వి.శివాజీ శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఎగ్జిబిషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న వివిధ విద్యుత్ రంగ ప్రదర్శన స్టాళ్లు, సందర్శకుల కోసం కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యుత్ సరఫరా ఏర్పాట్లు, భద్రతా చర్యలు, పార్కింగ్ సదుపాయాలు, ప్రవేశ ద్వారాలు, వేదిక నిర్మాణం, డిజిటల్ డిస్‌ప్లేలు, అవగాహన కేంద్రాలు తదితర అంశాలను వారు క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది.

## 26న రవీంద్రభారతిలో 'సత్యాన్వేషి' నాటకం

ప్రజాపక్షం/హిమాయత్‌నగర్: అంతర్జాతీయ నాటకోత్సవాల నేపథ్యంలో తెలుగు నాటకాల సత్తా ఏంటో చూపడమే ధ్యేయంగా 'సత్యాన్వేషి' నాటకాన్ని ఈ నెల 26న సాయంత్రం హైదరాబాద్ రవీంద్రభారతిలో ప్రదర్శించనున్నట్టు నిర్వాహకులు, రచయిత చిలువేరు రఘురామ్ తెలిపారు. కళా విపంచి, గోవాడ క్రియేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే సత్యాన్వేషి నాటకంలో 54 మంది కళాకారులు పాల్గొంటారన్నారు. సిద్ధార్థుడు బుద్ధుడిగా ఎలా మారారు? బుద్ధుడి అంతర్మథనమే సత్యాన్వేసి అని రఘురామ్ పేర్కొన్నారు. నాటకాన్ని వీక్షించేందుకు బుక్‌మై షో ఫ్రీగా బుక్ చేసుకోవచ్చని, ప్రతి ఒక్కరికి ఉచిత ప్రవేశమని పేర్కొన్నారు.

## బిగ్ డేటాలో సేవలకు కట్టా సురేశ్‌కు పురస్కారం



ప్రజాపక్షం/హిమాయత్‌నగర్:దశాబ్దాలుగా బిగ్‌డేటా క్లినికల్ అనలిటిక్స్ రంగాల్లో అందించిన విశేష సేవలు, సాంకేతిక ఆవిష్కరణలకు గుర్తింపుగా కట్టా సురేశ్‌కు ప్రతిష్టాత్మక ఎన్‌ఆర్‌ఐ వాసవి అసోసియషన్ (ఎన్‌ఆర్‌ఐవిఎ) 8వ గ్లోబల్ కన్వెన్షన్ జీవితకాల సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఎన్‌ఆర్‌ఐవిఎ మాజీ చైర్మన్ సుంకు జయసింహ, ఎపి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టి.జి.భరత్ ఆయనకు పురస్కారాన్ని అందజేశారు. సాధారణ గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన సురేశ్ ఉన్నత విద్యకు అమెరికాకు వెళ్లి అక్కడ మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. బిగ్ డేటా అనే భావన ప్రాచుర్యంలో లేని 1997లోనే దూరదృష్టితో సామా టెక్నాలజీస్‌ను ఆయన స్థాపించారు. సామా టెక్నాలజిస్ అభివృద్ధి చేసిన బిగ్ డేటా ఆధారిత క్లినికల్ అనలిటిక్స్ సాంకేతికతలు కోవిడ్ – 19 వ్యాక్సిన్ అభివృద్ధి, క్లినికల్ ట్రయల్ డేటా విశ్లేషణ సంబంధిన భారీ డేటాను విశ్లేషించడంలో కీలకంగా ఉపయోగపడ్డాయి.

# హెచ్‌జిసిఎల్, హెచ్‌ఎండిఎలలో కీలక మార్పులు

**అధికారుల బదిలీలు, అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు**

ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జిసిఎల్), హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండిఎ), హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్‌ఎంఆర్‌ఎల్), ప్రజారోగ్య శాఖ ఇంజనీరింగ్ శాఖలలో రాష్ట్ర ప్రభుత్వం పలువురు ఉన్నతాధికారులకు బదిలీలు, పోస్టింగ్‌లు, పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసి) అప్పగిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వుల ప్రకారం హెచ్‌ఎండిఏ జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ ఆర్. ఉపేందర్ రెడ్డికి హెచ్‌జిసిఎల్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. హెచ్‌జిసిఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ సి.హెచ్. పరమజ్యోతికి ఇంజనీర్‌ఇన్‌చీఫ్ (ఎఫ్ఏసి) బాధ్యతలు అప్పగిస్తూ, ఆమె ప్రస్తుతం నిర్వహిస్తున్న చీఫ్ జనరల్ మేనేజర్ బాధ్యతలను కూడా కొనసాగించాలని ఆదేశించారు. హెచ్‌ఎంఆర్‌ఎల్ చీఫ్ ఇంజనీర్ (ఎఫ్ఏసి) వై. సాయప్ప రెడ్డిని ప్రజారోగ్య శాఖ ఇంజనీర్‌ఇన్‌చీఫ్ (ఎఫ్ఏసి)గా బదిలీ చేశారు. ప్రజారోగ్య శాఖ ఇంజనీర్‌ఇన్‌చీఫ్ (ఎఫ్ఏసి) ఎస్. భాస్కర్ రెడ్డిని హెచ్‌ఎంఆర్‌ఎల్ చీఫ్ ఇంజనీర్‌గా నియమించారు. జిహెచ్ఎంసి శంషాబాద్ జోనల్ కమిషనర్ కె. చంద్రకళకు హెచ్‌ఎండిఏ కోర్ అర్బన్ రీజియన్, ల్యాండ్ పూలింగ్ అండ్ మెట్రో రైల్ విభాగ జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ (ఎఫ్ఏసి) బాధ్యతలతో పాటు హెచ్‌జిసిఎల్‌లో స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) పూర్తి అదనపు బాధ్యతలను కూడా ప్రభుత్వం అప్పగించింది. ఈ ఉత్తర్వులను వెంటనే అమలు చేసి, అవసరమైన తదుపరి చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖాధిపతులు, మేనేజింగ్ డైరెక్టర్లు, హెచ్‌ఎండిఏ మెట్రోపాలిటన్ కమిషనర్‌కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

**హెచ్‌జిసిఎల్ మేనేజింగ్ డైరెక్టర్‌గా.. ఆర్. ఉపేందర్ రెడ్డి బాధ్యతల స్వీకరణ**

హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జిసిఎల్) కొత్త మేనేజింగ్ డైరెక్టర్‌గా హెచ్‌ఎండిఏ జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ ఆర్. ఉపేందర్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ ప్రభుత్వం మెట్రోపాలిటన్ ఏరియా అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (ప్లానింగ్II) శాఖ ద్వారా ఈ కీలక పదవిని ఆయనకు పూర్తి అదనపు బాధ్యత (ఫుల్ అడిషనల్ ఛార్జ్ ఎఫ్ఏసి)గా తక్షణమే అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే హెచ్‌ఎండిఏలో జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఉపేందర్ రెడ్డికి, తాజాగా హెచ్‌జిసిఎల్ ఎం.డి. బాధ్యతలు కూడా అదనంగా కేటాయించడం విశేషం.



బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఉపేందర్ రెడ్డి హెచ్‌జిసిఎల్ సీనియర్ అధికారులు, ఇతర సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంస్థ ప్రస్తుతం చేపడుతున్న వివిధ ప్రాజెక్టులు, వాటి పురోగతి, సంస్థ నిర్వహణకు సంబంధించిన కీలక అంశాలపై ఆయన సమగ్రంగా చర్చించారు.

**క్షేత్రస్థాయి పర్యటన.. ప్రాజెక్టు స్థలాల పరిశీలన**

తన తొలి రోజు విధుల్లో భాగంగా ఉపేందర్ రెడ్డి కార్యాలయానికే పరిమితం కాకుండా, నేరుగా క్షేత్రస్థాయికి వెళ్లి పలు ప్రాజెక్టు స్థలాలను సందర్శించారు. అక్కడ కొనసాగుతున్న నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించి, క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో మమేకమై పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండరాదని, నిర్దేశించిన కాలవ్యవధిలోగా పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అలాగే ప్రాజెక్టు అమలులో పాలుపంచుకుంటున్న వివిధ శాఖలు, సంస్థల మధ్య సమర్థవంతమైన సమన్వయం ఉండాలని, తద్వారానే పనులు వేగంగా, నాణ్యతతో పూర్తవుతాయన్నారు.

**నిరంతర పర్యవేక్షణపై దృష్టి**

ప్రాజెక్టుల విజయవంతమైన అమలుకు నిరంతర పర్యవేక్షణ అత్యంత ఆవశ్యకమని కొత్త మేనేజింగ్ డైరెక్టర్ స్పష్టం చేశారు. హెచ్‌జిసిఎల్ నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు, నగర మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేసేందుకు అధికారులంతా సమన్వయంతో, చురుకైన తీరులో, బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. మౌలిక వసతుల ప్రాజెక్టుల పురోగతిపై నిరంతరం దృష్టి సారించి, ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మొత్తంమీద, బాధ్యతలు స్వీకరించిన తొలిరోజే క్షేత్రస్థాయి పర్యటనతో ఆయన చురుకైన పనితీరును ప్రదర్శించడం విశేషం. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఉపేందర్ రెడ్డికి ఇంజనీర్‌ఇన్‌చీఫ్ సి.హెచ్.పరంజ్యోతి, భూసేకరణ ప్రత్యేక కలెక్టర్ కె.చంద్రకళలు శుభాకాంక్షలు తెలిపారు.

## నకిలీ నంబర్ ప్లేట్లపై ట్రాఫిక్ పోలీసుల ఉక్కుపాదం

- *వారం రోజుల్లో 6 క్రిమినల్ కేసులు.. వాహనాలు సీజ్*
- *నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు: జాయింట్ సిపి జోయల్ డేవిస్*

ప్రజాపక్షం/హైదరాబాద్:నంబర్ ప్లేట్‌నే మార్చి చట్టానికి చిక్కకుండా తప్పించుకోవాలనుకుంటున్న వాహనదారులకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు గట్టి షాక్ ఇస్తున్నారు. నకిలీ, ట్యాంపరింగ్ చేసిన, నిబంధనలకు విరుద్ధమైన నంబర్ ప్లేట్లపై ప్రత్యేక నిఘా పెట్టిన పోలీసులు.. వారం రోజుల్లోనే ఆరు క్రిమినల్ కేసులు నమోదు చేసి, సంబంధిత వాహనాలను సీజ్ చేశారు. వాహనం అసలు గుర్తింపును దాచడం, ట్రాఫిక్ చలాన్ల నుంచి తప్పించుకోవడం లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు నకిలీ నంబర్ ప్లేట్లను ఉపయోగించడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు ట్రాఫిక్ జాయింట్ సిపి డి. జోయల్ డేవిస్ స్పష్టం చేశారు.ప్రత్యేక తనిఖీల్లో భాగంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నకిలీ నంబర్ ప్లేట్లతో పట్టుబడిన వాహనదారులపై మోటారు వాహనాల చట్టంతో పాటు సంబంధిత క్రిమినల్ చట్టాల కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



**ఆరు కేసులు.. ఆరు పోలీస్ స్టేషన్లు**

నకిలీ నంబర్ ప్లేట్లకు సంబంధించి హద్నూర్, కాలాపత్తర్, అఫ్జల్‌గంజ్, ఇంతేజార్‌గంజ్, కామారెడ్డి టౌన్, ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఒక్కో క్రిమినల్ కేసు నమోదైంది. కేసుల దర్యాప్తులో భాగంగా సంబంధిత వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ప్రభుత్వం నిర్దేశించిన హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు మాత్రమే వాహనాలకు అమర్చాలని ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. నంబర్ ప్లేట్లపై ఇష్టానుసారంగా డిజైన్లు మార్చడం, అంకెలను తొలగించడం లేదా మార్చడం, తాత్కాలిక స్టిక్కర్లు ఉపయోగించడం వంటి చర్యలు చట్టవిరుద్ధమని హెచ్చరించారు. నకిలీ లేదా ట్యాంపరింగ్ చేసిన నంబర్ ప్లేట్ల విషయంలో జీరో టాలరెన్స్ విధానాన్ని అమలు చేస్తున్నామని జాయింట్ సీపీ జోయల్ డేవిస్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. నగరంలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, రహదారి భద్రతను మరింత బలోపేతం చేసేందుకు నంబర్ ప్లేట్లపై ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన తెలిపారు. వాహనదారులంతా నిబంధనలకు అనుగుణంగా నంబర్ ప్లేట్లను ఏర్పాటు చేసుకోవాలని, ఉల్లంఘనలకు పాల్పడి చట్టపరమైన చర్యలకు గురికావద్దని పోలీసులు సూచించారు.

## వృద్ధుల పట్ల గౌరవం, ప్రేమ, బాధ్యతతో వ్యవహరించాలి: న్యాయవాది షాలేం బాబు



వయోవృద్ధులకు న్యాయ అవగాహన కార్యక్రమం



ప్రజాపక్షం/హైదరాబాద్ : వృద్ధుల పట్ల వారి కుటుంబ సభ్యులు, ఇతరులు ప్రేమ, గౌరవం, బాధ్యతతో వ్యవహరించాలని డిఎస్‌ఎల్ఎ ప్యానెల్ న్యాయవాది షాలేం బాబు తెలిపారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మల్లేపల్లి రోడ్ సీతారాంబాగ్‌లోని జగన్నాథస్వామి వృద్ధాశ్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వారి సంక్షేమం, గౌరవప్రదమైన జీవనం కోసం సమాజంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. వృద్ధులలకు వారి చట్టపరమైన హక్కులు, రక్షణ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా వారికి అందుబాటులో ఉన్న న్యాయ సహాయ సేవలపై అవగాహన కల్పించారు. ప్రధానంగనా తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంరక్షణ, సంక్షేమ చట్టం, 2007లో వృద్ధులకు కల్పించిన హక్కులు వివరించారు. అలాగే వారి సంరక్షణ బాధ్యతలు, నిర్లక్ష్యం, వేదింపులకు గురైనప్పుడు తీసుకోవాల్సిన చట్టపరమైన చర్యలను గూర్చి తెలిపారు. డిఎస్ఎస్ఎ ప్యానల్ న్యాయవాది షాలెం బాబు, ప్యారా లీగల్ వాలంటీర్లు మజీద్, అబ్దుల్ ఖాధిర్, డిఎల్ఎస్ఎ ప్రతినిధి కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. వృద్ధాశ్రమంలోని వృద్ధులు తమ హక్కులు, అందుబాటులో ఉన్న న్యాయ సేవలపై అవగాహన కల్పించినందుకు వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.


## కల్తీ మసాలల కేసులో కౌంటరు దాఖలు చేయాలి

ప్రజాపక్షం/హైదరాబాద్:కల్తీ మసాలల తయారీకి సంబంధించి నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ దాఖలైన పిటిషర్ పై పూర్తి వివరాలతో కౌంటరు దాఖలు చేయాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. నిందితులకు తక్షణ ఉపశమనం కల్పించేలా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు న్యాయమూర్తి నిరాకరించారు. కల్తీ మసాలాలు తయారు చేస్తున్నారన్న ఆరోపణలతో పోలీసులు నమోదు చేసిన కేసును రద్దు చేయాలని కోరుతూ వికాస్ అగర్వాల్ తదితరులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషనర్ పై జస్టిస్ జె.శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదిస్తూ.. ఆహార కల్తీకి సంబంధించి కేసులు నమోదు చేసే అధికారం పోలీసులకు లేదని పేర్కొన్నారు. పోలీసులు సోదాలు నిర్వహించిన సమయంలో పిటిషనర్ అక్కడ లేరని, పోలీసు కస్టడీలో ఉన్న మరో నిందితుడు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగానే పిటిషనర్‌పై కేసు నమోదు చేశారని తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకుండా కేసు నమోదు చేసినందున దానిని కొట్టివేయాలని కోరారు.పీపీ పల్లె నాగేశ్వరరావు వాదిస్తూ.. నగరంలో విస్తరిస్తున్న ఆహార కల్తీని అరికట్టేందుకు పోలీసులు తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నారని తెలిపారు. ముఠాలుగా ఏర్పడి తయారు చేస్తున్న కల్తీ ఆహార పదార్థాలను ప్రజలు వినియోగిస్తున్నారని, వాటిని వినియోగిస్తున్నవారిలో న్యాయమూర్తులు కూడా ఉన్నారని కోర్టు దష్టికి తీసుకువచ్చారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలతో కౌంటరు దాఖలు చేయాలని పోలీసులను తదుపరి విచారణను వాయిదా వేశారు.

## బార్ కౌన్సిల్ ఎన్‌రోల్‌మెంట్‌కు లైన్ క్లియర్

ప్రజాపక్షం/హైదరాబాద్:సింగిల్ జడ్జి ఉత్తర్వుల కారణంగా నిలిచిపోయిన రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియను తిరిగి కొనసాగించేందుకు హైకోర్టు అనుమతించింది. ఎన్‌రోల్‌మెంట్‌పై సింగిల్ జడ్జి విధించిన మధ్యంతర నిలుపుదల ఉత్తర్వుల అమలును ధర్మాసనం నిలిపివేసింది. ఎన్నికలు పూర్తయినప్పటికీ తాత్కాలిక కమిటీ ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియను చేపట్టడాన్ని సవాలు చేస్తూ బి.జగదీశ్వర్ దాఖలు చేసిన పిటిషనర్‌పై సింగిల్ జడ్జి విచారణ జరిపి ఎంR రోల్‌మెంట్‌ను నిలిపివేశారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ న్యాయశాస్త్ర విద్య పూర్తి చేసిన కె. బి.శ్రీజారెడ్డి అప్పీల్ దాఖలు చేశారు. ఈ అప్పీల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుదీనర్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. అప్పీలుదారు తరఫు న్యాయవాది బాగ్లేకర్ ఆకాశ్‌కుమార్ వాదిస్తూ.. తన క్లయింట్ జులై 27న ఎన్‌రోల్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఆగస్టు 13న ఎన్‌రోల్‌మెంట్ జరగాల్సి ఉండగా సింగిల్ జడ్జి ఉత్తర్వుల కారణంగా ప్రక్రియ నిలిచిపోయిందని చెప్పారు. దీనివల్ల పిటిషనర్‌కు ఉన్న హక్కులకు నష్టం జరుగుతోందని కోర్టుకు వివరించారు. వాదనలు విన్న ధర్మాసనం.. న్యాయశాస్త్రంలో పట్టా పొందిన విద్యార్థులకు బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ అయ్యే హక్కు ఉంటుందని స్పష్టం చేసింది. ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియకు బార్ కౌన్సిల్ ఎన్నికలతో సంబంధం లేదని పేర్కొంది. తాత్కాలిక కమిటీ ఆధ్వర్యంలో ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియను యథావిధిగా కొనసాగించవచ్చని స్పష్టం చేస్తూ సింగిల్ జడ్జి ఉత్తర్వుల అమలును నిలిపివేసింది. ఈ ఉత్తర్వుల నేపథ్యంలో సోమవారం నుంచి ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియను తిరిగి ప్రారంభించనున్నట్లు బార్ కౌన్సిల్ వెల్లడించింది.

## నేను ఊహించినట్టుగానే 'మార్గదర్శి'పై 'సుప్రీం' తీర్పు: ఉండవల్లి అరుణ్ కుమార్



ప్రజాపక్షం/హైదరాబాద్:తాను ముందుగానే ఊహించినట్టుగా మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై సుప్రీంకోర్టు తన తీర్పును వెల్లడించిందని మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్ కుమార్ పేర్కొన్నారు. మార్గదర్శిపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన సందర్భంగా శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మార్గదర్శిలో ఆర్థికపరమైన అవకతవకలకు సంబంధించి గతంలో తాను సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని, ఆ తర్వాత మార్గదర్శి చెల్లింపుల ప్రక్రియ చేపట్టిందన్నారు. మార్గదర్శి అధినేత రామోజీరావు కొన్ని ఆస్తులు అమ్ముకొని బకాయిలు చెల్లించారని, దీంతో తన లక్ష్యం నెరవేరిందన్నారు. దీంతో బకాయిదారులకు ఎగవేత చేయకుండా తాను చేసిన ప్రయత్నం సఫలమైందన్నారు. రామోజీరావుపై తనకు ఎలాంటి కక్ష లేదని ఆయన స్పష్టంచేశారు. మార్గదర్శి ఆర్థికపరమైన అవకతవకలను ఆర్‌బిఐ త్వరలోనే పరిశీలిస్తుందని, దీనిపై తనకు పూర్తి నమ్మకం ఉన్నదని ఆయన స్పష్టంచేశారు. సమావేశం ముగిసిన అనంతరం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన ఫొటోగ్రఫీ ప్రదర్శనను ఆయన తిలకించారు.

## కర్ణాటక ప్రీమియం లిక్కర్‌పై పోలీసుల దాడి: 55 బాటిళ్లు స్వాధీనం



ప్రజాపక్షం/హైదరాబాద్: కర్ణాటక నుంచి అక్రమంగా తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తున్న ప్రీమియం లిక్కర్‌ను అమీర్‌పేట పోలీసులు పట్టుకున్నారు. సుమారు రూ.1.50 లక్షల విలువైన 55 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన ఎస్‌ఆర్‌నగర్‌లో చోటుచేసుకుంది. అమీర్‌పేట సిఐ బానోత్ పటేల్ సిబ్బందితో కలిసి ఎస్‌ఆర్‌నగర్‌లోని ఉమేష్‌చంద్ర విగ్రహం వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా.. అనుమానాస్పదంగా మద్యం బాటిళ్లతో ఉన్న వ్యక్తినివ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న నాలుగు బాటిళ్లను పరిశీలించగా అవి కర్ణాటకకు చెందిన ప్రీమియం లిక్కర్‌గా గుర్తించారు. పోలీసుల విచారణలో అతను కె. గోవర్ధన్‌రెడ్డి (46) వద్ద నుంచి మద్యం తీసుకున్నట్లు వెల్లడించాడు. అతను ఇచ్చిన సమాచారంతో పోలీసులు గోవర్ధన్‌రెడ్డి ఇంటిపై సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల కర్ణాటక డిఫెన్స్ లిక్కర్‌కు చెందిన మరో 51 బాటిళ్లు పట్టుబడ్డాయి.కర్ణాటక నుంచి డిఫెన్స్ లిక్కర్‌ను తక్కువ ధరకు కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తీసుకొచ్చి ఒక్కో బాటిల్‌పై రూ.300 నుంచి రూ.500 వరకు లాభం తీసుకుంటూ విక్రయిస్తున్నట్లు విచారణలో గోవర్ధన్‌రెడ్డి వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న మొత్తం 55 మద్యం బాటిళ్ల విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు అమీర్‌పేట సిఐ బానోత్ పటేల్ తెలిపారు.ఈ ఆపరేషన్‌లో పోలీసు సిబ్బంది వాణి, రాధా, రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కోడింగ్ ఇచ్చేవరకు కులగణన వాయిదా



బిసి సంఘాల నేతల ప్రొ.యోగేంద్ర యాదవ్

ప్రజాపక్షం/హిమాయత్‌నగర్: ఒబిసి కులాలకు ప్రత్యేక ప్రామాణికమైన సమగ్ర కుల కోడింగ్ విధానాన్ని ఖరారు చేసే వరకు జనగణన – 2027లో కులగణనను వాయిదా వేయాలని పలువురు బిసి, ఒబిసి సంఘాల ప్రతినిధులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆలిండియా ఒబిసి స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కిరణ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన " ఓపెన్ కాస్ట్ కాలమ్, క్లోజ్డ్ జస్టిస్, జనగణన – 2027లో అన్యాయం" అనే అంశంపై ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్‌తో ఒబిసి సంఘాల ప్రతినిధుల ముఖాముఖి జరిగింది. ఈ సందర్భంగా యోగేంద్ర యాదవ్ మాట్లాడుతూ కులగణన ద్వారా సామాజిక న్యాయం, ప్రాతినిధ్యం, రిజర్వేషన్లు, విధాన రూపకల్పనకు ఉపయోగపడేలా విశ్వసనీయమైన, ప్రామాణికమైన, శాస్త్రీయమైన డేటా రూపొందించాలన్నారు. ఒబిసిలకు ప్రామాణిక కోడింగ్ లేకుండా ఓపెన్ కాస్ట్ కాలమ్ నిర్వహిస్తే ఒకే కుల ప్రాంతీయ పేర్లు వేర్వేరుగా కులాలుగా నమోదయ్యే ప్రమాదం ఉన్నదన్నారు. ఎస్‌సి, ఎస్‌టిల తరహాలోనే ఒబిసిలకు కులగణన చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బిసి ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు, బిసి పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్, బిసి సంఘాల నేలు చామకూర రాజు, పొన్నం దేవరాజ్ గౌడ్, గణేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు



ప్రజాపక్షం/నల్లకుంట/జూబ్లీహిల్స్: క్యూర్ పరిధిలోని ప్రజలు వరలక్ష్మి వ్రతం సందర్భంగా మహాలక్ష్మి అమ్మవారికి ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ఆలయాల్లో మహిళలకు పసుపు, కుంకుమ అందించడం జరిగింది. ఈ మేరకు బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు, గోవింద్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు భీమనబోయిన నర్సింగ్‌రావు యాదవ్, అనిత దంపతుల ఆధ్వర్యంలో శ్రావణమాస వరలక్ష్మి వ్రత ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమంలో అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, బిజెపి సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. కాగా.. నల్లకుంట డివిజన్ బిఆర్ఎస్ నాయకురాలు గంగిశెట్టి లిఖిత గౌడ్ ఆధ్వర్యంలో వరలక్ష్మి వ్రత ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పద్మరెడ్డి, పద్మావతి రెడ్డి, వై.అమృత, బిఆర్ఎస్ మహిళా నాయకురాళ్లు కళ్యాణి, విజయ, స్వప్న, క్రిష్టోలైట్, రజియా బేగం, రజియా, అనిత, లావణ్య, వర్ష, జ్యోతి తదితరులు పాల్గొన్నారు. ఇదిలాఉండగా.. కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ సభ్యులు గోలి మల్లారెడ్డి, బరిగెల జ్ఞానేశ్వర్, రంగస్వామి, రజిని, లక్ష్మి, సుజాతతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

# యువ అంతరిక్ష రంగంలో వ్యవస్థాపకులకు ప్రభుత్వం పూర్తి మద్దతు

### ప్రధాని మోదీ హామీ

**న్యూఢిల్లీ :** 'యువ అంతరిక్ష రంగంలో వ్యవస్థాపకుల (ఎంటర్‌ప్రెన్యూర్స్)కు ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుంది' అని శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. వ్యవసాయం, పశు సంపద నిర్వహణ, పాడి, పర్యావరణం ప్రజల దైనందిన జీవితాలను ప్రభావితం చేసే ఇతర రంగాలలో అంతరిక్ష రంగంసాంకేతికతను ఎలా ఉపయోగించవచ్చో అన్వేషించాలని ఆయన వారిని కోరారు. ప్రధానమంత్రి మోదీ ఇక్కడ 20 అంతరిక్ష స్టార్టప్‌ల సిఇఓలు, వ్యవస్థాపకులతో సంభాషిస్తూ, అంతరిక్ష స్టార్టప్‌ల వంటి కొత్త సవాల్‌తో కూడిన రంగంలోకి ప్రవేశించి, రిస్క్‌లు తీసుకుని, సంస్కరణల ప్రక్రియను విశ్వసించి, తమ ప్రయత్నాలతో నిలకడగా ఉంటూ అద్భుతమైన ధైర్యాన్ని ప్రదర్శించినందుకు మోదీ వారిని ప్రశంసించారు. ప్రభుత్వ పూర్తి మద్దతు యువ అంతరిక్ష వ్యవస్థాపకులకు తప్పక ఉంటుందనే హామీ ఇవ్వడంతోపాటు, తమ సాంకేతిక పరిజ్ఞానాల వినియోగాన్ని విస్తరించడానికి అంతరిక్ష రంగం సంస్థలు, ఇతర రంగాల సంస్థల మధ్య మరింత సహకారం ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. 'భవిష్యత్తు కోసం భారతదేశ సామర్థ్యాలను పెంపొందించే క్రమంలో అంతరిక్ష స్టార్టప్‌లకు భారత ప్రభుత్వం అండగా నిలుస్తుందని నేను హామీ



ఇచ్చాను. అంతరిక్ష రంగంలో భారతదేశం ప్రపంచానికి బలమైన, వినూత్నమైన, వాణిజ్యపరంగా లాభదాయకమైన నమూనాను అందించగలదు' అని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతరిక్ష శిథిలాలపై పనిచేస్తున్న కంపెనీలు తమ సాంకేతికతలను విస్తరించడానికి పర్యావరణ సంస్థలతో కలిసి పనిచేయవచ్చని, వ్యవసాయ రంగంతో కలిసి పనిచేస్తున్న అంతరిక్ష సాంకేతిక కంపెనీలు,రైతులు మరింత సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకుని, తమ ఉత్పత్తిని గరిష్ఠ స్థాయికి చేర్చుకోవడంలో సహాయపడటానికి వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, విభాగాలతో సహకరించుకోవచ్చన్నారు. స్టార్టప్‌లు తమ పనిపై విపులమైన ప్రెజెంటేషన్లు ఇచ్చాయని, ప్రభుత్వ స్థల సంస్కరణలను, పరిశ్రమ అభివృద్ధికి వారు కల్పించిన అవకాశాలను అభినందించారని ప్రధాని మోదీ చెప్పారు. భారతదేశ ప్రైవేట్ అంతరిక్ష పర్యావరణ వ్యవస్థ దేశానికి, ప్రపంచానికీ ఒక ప్రధాన శక్తిగా మారగలదని ఆయన అభిలషించారు. అలాగే అంతరిక్షం గురించి ఆలోచించేటప్పుడు, ప్రపంచం భారతదేశం వైపు చూసేలాంటి పర్యావరణ వ్యవస్థ ఉండేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. భారతదేశ అంతరిక్ష రంగం ప్రపంచ స్థాయి కంపెనీలను, పెట్టుబడులను దేశానికి ఆకర్షించే అయస్కాంతంలా పనిచేయగలదన్న విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా భారతదేశం స్థానాన్ని వేగంగా, బలోపేతం చేయాలని ఆయన పరిశ్రమ వర్గాలను కోరారు. ప్రైవేట్ అంతరిక్ష రంగం చూపిన విశ్వాసం, ఈ పరిశ్రమలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని కల్పించాలనే దార్శనికతను మరింత బలోపేతం చేసిందని మోదీ తెలియజేశారు. ప్రైవేట్ అంతరిక్షపరిశ్రమ సాధిస్తున్న వేగవంతమైన పురోగతిని సిఇఓలు ప్రముఖంగా ప్రస్తావించి, దాని భవిష్యత్తుపై తమ దార్శనికతను పంచుకున్నారు. ఈ సంభాషణలలో పాల్గొన్న స్టార్టప్‌లలో స్కైరూట్, ఏరోస్పేస్, అగ్నికుల్ కాస్మోస్, పిక్సెల్, ధ్రువ స్పేస్, గెలాక్స్ ఐ, పియర్ సైట్, బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్, దిగంతర, శాట్ ష్యూర్, సుహోరా టెక్నాలజీస్, మనస్తు స్పేస్, ఆస్ట్రో బేస్, టేస్ టూ స్పేస్, వ్యోమిక్, కాస్మోసెర్వ్ స్పేస్, ఆర్బిట్ ఎయిడ్ ఏరోస్పేస్, స్కై సెర్వ్ (హై స్పేస్), సెరెండిపిటి స్పేస్, వాస్సర్‌ల్యాబ్స్, మిస్ట్ ఈవో ఉన్నాయి.

## ప్రజా వ్యతిరేక ఇంధన విధానం దేశానికి ఆమోదయోగ్యం కాదు

### ఇ-20 విధానాన్ని తక్షణమే సమీక్షించాలి
### కేంద్రాన్ని డిమాండ్ చేసిన కాంగ్రెస్



**న్యూఢిల్లీ:** నరేంద్ర మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ పార్టీ విమర్శల పర్వం కొనసాగుతోంది. పలు సమస్యలు, ప్రజా వ్యతిరేక విధానాలపై నిత్యం దుమ్మెత్తిపోస్తున్న ప్రతిపక్ష పార్టీ తాజాగా ఇ–20 విధానాన్ని తక్షణమే సమీక్షించాలని డిమాండ్ చేసింది. వాహనాల నిర్వహణ, వంటగది ఖర్చులను పెంచే ఈ ప్రజా వ్యతిరేక ఇంధన విధానం దేశానికి ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది. దేశంలో మూడు నెలల వ్యవధిలో చక్కెర ధరలు 40 శాతం, బెల్లం ధర 24శాతం, బియ్యం ధర 16 శాతం, మొక్కజొన్న పిండి ధర 11 శాతం పెరిగాయని పేర్కొన్న ఒక హిందీ దినపత్రిక కథనానికి సంబంధించిన స్క్రీన్‌షాట్‌ను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా పంచుకున్నారు. 'మోదీ ప్రభుత్వ దూరదృష్టి లేని, ప్రజా వ్యతిరేక ఇ–20 విధానం కారణంగా, ఒకవైపు ద్రవ్యోల్బణం పెరుగుతుండగా, మరోవైపు వాహన యజమానులు తగ్గిన మైలేజీ, వాహనాలకు కలిగే నష్టాల భారాన్ని మోయాల్సి వస్తోందన్నారు. దీనివల్ల ప్రజలు రోడ్లపైన, తమ వంటగదులలో రెండింటిలోనూ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందని జైరామ్ మండిపడ్డారు. పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్‌ను కలపడానికి చెరకు, ధాన్యాన్ని మళ్లించడం వల్ల ఆయా సరుకుల కొరత ఏర్పడటం అనివార్యమని, అలాగే 20 శాతం ఇథనాల్ మిశ్రమాన్ని తట్టుకునేలా రూపొందించని వాహనాలు దెబ్బతినే ప్రమాదం ఉందని రమేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. సరైన పరీక్షలు లేకుండా ఈ విధానాన్ని అమలు చేయడం వల్ల వాహనాల మైలేజీ తగ్గుతోందని ఆయన ఎత్తి చూపారు. చక్కెర తయారీకి ఉపయోగపడే 25 లక్షల టన్నుల చెరకును ఇథనాల్ ఉత్పత్తికి మళ్లించిన విషయం ఇప్పుడు స్పష్టమైందని, దీని ఫలితంగా గత మూడు నెలల్లోనే చక్కెర ధర కిలోకు రూ. 48 నుండి రూ. 67కి, బెల్లం ధర రూ. 50 నుండి రూ. 65కి పెరిగిందని ఆయన తెలిపారు. బియ్యం 16 శాతం, మొక్కజొన్న పిండి ధరలు 11 శాతం పెరిగాయని, అలాగే పశుగ్రాసం ధర 10.34 శాతం పెరిగిందని ఆయన పేర్కొన్నారు. 'ఇథనాల్ ఉత్పత్తిలో నిమగ్నమైన తమ సన్నిహితుల లాభాలను గరిష్ఠం చేసే తొందరపాటు చర్యలో భాగంగా, వాహన యజమానులకు ఇంధన ఎంపికలు పరిమితం చేయబడ్డాయి; అయినప్పటికీ, వాహన మైలేజీ, ఇ–20 ఇంధనంతో వాహనాల అనుకూలతకు సంబంధించి తీవ్రమైన ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి' అని రమేశ్ అన్నారు. అంతర్జాతీయ ముడి చమురు ధరలు తగ్గడం, 20 శాతం ఇథనాల్ కలపడం ద్వారా ఖర్చు ఆదా అవుతున్నప్పటికీ, పెట్రోల్ ధరలలో ఎలాంటి తగ్గింపు లేకపోవడం ఆశ్చర్యకరమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడైన రాహుల్ గాంధీ, ఇ–20 విధానం చుట్టూ ఉన్న అవినీతిని నిరంతరం ఎత్తి చూపుతున్నారని ఆయన అన్నారు.

## గుజరాత్ సిఎంగా 'వందేమాతరం' పూర్తిగా పాడారా?

**న్యూఢిల్లీ:** 'వందేమాతరం' గేయం లో కేవలం రెండు చరణాలను మాత్రమే పాడాలన్న కాంగ్రెస్ నిర్ణయంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన 'దేశ వ్యతిరేక' వ్యాఖ్యలను రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్ శుక్రవారం తిప్పికొట్టారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్ర మోదీ లేదా ప్రధాన మంత్రిగా అటల్ బిహారీ వాజ్‌పేయి ఈ గేయాన్ని పూర్తిగా పాడారా అని ఆయన ప్రశ్నించారు. 'వందేమాతరం' గేయాన్ని పూర్తిగా పాడని బిజెపి నాయకులు కూడా 'దేశ వ్యతిరేకులు' అవుతారా అని సిబల్ నిలదీశారు. 'వందేమాతరంపై రెండు చరణాల నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్ పనితీరును అమిత్ షా దేశ వ్యతిరేకం అని అభివర్ణించారు. నా ప్రశ్న ఏమిటంటే: 1950 నుండి జరిగిన ప్రైవేట్ లేదా అధికారిక కార్యక్రమాల్లో బిజెపి నాయకులు, గుజరాత్ సిఎంగా మోదీజీ లేదా ప్రధాని వాజ్‌పేయి ఈ గేయంలోని అన్ని చరణాలను పాడారా? అని స్వతంత్ర ఎంపి సిబల్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. బిజెపి ఓటు బ్యాంకు రాజకీయాలు బయటపడుతున్నాయన్నారు. జాతీయ గేయంలో కేవలం రెండు చరణాలను మాత్రమే పాడాలన్న కాంగ్రెస్ నిర్ణయం చట్టానికి విరుద్ధమని, ఓటు బ్యాంకును ప్రసన్నం చేసుకోవడమే దీని ఉద్దేశమని ఆరోపిస్తూ అమిత్ షా కాంగ్రెస్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించడంతో గురువారం 'వందేమాతరం' వివాదం ముదిరింది. దీనికి ప్రతిగా కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ స్పందిస్తూ, బిజెపి నాయకులను కపట దేశభక్తులు అని విమర్శించారు. జాతీయ గేయాని పూర్తిగా కాకుండా కేవలం రెండు చరణాలను మాత్రమే పాడాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ బుధవారం తీసుకున్న నిర్ణయం నేపథ్యంలో ఈ మాటల యుద్ధం మొదలైంది.

## చక్కెర ధరల పెరుగుదలకు.. ఇథనాల్‌తో సంబంధం లేదు

### కేంద్ర ప్రభుత్వం స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** దేశీయ అవసరాలకు సరిపడా నిల్వలు ఉన్నప్పటికీ, ఇథనాల్ ఉత్పత్తి కోసం చక్కెరను మళ్లిస్తున్న కారణంగానే దాని ధరలు విపరీతంగా పెరుగుతున్నాయన్న ఆరోపణలను శుక్రవారం కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చింది. బదులుగా, ఆ పరిశ్రమే ధరలను పెంచిందని ఆరోపించింది. తీపి పదార్థాన్ని నిల్వచేయడం, బ్లాక్ మార్కెటింగ్ చేయడంపై చర్యలు తీసుకోవాలని, అలాగే, అక్టోబరు 15వ తేదీనాటికి మిల్లుల ద్వారా క్రషింగ్ సీజన్‌ను ముందుగానే ప్రారంభించేందుకు సన్నాహాలు మొదలు పెట్టాలని రాష్ట్రాలను కోరినట్లు కేంద్రం తెలిపింది. ప్రస్తుతం డీలర్లు నిల్వ ఉంచుకోగల స్టాక్‌ను తగ్గించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు వివరించింది. చక్కెర లభ్యత, ధరలపై మీడియా సమావేశంలో ఆహార కార్యదర్శి సంజీవ్ చోప్రా మాట్లాడుతూ అక్టోబరు 31నాటికి 10 లక్షల టన్నుల చక్కెర దిగుమతులకు అనుమతించడం, డీలర్లతోపాటు శీతలపానీయాలు, ఐస్‌క్రీముల తయారీదారుల వంటి బల్క్ వినియోగదారులపై నిల్వల పరిమితులను విధించడం ద్వారా ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు తీసుకుందని తెలియజేశారు.2025–26 మార్కెటింగ్ సంవత్సరానికి (అక్టోబరు–సెప్టెం



బరు) ఉత్పత్తి మునుపటి అంచనాలైన 343 లక్షల టన్నుల నుంచి 306 లక్షల టన్నులకు పడిపోయినప్పటికీ, దేశంలో చక్కెర నిల్వలు పుష్కలంగా ఉన్నాయని ఆయన నొక్కిచెప్పారు. వార్షి దేశీయ చక్కెర డిమాండ్ సుమారు 280 నుంచి 285 లక్షల టన్నులుగా ఉంది. చెరుకు పంటలో రెడ్ రాట్, టాప్ బోరర్ తెగుళ్లు, అలాగే, వర్షాల వల్ల ఏర్పడిన నీటి నిల్వ కారణంగా ఉత్పత్తి దెబ్బతిన్నదని సంజీవ్ చోప్రా చెప్పారు.

ప్రభుత్వం ఇటీవల తీసుకున్న చర్యల ఫలితంగా, రాబోయే రోజుల్లో చిల్లర ధరలు తగ్గుతాయని ఆహార కార్యదర్శి వివరించారు. జులై 20న కిలోకు రూ.48గా ఉన్న అఖిల భారత సగటు చిల్లర ధర ప్రస్తుతానికి రూ.56కు పెరిగిందని, కేవలం 7నుంచి 10 రోజుల వ్యవధిలోనే మిల్లుల వద్ద చక్కెర ధరలు కిలోకు రూ. 47–48నుంచి రూ.62కు పెరిగాయని, ఈ విధమైన పెంపు పూర్తిగా అన్యాయమని చోప్రా చెప్పారు. శుక్రవారం ఆహార కార్యదర్శి సంజీవ్ చోప్రా, ఐఎస్ఎంఎ, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కో–ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీస్ (ఎన్ఎఫ్ఎస్‌సిఎఫ్)పారిశ్రామిక సంస్థల ప్రతినిధులను పిలిచి , మిల్లు వెలుపలి ధరలలో ఈ ఆకస్మిక, తీవ్రమైన పెరుగుదల ఆమోదయోగ్యం కాదని ఆక్షేపించారు. ఇటీవల చక్కెర ధరల పెరుగుదలకు, ఇథనాల్ ఉత్పత్తి కోసం చక్కెరను మళ్లించడమే కారణమని చెప్పడం సరికాదని చోప్రా అన్నారు.ఈ వైవిధ్యీకరణ చక్కెర రంగం ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచిందని, అలాగే, రైతులకు సకాలంలో చెల్లింపులు చేయడానికి కూడా సహాయపడిందని తెలిపారు. నిల్వలు సౌకర్యవంతంగా ఉన్నప్పటికీ, అత్యంత ముందు జాగ్రత్త చర్యగా సుమారు 10లక్షల టన్నుల ముడి చక్కెరను సుంకం లేకుండా దిగుమతి చేసుకోవడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని సంజీవ్ చోప్రా వివరించారు. తాను రెండు చక్కెర సంఘాలతో సమావేశాలు నిర్వహించి, గత కొన్ని రోజులుగా జరిగింది సరైనది కాదని వారికి చెప్పినట్లు ఆహార కార్యదర్శి చోప్రా తెలిపారు.

## నియామకాల రద్దు తాజా నోటికేషన్‌పై జార్ఖండ్ హైకోర్టు స్టే

### రాష్ట్ర ప్రభుత్వానికి తలనొప్పిగా ఉద్యోగాల వ్యవహారం

**రాంచి:** జార్ఖండ్‌లో విద్యార్థులు, యువత నిరసనలకు తలొగ్గి 2014 నుంచి జరిగిన అన్ని ఉద్యోగ నియామక పరీక్షలను రద్దు చేసిన ప్రభుత్వానికి హైకోర్టు తీర్పులు తలనొప్పిగా మారాయి. ప్రభుత్వం పరీక్షను రద్దు చేస్తూ జారీ చేసిన నోటీకేషన్లలో ఒక్కొక్కదానిపై స్టే విధిస్తూ వస్తోంది. తాజాగా బాలల అభివృద్ధి ప్రాజెక్ట్ అధికారుల (సిడిపిఒ) నియామకాలను, అలాగే జెఎస్ఎస్‌సి–సిజిఎల్ పరీక్ష ద్వారా నియమితులైన వారి నియామకాలను రద్దు చేస్తూ జారీ చేసిన నోటిఫికేషన్లపై జార్ఖండ్ హైకోర్టు శుక్రవారం స్టే విధించింది. 11వ, 13వ జార్ఖండ్ పిఎస్‌సి పరీక్షలను రద్దు చేస్తూ జారీ చేసిన నోటిఫికేషన్లపై బుధవారం కోర్టు స్టే విధించడంతో పాటు, ఆహార భద్రతా అధికారుల నియామకాలను రద్దు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వుపై కూడా అడ్డుకట్ట వేసింది. 'జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్–కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పరీక్ష (జెఎస్ఎస్‌సి–సిజిఎల్) ద్వారా జరిగే నియామకాలను రద్దు చేస్తూ జారీ చేసిన నోటిఫికేషన్‌తో పాటు, సిడిపిఒల నియామకాలను రద్దు చేస్తూ జారీ చేసిన నోటిఫికేషన్ అమలుపై కూడా జస్టిస్ దీపక్ రోషన్ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం స్టే విధించింజని పిటిషనర్ తరపు న్యాయవాది ఇంద్రజిత్ సిన్హా పిటిఐకి తెలిపారు. సెప్టెంబర్ 7న రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేస్తుందని, 14లోగా పిటిషనర్లు రిజాయిండర్ సమర్పిస్తారని ఆయన చెప్పారు.



అంతేకాకుండా, సెప్టెంబర్ 15న షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 2.15 గంటలకు బదులుగా, మధ్యాహ్నం 12.15 గంటలకే ఈ విషయాన్ని విచారిస్తామని కోర్టు చాలా స్పష్టంగా చెప్పిందని, ఈ విషయాన్ని ప్రాధాన్యతా ప్రాతిపదికన తీసుకున్నట్లు కూడా కోర్టు తెలిపినట్లు ఆయన అన్నారు. పిటిషనర్ల తరఫున వాదించిన న్యాయవాది అమృతాంశ్ వాట్స్ మాట్లాడుతూ, అవసరమైతే సెప్టెంబర్ 16 నుంచి రోజువారీ విచారణలు జరిపి ఈ విషయాన్ని పరిష్కరిస్తామన్న అభిప్రాయంలో కోర్టు ఉందని చెప్పారు. నియామకాలలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ 25 రోజుల పాటు జరిగిన ఆందోళనల నేపథ్యంలో, జెఎంఎం నేతృత్వంలోని ప్రభుత్వం ఈనెల 18న 22 పరీక్షలను రద్దు చేయగా, 2014 నుంచి నిర్వహించిన మరో 23 పరీక్షలపై విచారణకు ఆదేశించింది.

**సచివాలయం వద్ద ఉద్యోగుల నిరసనలు**

జార్ఖండ్ ప్రభుత్వం రద్దు చేసిన నియామక పరీక్షలలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు శుక్రవారం కూడా రాష్ట్ర సచివాలయం బయట ప్రదర్శన నిర్వహించారు. గిరిజన నాయకుడు బిర్సా ముండా, జెఎంఎం వ్యవస్థాపకుడు శిబు సోరెన్ చిత్రపటాలు, ప్లకార్డులతో నిరసన తెలిపారు. వీరిలో జెఎస్ఎస్‌సి కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ (సిజిఎల్) పరీక్ష ద్వారా ఎంపికైన వారు కూడా ఉన్నారు. 'న్యాయ్ దో యా ఫాన్సీ దో (మాకు న్యాయం చేయండి లేదా మమ్మల్ని ఉరితీయండి)', 'షర్మ్ కరో, షర్మ్ కరో (సిగ్గుపడండి)' వంటి నినాదాలు చేశారు. దేవ్‌గఢ్‌కు చెందిన, సంక్షేమ అధికారిగా ఎంపికైన రమేశ్ మండల్ మాట్లాడుతూ తాము ఈనెల 19 నుంచి నిరసన తెలుపుతున్నామని, న్యాయం జరిగే వరకు ఈ ఆందోళనను కొనసాగిస్తామన్నారు. ఎలాంటి కారణం చెప్పకుండా జెఎస్ఎస్‌సి–సిజిఎల్ పరీక్షను రద్దు చేయాలన్న తన నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు మరో అభ్యర్థి చందా కుమారి అన్నారు. న్యాయవ్యవస్థపై తమకు పూర్తి విశ్వాసం ఉందని, అన్ని పరీక్షలను రద్దు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంపై కోర్టు స్టే విధిస్తుందని నిరసనకారులు విశ్వాసం వ్యక్తం చేశారు. జెఎస్ఎస్‌సి సిజిఎల్ పరీక్ష ద్వారా ఎంపికైన వారితో సహా, సుమారు 2,700 మంది విజయవంతమైన అభ్యర్థులు ఈ రద్దులకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్నారు. అవకతవకల కారణంగా మెరిట్ ఆధారంగా ఎంపికైన అభ్యర్థులు తమ ఉద్యోగాలను కోల్పోకూడదని వారు వాదిస్తున్నారు. ఇదిలా ఉండగా, జెఎస్ఎస్‌సి గ్రాడ్యుయేట్ లెవెల్ కంబైన్డ్ కాంపిటీటివ్ ఎగ్జామినేషన్ 2023లో జరిగిన అవకతవకలకు సంబంధించి సిఐడి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) 37 మంది అనుమానితులను విచారించింది.

## విద్యార్థులకు న్యాయం చేసేలా 'ఆన్సర్ కీ చాలెంజ్'

- ఈ విధానం ఖరీదైనదేమీ కాదు : ఎన్‌టిఎ

**న్యూఢిల్లీ :** నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) తన చర్యలను సమర్థించుకుంది. తాము తమ 'ఆన్సర్ కీ చాలెంజ్' విధానం విద్యార్థులందరికీ న్యాయం జరిగేలా రూపొందించామని పేరొంకంది. ఇది ఖరీదైనదన్న ఆందోళనలను తోసిపుచ్చింది. ఎన్‌టిఎ ఆన్సర్ కీ ఛాలెంజ్ అనేది ఒక ఆన్‌లైన్ ప్రక్రియ. దీని ద్వారా జెఇఇ మెయిన్, నీట్, లేదా యుజిసి నెట్ వంటి పరీక్షలు రాసిన అభ్యర్థులు, తాత్కాలిక ఆన్సర్ కీలోని తప్పులపై అభ్యంతరం తెలియజేయవచ్చు. నీట్‌యుజి పేపర్ లీక్ నుండి యుజిసినెట్ పరీక్షలలోని లోపాల వరకు పలు సమస్యలపై ఇటీవల ఎన్‌టిఎ విమర్శలను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. అయితే 'ఆన్సర్ కీ ఛాలెంజ్‌లు చాలా ఖరీదైనవి అనే ఆందోళనపై అభ్యర్థులకు ఒక చిన్న వివరణ. ఆన్సర్ కీ ఛాలెంజ్ విధానం కేవలం సవాలు చేసే విద్యార్థికి మాత్రమే కాకుండా, ప్రతి విద్యార్థికి న్యాయం జరిగేలా రూపొందించబడింది' అని ఎన్‌టిఎ గురువారం రాత్రి ఎక్స్ పోస్టులో తెలిపింది. 'ఒక్క సవాలుతో, అందరూ ప్రయోజనం పొందుతారు. ఒక్క అభ్యర్థి ఒక ప్రశ్నకు సవాలు విసిరినా, సబ్జెక్ట్ నిపుణులు ఆ సవాలును అంగీకరిస్తే, సవరించిన ఆన్సర్ కీ పరీక్ష రాసిన ప్రతి అభ్యర్థికి వర్తిస్తుంది' అని అది పేర్కొంది. నిరాధారమైన సవాళ్లను నిరుత్సాహపరిచేందుకు ఒక సమాధానాన్ని సవాలు చేయడానికి రుసుము వసూలు చేస్తారని, ఆ సవాలు సరైనదని తేలితే ఆ రుసుమును వాపసు ఇస్తారని ఎన్‌టిఎ తెలిపింది. 'ఎవరి సవాలు అయితే ఆమోదించబడుతుందో, ఆ అభ్యర్థికి ప్రతి





ప్రశ్నకు రూ. 200 వాపసు ఇవ్వబడుతుంది. ఈ రుసుము నిరాధారమైన సవాళ్లను నిరుత్సాహపరచడానికే ఉంది, నిజమైన సవాళ్ల నుండి లాభం పొందడానికి కాదు' అని ఆ ఏజెన్సీ పేర్కొంది. 'కాబట్టి ఒక నిజమైన తప్పును గుర్తించి, దానిని లేవనెత్తినట్లయితే, అది సరైనదని తేలితే, ఆ రుసుము వాపసు ఇవ్వడమే కాకుండా, ఏ అభ్యర్థి చేసే ఒక సరైన సవాలు లక్షలాది మంది ఇతరుల రికార్డును సరిదిద్దగలదు' అని అది స్పష్టం చేసింది.

## మేఘాలయలో హింస

- ప్రభుత్వ ఆస్తులపై పెట్రోల్ బాంబుదాడులు
- వాహనాలు, మోటార్ సైకిళ్లు దగ్ధం

**షిల్లాంగ్ :** మేఘాలయలో హింసాత్మక ఘటనలు చెలరేగాయి. షిల్లాంగ్‌లో రెండు రోజుల క్రితం విద్యార్థుల బైక్ ర్యాలీ సందర్భంగా చెలరేగిన హింస రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించింది. గత 24 గంటల్లో మేఘాలయ అంతటా ప్రభుత్వ ఆస్తులపై పెట్రోల్ బాంబు దాడులు జరిగాయి. దహన ఘటనలు చోటుచేసుకున్నాయని అధికారులు శుక్రవారం తెలిపారు. అదే సమయంలో, అసోంలో జరిగిన రహదారి దిగ్బంధం కారణంగా అంతర్రాష్ట్ర వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. షిల్లాంగ్‌లోని ఒక పోలీస్ ఔట్‌పోస్ట్‌పై పెట్రోల్ బాంబు విసరగా, రిభోయ్ జిల్లాలో మూడు ప్రభుత్వ వాహనాలు, ఒక మోటార్‌సైకిల్‌కు నిప్పుపెట్టారు. అలాగే, సౌత్ వెస్ట్ ఖాసీ హిల్స్ జిల్లాలోని ఒక ప్రభుత్వ కార్యాలయంపై మరో పెట్రోల్ బాంబు విసిరారు. ఈ ఘటనల్లో ఎవరికీ గాయాలు కాలేదు. అయితే, బుధవారం జరిగిన హింస తర్వాత రాష్ట్రంలో నెలకొన్న ఉద్రిక్తతలకు ఈ దాడులు మరింత ఆజ్యం పోశాయి. శాంతిభద్రతల నిర్వహణలో రాష్ట్ర పోలీసులకు సహాయపడేందుకు, ఆగస్టు 25 వరకు మేఘాలయాలో ఐదు కంపెనీల కేంద్ర బలగాలను మోహరించడానికి కేంద్రం గురువారం ఆమోదం తెలిపింది. షిల్లాంగ్‌లో పరిస్థితి చాలా వరకు ప్రశాంతంగానే ఉంది; అయితే గురువారం రాత్రి 9:30 గంటల సమయంలో నాంగ్‌మెన్‌సాంగ్ పోలీస్ ఔట్‌పోస్ట్‌పై పెట్రోల్ బాంబు విసిరిన ఘటన మినహా పెద్దగా అవాంఛనీయ సంఘటనలేవీ జరగలేదు. ఆ బాంబు ప్రాంగణం లోపల పడగా,



ఒక కుర్చీని తగులబడింది. ఆ సమయంలో భవనం పైఅంతస్తులో సిఆర్‌పిఎఫ్ సిబ్బంది ఉన్నారు. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, ఆ ప్రాంతంలోని సిసిటివి ఫుటేజీని పరిశీలిస్తామని పోలీసులు తెలిపారు. అదే విధంగా రిభోయ్ జిల్లాలోని సైడెన్ వద్ద ఉన్న నీటి వనరుల శాఖ కార్యాలయ ప్రాంగణంలో ఉదయం 2 గంటల సమయంలో దుండగులు రెండు ప్రభుత్వ వాహనాలు, ఒక మోటార్‌సైకిల్‌కు నిప్పుపెట్టారు. ఒక బొలెరో, ఒక మోటార్‌సైకిల్ పూర్తిగా కాలిపోగా, మరో బొలెరో పాక్షికంగా దెబ్బతింది. ఈ ఘటనలపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సౌత్ వెస్ట్ ఖాసీ హిల్స్ జిల్లాలో, మాఫ్కిర్వాట్ సమీపంలోని మావ్లాంగ్‌విర్ గ్రామంలో ఉన్న పశుసంవర్ధక, పశువైద్య అధికారి కార్యాలయంపై దుండగులు తెల్లవారుజామున 1 గంట సమయంలో పెట్రోల్ బాంబు విసిరారు. ఆ బాంబు భవనం పైకప్పుపై పడింది, కానీ ఎటువంటి నష్టం వాటిల్లలేదు. పొరుగువారు పేలుడు శబ్దం విన్నారని, కానీ సంఘటనా స్థలంలో ఎవరూ కనిపించలేదని నైరుతి ఖాసీ హిల్స్ ఎస్పీ బి. జిర్వా తెలిపారు. షిల్లాంగ్‌లో జరిగిన హింసాకాండకు సంబంధించి గురువారం పోలీసులు 15 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారని తూర్పు ఖాసీ హిల్స్ ఎస్పీ వివేక్ సియెం తెలిపారు.

## హత్య కేసులో దోషి 105 ఏళ్ల వృద్ధుడికి 'సుప్రీం' ఊరట

- హత్య కేసు మూసివేసి, మిగిలిన జైలుశిక్ష రద్దు

**న్యూఢిల్లీ:** హత్య కేసులో దోషిగా ఉన్నటువంటి ఓ 105 ఏళ్ల వయసున్న జీవితకాల ఖైదీకి సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయం ఇప్పుడు అతనికి స్వేచ్ఛా జీవితాన్ని ప్రసాదించింది. అతడిపై ఉన్న హత్యకేసును శుక్రవారం సుప్రీంకోర్టు మూసివేసింది. జీవితఖైదులో మిగిలి ఉన్న కాలాన్ని రద్దు చేయడంతో పూర్తి కావాల్సిన జైలుశిక్ష నుంచి సంపూర్ణ విముక్తి లభించింది.పశ్చిమ బెంగాల్‌లోని మాల్డా జిల్లాలో 1920లో జన్మించిన మోండల్, 1994లో 68ఏళ్ల వయసులో ఒక హత్యకేసులో దోషిగా నిర్ధారించబడి, 2024 నవంబరు 29వరకు జైలులో ఉన్నారు. ఆ రోజున సుప్రీంకోర్టు అతడికి బెయిల్ మంజూరు చేసింది. శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస వి.మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం పిటిషనర్ వయస్సును పరిగణనలోనికి తీసుకుని, కేసును ముగిస్తున్నామని, ఈ విషయంలో ఏమైనా మిగిలిన శిక్ష ఉంటే దానిని రద్దు చేస్తున్నామని తెలిపింది. యావజ్జీవ కారాగారశిక్ష పూర్తికాకపోయినా అతడిని తిరిగి కస్టడీలోకి తీసుకోబోమని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ పేర్కొంటూ, 2024 మధ్యంతర బెయిల్ ఉత్తర్వును సంపూర్ణమైనదిగా, తుది ఉత్తర్వుగా ప్రకటించారు. ప్రస్తుత రిట్ పిటిషన్ విచారణలో ఉన్నంతకాలం, విచారణ కోర్టు నిర్ణయించే నిబంధనలు, షరతులకు లోబడి పిటిషనర్ రసిక్ చంద్ర మోండల్‌ను మధ్యంతర బెయిల్ / పెరోల్‌పై విడుదల చేయాలని మేం మధ్యంతర ఉత్తర్వుగా ఆదేశిస్తున్నామని కోర్టు గతంలో పేర్కొంది. మోండల్‌కు వయసు సంబంధిత సమస్యలు ఉన్నాయని ధర్మాసనం వెల్లడించింది.2018లో జరిగిన ఒక హత్యకేసులో తనకు విధించిన శిక్షను సవాల్‌చేస్తూ మోండల్ దాఖలు చేసిన అప్పీల్‌ను కలకత్తా హైకోర్టు కొట్టివేసింది.ఆ తర్వాత అతను సుప్రీంకోర్టును ఆశ్రయించగా,అతని అభ్యర్థనను సుప్రీంకోర్టు రద్దు చేసింది. 2020లో అప్పటికే 99ఏళ్ల వయసున్న మోండల్ తన ముదిమి వయస్సు, వయస్సు సంబంధిత అనారోగ్య సమస్యలను కారణంగా చూపుతూ ముందస్తు విడుదల కోరుతూ ఆయన ఒక అభ్యర్థనను దాఖలుచేశారు. మే 2021లో, ఈ వ్యవహారానికి సంబంధించి అత్యున్నత న్యాయస్థానం పశ్చిమ బెంగాల్ ప్రభుతానికి ఒక నోటీసు జారీ చేసింది.

## కొండపైనుంచి దూకి కొడుకు, తల్లిదండ్రులు మృతి

**ఛత్రపతిశంభాజీనగర్:** మొబైల్ ఫోన్ కావాలనే చిన్న గొడవ మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్ జిల్లాలో తీవ్ర విషాదాన్ని నింపింది. తిస్‌గావ్ ప్రాంతంలోని ఓ కొండపై శుక్రవారం ఉదయం 19 ఏళ్ల కునాల్ చంద్‌గుడే మొబైల్ ఫోన్ ఇప్పించలేదనే కోపంతో ఆత్మహత్యకు ప్రయత్నించాడు. విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న తల్లిదండ్రులు మురళీధర్, సంగీతలు అతన్ని శాంతింపజేసేందుకు ప్రయత్నించారు. స్థానికుల సమాచారంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కూడా ఘటనా స్థలానికి చేరుకుని, కింద రక్షణ వల ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించినా, ఆ యువకుడు స్థానం మారుతూ భయాందోళనకు గురిచేశాడు. తండ్రి ఎంతగానో నచ్చజెప్పడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ కునాల్ ఒక్కసారిగా కొండపై నుంచి దూకేశాడు; కొడుకును కాపాడుకునే ఆత్రుతలో తండ్రి మురళీధర్ కూడా అతని వెంటే దూకి ప్రాణాలు కోల్పోయాడు. కళ్ల ముందే భర్త, కొడుకులు చనిపోవడాన్ని చూసి తట్టుకోలేకపోయిన తల్లి సంగీత కూడా అదే కొండపై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించగా, ఈ ఘటన ఆ ప్రాంతంలో తీవ్ర విషాదాన్ని నింపింది.


SRI GEERVANI COLLEGE OF EDUCATION
(Approved by NCTE and Affiliated to Satavahana University)
CHOPPADANDI (Vill&Mdl), Dist. KARIMNAGAR-505415. Mob: 9848236339, 9989146885

Admission Notification
Category (B) Seats for Management Quota

Applications are invited from qualified candidates for admission in to B.Ed course for the academic year 2026-28 batch under category B management seats. The candidates should submit the filled applications along with all original certificates in the college on or before 31-08-2026

Sd/- Principal



SHRIRAM Finance వాహనముల బహిరంగ వేలం ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS27T 4759 | Ashok Annepu | ESCORTS 439 PT | 2020 |
| 2 | TS27G 2336 | Ugendar Munigala | KUBOTA MU 4501 | 2023 |
| 3 | MACH 3029 | Anji Thotte | KUBOTA DC68G TRACK COMBINE HARVESTER | 2019 |
| 4 | TS08UF 8053 | Taja Shekhar Reddy Gumpula | MAHINDRA BOLLERO MAXI TRUCK PLUS | 2019 |
| 5 | AP15TC 3926 | Ellaiah Kasturi | MAHINDRA 275 DI | 2013 |
| 6 | TS27T 1967 | Kumar Shivarathri | SWARAJ 735FE | 2016 |
| 7 | TS07JD 4695 | Mohammed Jaffer Ali | SWIFT VDI DIESEL 5 SEATER | 2014 |
| 8 | TS25E 6973 | Narender Kankati | TIGOR XM BS6 PETROL 5 SEATER | 2021 |
| 9 | AP36TB 4808 | Hrish Ellandula | ESCORT 434PT | 2013 |
| 10 | TS03EP 1930 | Rajesh Jakkula | MAHINDRA 475DI | 2016 |
| 11 | TS10EB 0490 | Bala Swamy Bairapaka | CITY MT DIESEL 5 SEATER | 2014 |
| 12 | TG03T 2649 | Jahnavi Chanda | MAHINDRA JEETO STRONG BS6 DIESEL | 2025 |

AUCTION DATE : 22-08-2026
VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL
గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED
D.No : 24-7-29,1st Floor, Fathima Complex, Fathimanagar, Kazipet
Cell : 9959090723, 9676049567

# యెమెన్, సోమాలియా తీరాల్లో రెండు నౌకలు హైజాక్

## 22 మంది భారతీయ నావికులు సురక్షితం



**న్యూఢిల్లీ:** యెమెన్, సోమాలియా తీరాల్లో రెండు వాణిజ్య నౌకలను సాయుధ సముద్ర దొంగలు వేర్వేరు ఘటనల్లో హైజాక్ చేశారు. ఈ రెండు నౌకల్లో కలిపి 22 మంది భారతీయ నావికులు ఉన్నారు. ప్రస్తుతం వారంతా సురక్షితంగానే ఉన్నారని కేంద్ర నౌకాయాన మంత్రిత్వ శాఖకు చెందిన ఓ ఉన్నతాధికారి శుక్రవారం తెలిపారు. పీటీఐ కథనం ప్రకారం, ఎరిట్రియా జెండాతో ప్రయాణిస్తున్న చమురు ఉత్పత్తుల ట్యాంకర్ ఎంటి సిబా 1ను ఈనెల 20న గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌లో యెమెన్ తీరానికి సుమారు 30 నాటికల్ మైళ్ల దూరంలో దొంగలు స్వాధీనం చేసుకున్నారు. నౌకలో మొత్తం 20 మంది సిబ్బంది ఉండగా, వారిలో 16 మంది భారతీయులు. మిగిలిన వారిలో సిరియా, సూడాన్, ఇరాక్ దేశాలకు చెందిన ముగ్గురు ఉన్నారు. మరో నావికుడి జాతీయతను అధికారులు ఇంకా నిర్ధారించలేదు. రిక్రూట్‌మెంట్ అండ్ ప్లేస్‌మెంట్ సర్వీస్ లైసెన్స్ సంస్థ ఎస్కె ఎస్ కృషి మెరైన్ సర్వీసెస్ ఇచ్చిన సమాచారాన్ని ఉటంకిస్తూ, ఆరుగురు సాయుధ దొంగలు నౌకలోకి ప్రవేశించి దాని నియంత్రణను స్వాధీనం చేసుకున్నారని అధికారులు చెప్పారు. నౌకను గుర్తింపు లేని వైపు దొంగల దగ్గరకు వచ్చిన తర్వాత ఈ ఘటన జరిగినట్లు సముద్ర రవాణా ట్రాకింగ్ సమాచారం వెల్లడిస్తోంది. కాగా, మరో ఘటనలో కామెరూన్ జెండాతో ప్రయాణిస్తున్న ఎం/వి లుటఫిను ఈనెల 17న సోమాలియాలోని పంట్‌లాండ్ తీరంలో దొంగలు హైజాక్ చేశారు. ఈ నౌకలో 10 మంది సిబ్బంది ఉండగా, వారిలో ఆరుగురు భారతీయులు. ఎనిమిది మంది సాయుధ దొంగలు రెండు చిన్న పడవల్లో వచ్చి, ఎకె47 తరహా ఆయుధాలతో నౌకలోకి ప్రవేశించినట్లు తెలుస్తోంది. తీరాల రక్షిత ప్రదేశంలోకి వెళ్లిన, దొంగలు అక్కడికి చేరుకుని వారిని బందీలుగా తీసుకెళ్లారు. ఇప్పటివరకు ఎలాంటి గాయాలు నమోదు కాలేదని అధికారులు తెలిపారు. ఈ రెండు ఘటనలు గల్ఫ్ ఆఫ్ ఏడెన్, ఎర్ర సముద్రం, హిందూ మహాసముద్ర ప్రాంతాల్లో వాణిజ్య నౌకలకు పెరుగుతున్న భద్రతా ముప్పును మరోసారి స్పష్టం చేస్తున్నాయి. ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా మధ్య ఉద్రిక్తత కారణంగా హోర్ముజ్ జలసంధిలోనూ నౌకాయానం ఇప్పటికే ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ప్రపంచంలో సముద్ర నావికులను అత్యధికంగా అందిస్తున్న దేశాల్లో భారత్ రెండో స్థానం. 2026 బిఐఎంసిఓ-ఐసిఎస్ నివేదిక ప్రకారం ప్రపంచ వాణిజ్య నౌకల్లో సుమారు 3,11,936 మంది భారతీయ నావికులు పనిచేస్తున్నారు. దీంతో అంతర్జాతీయ సముద్ర మార్గాల్లో భద్రతా పరిణామాలు భారతను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

## అలాస్కాలో చార్టర్ విమాన ప్రమాదం

# ఎనిమిది మంది మృతి



**జునెయూ (అమెరికా):** అమెరికాలోని అలాస్కాలో చార్టర్ విమానం ప్రమాదానికి గురైన సంఘటనలో ఎనిమిది మంది మృతి చెందారు. పశ్చిమ అలాస్కాలోని మారుమూల కేప్ న్యూనెహామ్ లాంగ్ రేంజ్ రాడార్ సైట్ విమానాశ్రయ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఆంకరేజ్‌కు పశ్చిమంగా సుమారు 725 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రాంతం ఉంది. విమానంలో ఇద్దరు పైలట్లు, ఆరుగురు ప్రయాణికులు ఉన్నారని అమెరికా నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డు అలాస్కా ప్రాంత అధికారి క్లింట్ జాన్సన్ తెలిపారు. ఆంకరేజ్ నుంచి బయలుదేరిన విమానం కేప్ న్యూనెహామ్‌లో దిగేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో మధ్యాహ్నం ప్రమాదానికి గురైనట్లు అధికారులు చెప్పారు. ఈ రాడార్ కేంద్రం అలాస్కా గగనతలంలో, సరిహద్దుల వెంట ప్రయాణించే విమానాలను పర్యవేక్షించే మారుమూల రాడార్ వ్యవస్థలో ఒక భాగం. కాగా, విమానంలో ఉన్నవారు కీలకమైన విధుల నిర్వహిస్తున్న వైమానిక నిపుణులని అలాస్కన్ కమాండ్ పేర్కొంది. మృతుల కుటుంబాలకు పూర్తి సహకారం అందిస్తామని అమెరికా వైమానిక దళం తెలిపింది. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

## రక్షణ, ఇంధన భద్రతపై

# ఇండోనేషియా – చైనా అంగీకారం



**జకార్తా:** రక్షణ సహకారాన్ని మరింత విస్తరించడం, ఆహారం–ఇంధన భద్రతను బలోపేతం చేయడంపై ఇండోనేషియా, చైనా విస్తృత చర్చలు జరిగాయి. ఇరు దేశాల ఉన్నతస్థాయి మంత్రులు శుక్రవారం జకార్తాలో సమావేశమై ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించి, పరస్పర సహకారానికి అంగీకరించారు. ఈ చర్చల ద్వారా రాజకీయ, ఆర్థిక, భద్రత, సముద్ర రంగాలతో పాటు ప్రజల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు ఇండోనేషియా విదేశాంగ మంత్రి సుగియోనో తెలిపారు. అభివృద్ధి, భద్రతకు సంబంధించిన అంశాల్లో సమన్వయాన్ని పెంచుకోవాలని ఇరు దేశాలు అంగీకరించాయని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ చెప్పారు. ఆహారం, ఇంధనం, ఖనిజాల భద్రత కోసం దేశీయ ఉత్పత్తి సామర్థ్యాలను పెంచే పరిశ్రమలను అభివృద్ధి చేయడంపై ఇరు దేశాలు దృష్టి సారించాయి. కృత్రిమ మేధస్సు, కమ్యూనికేషన్ ఉపగ్రహాల సంయుక్త అభివృద్ధి వంటి అధునాతన సాంకేతిక రంగాల్లోనూ సహకారం పెంచుకోవాలని నిర్ణయించాయి. ఇండోనేషియా ప్రధాన ఎగుమతి వస్తువులకు కొత్త మార్కెట్లు, మెరుగైన మార్కెట్ ప్రాప్యత కల్పించేందుకు వాణిజ్యాన్ని సులభతరం చేయాలని కూడా అంగీకరించాయి. కాగా, రక్షణ రంగంలో ఇండోనేషియా రక్షణ మంత్రి స్జాఫ్రీ స్జామ్‌సొద్దీన్, చైనా రక్షణ మంత్రి డోంగ్ జున్ విడిగా సమావేశమయ్యారు. రక్షణ పరికరాల సహకారం, సిబ్బంది శిక్షణ, రక్షణ పరిశ్రమల మధ్య భాగస్వామ్యంపై చర్చించారు. సంయుక్త సైనిక విన్యాసాలను పెంచాలని ఇండోనేషియా ప్రతిపాదించింది. చైనాతో ఇండోనేషియా ఆర్థిక సంబంధాలు ఇటీవలి సంవత్సరాల్లో గణనీయంగా పెరిగాయి. 2025లో ఇరు దేశాల వాణిజ్యం సుమారు 167 బిలియన్ డాలర్లకు చేరింది. జకార్తా–బాండుంగ్ హైస్పీడ్ రైల్వే, పశ్చిమ జావాలోని సిరాటా తేలియాడే సౌర విద్యుత్ ప్రాజెక్టు వంటి భారీ మౌలిక వసతుల ప్రాజెక్టుల్లో చైనా పెట్టుబడులు పెట్టింది.

## వ్యతిరేకతను పెంచే చర్యలు

### అమెరికా వైఖరిపై ఇరాన్ విదేశాంగ మంత్రి విమర్శ

**దుబాయ్:** అమెరికా ప్రకటించిన కఠిన ఆర్థిక చర్యలను ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ వ్యతిరేకించారు. ఇటువంటి విఫల విధానాలు ఇరాన్ ప్రజల్లో అమెరికా పట్ల మరింత వ్యతిరేకతను పెంచుతాయని, చివరికి అమెరికాకు మరిన్ని వైఫల్యాలే మిగులుతాయని ఆయన వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ఇరాన్‌పై తీవ్రమైన ఆర్థిక చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన కొన్ని గంటల తర్వాత అరాఘ్చీ స్పందించడం గమనార్హం. ఇరాన్‌ను అపూర్వ స్థాయిలో ఆర్థికంగా ఒంటరి చేసే చర్యలు చేపడతామని ట్రంప్ ప్రకటించినప్పటికీ, వాటి వివరాలను మాత్రం వెల్లడించలేదు. కాగా, అమెరికా ప్రజల దృష్టిని దేశీయ ఆర్థిక సమస్యల నుంచి మళ్లించేందుకే ట్రంప్ ప్రభుత్వం ఇటువంటి బెదిరింపులకు దిగుతోందని అరాఘ్చీ ఆరోపించారు. అమెరికా ఆర్థిక ఉగ్రవాదం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను, వివిధ దేశాల ఆర్థిక సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇలావుంటే, అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ కూడా ఇరాన్‌పై ప్రపంచ చరిత్రలోనే అత్యంత సమన్వయంతో కూడిన ఆర్థిక ఒంటరితనం విధిస్తామని హెచ్చరించారు. ఇరాన్‌తో వ్యాపారం చేసే దేశాలు, సంస్థలపై కూడా ద్వితీయ ఆంక్షలు విధిస్తామని ఆయన తెలిపారు. తమ మిత్రదేశాలు ఇరాన్ విషయంలో ఏ వైపు నిలుస్తాయో నిర్ణయించుకోవాల్సిన సమయం వచ్చిందని బెసెంట్ అన్నారు.

## ట్రంప్‌తో ఒప్పందంపై

# కెనడాలో విభేదాలు

**టొరంటో:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో వాణిజ్య ఒప్పందం కోసం కెనడా మరిన్ని రాయితీలు ఇవ్వడంపై ఆ దేశంలో విభేదాలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా అధ్యక్షుడిని చెడ్డ వ్యక్తిగానూ, నమ్మదగని నాయకుడుగానూ మానిటోబా ప్రీమియర్ వాబ్ కిన్యూ అభివర్ణించారు. తొందరపడి రాయితీలు ఇవ్వకుండా కెనడా తన ప్రయోజనాల కోసం పోరాడాలని ఆయన కోరారు. కెనడా–అమెరికా వాణిజ్య ఒప్పందం దాదాపు ఖరారయ్యే దశకు చేరిందని కెనడా వాణిజ్య మంత్రి డొమినిక్ లెబ్లాంక్ తెలిపారు. అయితే పూర్తి వివరాలను ఇరు దేశాలు ఇంకా వెల్లడించలేదు. కెనడా దిగుమతులపై అమెరికా ప్రతిపాదించిన 50 శాతం సుంకాల ముప్పు నేపథ్యంలో చర్చలు సాగుతున్నాయి. ట్రంప్ ప్రభుత్వం ఒత్తిడి చేస్తున్న అంశాల్లో అమెరికా మద్యం విక్రయాలపై కెనడా విధించిన ఆంక్షల తొలగింపు ఒకటి. గతంలో అమెరికా సుంకాలకు ప్రతిస్పందనగా కెనడాలోని ఎనిమిది ప్రావిన్సులు అమెరికా మద్యం విక్రయాలను పరిమితం చేయడం లేదా నిలిపివేయడం వంటి చర్యలు తీసుకున్నాయి. ప్రధాని మార్క్ కార్నీ సూచన మేరకు వాటిని తిరిగి దుకాణాల్లో విక్రయించేందుకు ప్రావిన్సుల ప్రధానులు అంగీకరించినట్లు న్యూఫౌండ్‌ల్యాండ్ అండ్ లాబ్రడార్ ప్రీమియర్ టోనీ వేక్‌హామ్ తెలిపారు. అయితే కిన్యూ మాత్రం అమెరికా ఉత్పత్తుల కొనుగోళ్లను తగ్గించి కెనడియన్ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రజలను కోరారు. అమెరికా అధ్యక్షుడు గతంలో భారీ సుంకాలు ప్రకటించి వెనక్కి తగ్గిన సందర్భాలను ప్రస్తావిస్తూ, చర్చల్లో కెనడాదే పైచేయని అన్నారు. క్యూబెక్ ప్రీమియర్ క్రిస్టిన్ ఫ్రెషెట్ కూడా ఒప్పందంపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. రాష్ట్ర ఆర్థిక ప్రభావాన్ని పరిశీలించిన తర్వాతే అమెరికా మద్యం విక్రయాలపై నిర్ణయం తీసుకుంటామని ఆమె తెలిపారు.

## వైద్య పరీక్షల అనంతరం

# తిరిగి జైలుకు ఇమ్రాన్ ఖాన్



**ఇస్లామాబాద్:** పాకిస్థాన్ మాజీ ప్రధాని, పాకిస్థాన్ తెహ్రీక్‌ఇఇన్సాఫ్ (పిటిఐ) వ్యవస్థాపకుడు ఇమ్రాన్ ఖాన్ వైద్య పరీక్షల అనంతరం శుక్రవారం ఉదయం రావల్పిండిలోని అదియాలా జైలుకు తిరిగి చేరుకున్నారు. ఇస్లామాబాద్‌లోని ప్రభుత్వ ఆధ్వర్యంలోని పాకిస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (పిఐఎంఎస్)లో ఆయనకు పరీక్షలు నిర్వహించారు. షిఫా ఇంటర్నేషనల్ హాస్పిటల్‌కు చెందిన వైద్యులు కూడా ఈ పరీక్షల్లో పాల్గొన్నారు. 73 ఏళ్ల ఇమ్రాన్‌కు తీవ్రమైన ఆందోళన సమస్య ఉందని వైద్య నివేదిక పేర్కొనడంతో, ఈనెల 18న పాకిస్థాన్ సుప్రీం కోర్టు ఆయనను రెండు రోజుల్లో ఆస్పత్రికి తరలించాలని ఆదేశించింది. తొలుత ఆయనను ప్రైవేటు షిఫా ఆస్పత్రికి తరలించినట్లు పిటిఐ వర్గాలు తెలిపాయి. అయితే ఆస్పత్రి వెలుపల పిటిఐ కార్యకర్తలు భారీ సంఖ్యలో గుమికూడడంతో, భద్రతా పరిస్థితుల దృష్ట్యా ఆయనను పిఐఎంఎస్‌కు తీసుకెళ్లామని సమాచార మంత్రి అత్తావుల్లా తరార్ చెప్పారు. కంటి వైద్య నిపుణుడు, కార్డియాలజిస్ట్, ఇతర వైద్యులతో కూడిన బృందం ఇమ్రాన్‌ను పరీక్షించి ఆరోగ్యంగా ఉన్నట్లు ప్రకటించిందని ప్రభుత్వం తెలిపింది. అనంతరం ఉదయం సుమారు 5 గంటలకు ఆయనను అదియాలా జైలుకు తరలించారు. సుప్రీంకోర్టు ఇమ్రాన్‌కు వైద్య బోర్డు ఏర్పాటు చేసి చికిత్స అందించాలని, ఆస్పత్రిలో ఉన్నంతకాలం వారానికి ఒకసారి కుటుంబ సభ్యులను కలిసే అవకాశం కల్పించాలని ఆదేశించింది. అయితే ప్రభుత్వం ఆ ఉత్తర్వులపై పునఃసమీక్ష పిటిషన్ దాఖలు చేయగా, అసంపూర్ణ పత్రాలను కారణంగా చూపుతూ కోర్టు రిజిస్ట్రార్ కార్యాలయం దానిని తిరిగి పంపింది. 2023 ఆగస్టు 5న అవినీతి కేసులో అరెస్టయిన ఇమ్రాన్ అప్పటి నుంచి జైలులోనే ఉన్నారు. ఆయన కుటుంబ సభ్యులు, మద్దతుదారులు వైద్య సదుపాయాలు, కుటుంబ సభ్యులతో భేటీల విషయంలో అధికారులు ఆంక్షలు విధిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

## ఎదుర్కొందాం

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, పంచాయతీ రాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, కలెక్టర్లు, డిఆర్‌డిఓలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీకి ప్రత్యేక వెబ్‌సైట్‌ను మంత్రులు, ప్రధాన కార్యదర్శి ప్రారంభించారు. గ్రామ జనాభా, వనరులు, అవసరాలు, అభివృద్ధి ప్రణాళికలు, శాఖల వారీగా జరుగుతున్న పనులు, నిధుల వినియోగం తదితర సమగ్ర సమాచారాన్ని ఈ వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉంచనున్నట్లు అధికారులు తెలిపారు. తెలంగాణ గ్రామ పంచాయతీలను దేశంలోనే ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ డిజిటల్ వ్యవస్థను రూపొందించినట్లు ప్రత్యేక కార్యదర్శి దాన కిషోర్ వెల్లడించారు.

**గ్రామ భవిష్యత్తుకు జిపిఎస్‌ఎపి మార్గదర్శి : సీతక్క**

గ్రామాభివృద్ధి ప్రణాళికలు కేవలం పత్రాలుగా కాకుండా గ్రామ భవిష్యత్తును నిర్దేశించే మార్గదర్శకాలుగా ఉండాలని మంత్రి సీతక్క అన్నారు. గ్రామ వనరులు, అవసరాలు, స్వల్ప, దీర్ఘకాలిక లక్ష్యాలను పరిగణనలోకి తీసుకుని ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. వ్యవసాయ కుటుంబ నేపథ్యం ఉన్న క్షేత్రస్థాయి అధికారులు రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, నీటి సంరక్షణపై అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషించాలన్నారు. మహిళా సంఘ భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

**భూగర్భ జలాల పెంపే ప్రధాన లక్ష్యం : తుమ్మల**

ఎల్‌నినోను ఆపడం మన చేతుల్లో లేకపోయినా దాని ప్రభావాన్ని తగ్గించడం మన చేతుల్లోనే ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. భారీ సాగునీటి ప్రాజెక్టులు ఉన్నప్పటికీ రాష్ట్రంలో సుమారు 30 లక్షల బోరు బావులపై వ్యవసాయం ఆధారపడుతోందని, అందుకే భూగర్భ జలాల పెంపునకు ఉపాధి హామీ పనులను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహిస్తూ ప్రతి ఏడాది రెండు లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు విస్తరణ లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు.

**ముందస్తు ప్రణాళికే విజయానికి మార్గం : వాకిటి**

1951 నుంచి భారత్ 12 సార్లు ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొందని మంత్రి వాకిటి శ్రీహరి గుర్తుచేశారు. రైతులకు కరువును ఎదుర్కొనే అనుభవం ఉన్నప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం శాస్త్రీయ అవగాహన కల్పించి, ఆచరణలోకి తీసుకురావాలన్నారు. పంటల మార్పిడి, పశుసంవర్ధక రంగం బలోపేతం, చెరువులు, చెక్‌డ్యామ్‌ల ద్వారా నీటి నిల్వ, మేకలు, గొర్రెల మేత కోసం ప్రత్యేక ప్రాంతాల ఏర్పాటు వంటి చర్యలను చేపట్టాలని సూచించారు.

**ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యం : సిఎస్**

రాష్ట్రంలో ఇప్పటికే విస్తృతంగా వరి సాగు ప్రారంభమైనప్పటికీ ఇంకా సుమారు 20 లక్షల ఎకరాల్లో నాట్లు వేయాల్సి ఉందని ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. సెప్టెంబర్‌లో వర్షాభావ పరిస్థితులు తీవ్రం కావచ్చని హెచ్చరిస్తూ, ఆయా ప్రాంతాలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. పెరిఅర్బన్ ప్రాంతాల్లో వ్యవసాయం, ఉద్యానవనం, పూల సాగు, అనుబంధ పరిశ్రమలకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.

**నీటి సంరక్షణ పనులకు విబి–జీ రామ్ జీ నిధులు : ఎంపి వేం నరేందర్ రెడ్డి**

కేవలం లక్ష్యాల సాధన కోసం కాకుండా ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూర్చే నీటి సంరక్షణ పనులకే విబిజీ రామ్‌జీ నిధులను వినియోగించాలని ఎంపి వేం నరేందర్ రెడ్డి అన్నారు.

## మెరుపుధర్నా

(మొదటి పేజీ తరువాయి)

భయపడుతున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ మొదట లోచబ్‌తో కలిసి మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరారు. అక్కడ ఆయన డిమాండ్ అంగీకరించబడకపోవడంతో, పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (న్యూఢిల్లీ జిల్లా) సచిన్ శర్మను కలిశారు. శర్మతో జరిపిన చర్చలు ఫలితాన్ని ఇవ్వకపోవడంతో, రాహుల్‌గాంధీ పోలీస్ స్టేషన్ (ఇక్కడే డిసిపి కార్యాలయం కూడా ఉంది) వద్ద ధర్నాకు దిగారు. లోచబ్, అతని తల్లి కూడా ఆయనతో పాటు ఉన్నారు. కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా, ఇతర పార్టీ సీనియర్ నాయకులు కూడా ఈ నిరసనలో పాల్గొన్నారు. ఒక పోలీసు అధికారి మాట్లాడుతూ, 'న్యూఢిల్లీ డిసిపి రాహుల్‌గాంధీతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఢిల్లీ పోలీసుల క్రైమ్ బ్రాంచ్ అన్ని ఫిర్యాదులను పరిశీలిస్తున్నందున, లోచబ్ ఫిర్యాదును కూడా తదుపరి విచారణ కోసం క్రైమ్ బ్రాంచ్‌కు పంపుతాము' అని తెలిపారు. నీట్ పేపర్ లీక్, పరీక్షలో అవకతవకల ఆరోపణలకు వ్యతిరేకంగా సిజెపి ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో లోచబ్ కళ్లు, పొట్ట భాగంలో పెల్లెట్ గాయాలకు గురయ్యారు. ఆ తర్వాత ఆయన ఎయిమ్స్ ట్రామా సెంటర్‌లో శస్త్రచికిత్స చేయించుకున్నారు. 'ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని మాత్రమే మేము కోరుతున్నాము. సాహిల్ ఇక్కడే ఉన్నాడు, అతని తల్లి కూడా అతనితో ఉన్నారు. పైస్థాయి నుంచి ఆదేశాలు ఉన్నందున ఎఫ్ఐఆర్ నమోదు చేయలేమని పోలీసు అధికారులు చెబుతున్నారు. ఎఫ్ఐఆర్ నమోదు అయ్యే వరకు ఇక్కడి నుంచి కదలము' అని రాహుల్ గాంధీ విలేకరులతో అన్నారు. ఎఫ్ఐఆర్ నమోదు, దర్యాప్తు అధికారి పేరు తెలియజేయడమే మా ఏకైక డిమాండ్, ఈ కుటుంబానికి న్యాయం జరగాలని మాత్రమే తాము కోరుకుంటున్నామన్నారు. ఒక యువకుడిపై కాల్పులు జరపవచ్చు కానీ, అమిత్ షా మంత్రిత్వ శాఖ పరిధిలోని ఢిల్లీ పోలీసులు బాధితుడికి న్యాయం చేయడం లేదు అని గాంధీ పేర్కొన్నారు. లోచబ్ గురించి ప్రస్తావిస్తూ, అతని కంటిలో మూడు పెల్లెట్లు (లోహపు గుళికలు) ఉన్నట్లు గుర్తించారు అని కాంగ్రెస్ నేత చెప్పారు. అయితే తాము పెల్లెట్ గన్‌లను ఉపయోగించలేదని ఢిల్లీ పోలీసులు చెప్పారు, కానీ ఎవరో ఒకరు కచ్చితంగా వాటిని ఉపయోగించి ఉంటారు, అతని శరీరంలో పెల్లెట్లు దొరకడాన్ని బట్టి చూస్తే నేరం జరిగిందని స్పష్టమవుతోంది. ఆగస్టు 13 నుండి లోచబ్ తల్లిని ఒక పోలీస్ స్టేషన్ నుండి మరొక స్టేషన్‌కు తిప్పుతున్నారు, కానీ ఇప్పటివరకు ఎటువంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు' అని మండిపడ్డారు. అంతకుముందు ఎక్స్ వేదికగా హిందీలో చేసిన పోస్ట్‌లో 'శాంతియుత నిరసనపై జరిగిన అరాచకం లేదా క్రూరత్వం ఒక తీవ్రమైన నేరం' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. 'జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న సాహిల్‌పై పోలీసులు జూలై 20న పెల్లెట్ గన్‌తో దాడి చేశారు. పెల్లెట్ల దాడిలో తీవ్రంగా గాయపడిన సాహిల్ ఒక కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఏర్పడింది'అని ఆయన అన్నారు. లోచబ్, అతనిలా బాధితులైన ప్రతి విద్యార్థికి న్యాయం జరిగేలా చూస్తానని ఆయన స్పష్టం చేశారు. 'ఎఫ్ఐఆర్ నమోదు అవుతుంది. న్యాయ విచారణ జరుగుతుంది. అలాగే ఈ అరాచకానికి బాధ్యులైన వారిపై పై స్థాయి నుండి కింది స్థాయి వరకు చర్యలు తీసుకుంటాం. సాహిల్, అతనిలా బాధితులైన ప్రతి విద్యార్థికి మేము న్యాయం చేకూరుస్తాం' అని ప్రతిపక్ష నేత స్పష్టం చేశారు.

## తీసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ నేతలు ప్రశ్నించారు. ''సుస్మిత వ్యాఖ్యలతో సంబంధం లేదని మంత్రి కొండా సురేఖ చెప్పటం సరికాదు. ఆమె వ్యాఖ్యలతో సంబంధం లేకపోతే సురేఖ ఖండించాలి. కొండా సురేఖ గతంలోనూ నోరు జారి పార్టీకి ఇబ్బంది తెచ్చిపెట్టారు. కొండా కుటుంబం భాష ఎప్పుడూ పార్టీకి తలనొప్పిగానే ఉంది. మీ వ్యాఖ్యలకు సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. ఇలా మాట్లాడే వారిపై ఏఐసీసీ చర్యలు తీసుకోవాలి. కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చేందుకు సిఎం రేవంత్ రెడ్డి, వారి సోదరులు కష్టపడ్డారు. సిఎం, పార్టీ గురించి వారు బహిరంగంగా మాట్లాడటం సరికాదు. ఏదైనా ఉంటే సిఎల్పీ, టిపిసిసి సమావేశంలో మాట్లాడాలి. సిఎంపై ఎవరు తప్పుడు ఆరోపణలు చేసినా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. సిఎంకు సొంత పార్టీ నేతలు అండగా ఉండాలి కానీ, పార్టీలో ఉంటూ సిఎం నిర్ణయాన్ని తప్పుపట్టడం సరికాదు. చెట్టు మీద ఉండి. ఆ చెట్టు కొమ్మనే నరుక్కునే వైఖరి సరి కాదు. సుస్మిత వ్యాఖ్యలు ప్రతిపక్షాలకు బలం ఇచ్చినట్టు అవుతుంది'' అని పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ షోకాజ్ నోటీసుల అంశంలో తాను చెప్పాల్సింది క్రమశిక్షణ కమిటీకి చెప్పానని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఈ విషయంపై ఇప్పుడు మాట్లాడబోనని చెప్పారు. నేను చెప్పాల్సింది నిన్ననే క్రమశిక్షణ కమిటీకి చెప్పా. ఇప్పుడు కొత్తగా చెప్పాల్సిన విషయాలేమీ లేవు. సిఎం రేవంత్ విదేశీ పర్యటన నుంచి వచ్చాక మాట్లాడతాను''అని కొండా సురేఖ స్పష్టం చేశారు. మరోవైపు కొండా సురేఖ కుమార్తె చేసిన వ్యాఖ్యలపై సిఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కాంగ్రెస్ అధిష్టానం కూడా సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం. బుధవారం ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న సిఎం గురువారం లండన్ పర్యటనకు బయలుదేరి వెళ్లారు. ఢిల్లీలో ఉన్నప్పుడే సిఎం కొందరు ముఖ్యనాయకులతో మాట్లాడుతూ మంత్రిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఉప ముఖ్యమంత్రితోనూ, మరి కొందరు మంత్రులతోనూ మాట్లాడినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. మంత్రి సురేఖపై చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలిసింది. మూడురోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించారు. సమ్మక్కసారలమ్మను దర్శించుకోవడంతో పాటు ములుగు, పరకాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న విషయం తెలిసిందే. అయితే ఈ కార్యక్రమాల్లో వరంగల్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తోన్న కొండా సురేఖ పాల్గొనలేదు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిని మంత్రి కొండా సురేఖ తీవ్ర స్థాయిలో వ్యతిరేకిస్తున్నారు. మరో వైపు పరకాల బహిరంగ సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాస్ రెడ్డిని భారీ ఆధిక్యతతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎన్నికల్లో రేవూరే అభ్యర్థి అనే సంకేతం ఇచ్చినట్లయ్యింది. ఇది జరిగిన మరుసటి రోజే కొండా సురేఖ కుమార్తె పరకాల నియోజకవర్గంలోని గీసుకొండలో సభ ఏర్పాటు చేసి ముఖ్యమంత్రిపై, స్థానిక ఎమ్మెల్యేపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేయడంతో పాటు వచ్చే ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీచేస్తానని ప్రకటించారు. క్రమశిక్షణా రాహిత్యంగా భావించి నోటీసులివ్వడంతో పరిమితం కాకుండా చర్యలకు కూడా ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## నిరాకరణ

(మొదటి పేజీ తరువాయి)

పర్యటనకు అనుమతి ఇవ్వడంలేదని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం తెలియజేసింది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనపై కేంద్ర విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి యునైటెడ్ కింగ్డమ్ (బ్రిటన్) పర్యటనకు అనుమతి ఇచ్చాం అని తెలిపారు. అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించడంపై ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖుల విదేశీ పర్యటనలకు రాజకీయ అనుమతి ఇచ్చే ముందు కేంద్ర విదేశాంగ శాఖ ఆయా పర్యటనలను పరిశీలిస్తుంది. ప్రతిపాదిత కార్యక్రమాలు వారు నిర్వహిస్తున్న పదవికి, పర్యటన ఉద్దేశానికి తగిన విధంగా ఉండాలి. ఈ విషయంలో అమెరికా పర్యటనకు సంబంధించిన కార్యక్రమం ఆ ప్రమాణాలకు అనుగుణంగా లేదని భావించాం. అందుకే అమెరికా పర్యటనకు రాజకీయ అనుమతి నిరాకరించాం అని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా తెలంగాణ అభివృద్ధి, విద్యా రంగ పురోగతికి, అలాగే వికసిత్ భారత్ నిర్మాణానికి తోడ్పడే ఈ పర్యటనకు రాజకీయ కారణాలతో అనుమతి నిరాకరించడం పట్ల ముఖ్యమంత్రి తీవ్ర విస్మయం వ్యక్తం చేశారు. అయినప్పటికీ కేంద్ర నిర్ణయాన్ని గౌరవిస్తూ లండన్ నుంచి హైదరాబాద్‌కు తిరిగి రావాలని, బోస్టన్, అమెరికా పర్యటనకు వెళ్లకూడదని నిర్ణయించుకున్నారు. 'షెడ్యూల్ ప్రకారం ఇంగ్లాండ్‌లో సిఎం రేవంత్ రెడ్డి ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, లండన్ బిజినెస్ స్కూల్, యూనివర్సిటీ ఆఫ్ లండన్ తదితర సంస్థలను సందర్శించి, వాటి ప్రతినిధులతో సమావేశాలు కొనసాగించనున్నారు. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని ప్రముఖ క్రీడా సంస్థలు, నైపుణ్యాభివృద్ధి రంగ నాయకులతో సమావేశమై, తెలంగాణతో భాగస్వామ్యాలను అధికారికంగా ఖరారు చేసేందుకు ఈ పర్యటనలో సిఎం ప్రయత్నిస్తారు' అని ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది. కేంద్ర నిర్ణయంపై సిఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ ''తన విదేశీ పర్యటన ఉద్దేశం ఒక్కటే. కేంద్రం తీసుకొచ్చిన నూతన విద్యా విధానంలో భాగంగా ప్రపంచంలోని ప్రఖ్యాత విద్యా సంస్థలను భారత్‌కు, తెలంగాణకు, హైదరాబాద్‌కు తీసుకురావడం. అత్యుత్తమ ఐవీ లీగ్ విశ్వవిద్యాలయాలను, ప్రపంచంలోని అగ్రశ్రేణి విద్యాసంస్థల నుంచి విద్య, నైపుణ్యాలు, శిక్షణ పొందాలనే దేశ, రాష్ట్ర యువత ఆకాంక్షలకు ఇవి సమాధానంగా నిలిచేవి'' అని పేర్కొన్నారు. దేశ నిర్మాణం, యువత భవిష్యత్తు విషయానికి వస్తే అందరూ రాజకీయాలు, ఎన్నికలకు అతీతంగా ఆలోచించాలని తాను ఎప్పుడూ విశ్వసిస్తానని సిఎం వ్యాఖ్యానించారు. వివిధ విశ్వవిద్యాలయాలతో ఇప్పటికే సంప్రదింపులు జరిపిన నేపథ్యంలో అమెరికా పర్యటనకు సంబంధించిన కార్యక్రమాలను అధికారుల బృందం కొనసాగించాలని, వివిధ విశ్వవిద్యాలయాలతో అవసరమైన అన్ని అవగాహన ఒప్పందాలు (ఎంఓయులు), భాగస్వామ్య ఒప్పందాలను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌ను ప్రపంచంలోని అగ్రశ్రేణి నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దాలన్నది నా సంకల్పం, ప్రయత్నం. ఒక సాధారణ భారతీయుడు హైదరాబాద్‌లోనే హార్వర్డ్, ఆక్స్‌ఫర్ట్ లేదా ఎంఐటి, ఎల్‌బిఎస్, ఎల్ఎస్ఈ వంటి ప్రపంచ స్థాయి సంస్థల నుంచి విద్య, సర్టిఫికేషన్ పొందగలగాలని సిఎం అన్నారు. చాలామంది నాయకులు తమ పిల్లలను విదేశాలకు పంపాలని కోరుకుంటున్నారని, కానీ తాను ప్రపంచంలోని అత్యుత్తమ విద్యా సంస్థలను భారత్‌కు తీసుకురావాలని అభిలషిస్తున్నానని సిఎం ఈ సందర్భంగా తెలిపారు. ''హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతాం. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి హెచ్‌సియు, జెఎన్‌టియు తదితర విశ్వవిద్యాలయాల ఏర్పాటు హైదరాబాద్‌ను అత్యుత్తమ మానవ వనరుల కేంద్రంగా మార్చింది. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఒక పాఠశాల ప్రపంచానికి నాయకత్వం వహించగలమని నిరూపించింది. అక్కడి నుంచి ప్రపంచంలోని గొప్ప టెక్ నాయకుల్లో కొందరు రూపుదిద్దుకున్నారు. ఐఐటి, ఐఎస్‌బి, ఐఐఐటి, నల్సార్ వంటి సంస్థల ఏర్పాటుతో హైదరాబాద్ అగ్రశ్రేణి కార్పొరేషన్లు, వాటి గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లను ఆకర్షించగలిగింది. ఇప్పుడు ప్రపంచంలోని ప్రఖ్యాత విద్య, నైపుణ్య సంస్థలకు హైదరాబాద్‌ను కేంద్రంగా మార్చి, 21వ శతాబ్దపు మన ప్రగతి ప్రయాణానికి శక్తినిస్తాం'' అని ఈ సందర్భంగా సిఎం పేర్కొన్నారు.

## కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

టి. వెంకోజీరావు పేపర్ పరిశ్రమలో నిపుణుడు. ఈయన ఇంగ్లాండులో మూడేళ్ళపాటు పేపర్ మ్యానుఫాక్చరింగ్ అండ్ కెమికల్ ఇంజనీరింగ్ చదివి వచ్చాడు. ఆమె తల్లి శచీదేవి, అస్సాం రాష్ట్రం గౌహతిలో మెట్రిక్యులేషన్ వరకు చదివింది. జానకి చిన్ననాడే రంగస్థల నాటకాలలో పలు పాత్రలు పోషిస్తూ నటిగా కెరీర్ ప్రారంభించింది. తన 11వ ఏటనే రేడియోలో ఒక తెలుగు కార్యక్రమంలో పాల్గొంది. ఆమె మొట్టమొదటి చిత్రం షావుకారు (1950). ఇది ఆమె ఇంటి పేరైపోయింది. ఆమె తెలుగు, తమిళ, కన్నడ భాషలలో 385 చిత్రాలలోను, 3 హిందీ సినిమాలలోను, ఒక మలయాళం సినిమాలోనూ నటించింది. తెలుగు కథానాయకి కృష్ణకుమారి ఆమెకు స్వయానా చెల్లెలు. జాతీయ ఫిల్మ్ అవార్డులకు, తెలుగు సినిమా అవార్డులకు కమిటీకి చైర్మన్‌గా పని చేసింది. విజయా ప్రొడక్షన్స్ వారి షావుకారు (1950) ఆమె మొదటి సినిమా. 1949లో రక్షరేఖ అనే సినిమాలో చంద్రికగా నటించింది. తరువాత ఆమె షావుకారు జానకిగా ప్రసిద్ధురాలయ్యింది. ఆనాటి ప్రముఖ నటులందరి సరసన నటించింది. అనేక పురస్కారాలు పొందింది. తెలుగులో ఆమె సినిమాలలో ప్రసిద్ధమైనవి షావుకారు, డాక్టర్ చక్రవర్తి (1964), మంచి మనసులు (1962), రోజులు మారాయి (1955) ఉన్నాయి. 2023లో ఆమె నటించిన చివరి తెలుగు సినిమా 'అన్నీ మంచి శకునాలే'. 2022లో అప్పటి రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు.

**జానకి ఇంట అవార్డుల పంట**

దక్షిణాది భారత సినిమాకి చేసిన కృషికి ఫిలింఫేర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు సౌత్ పురస్కారం 1984లోనే అందుకున్నారు. 1985లో మహానటి సావిత్రి అవార్డు, 1985లో ఆమె ఎంచుకున్న రంగంలో శ్రేష్ఠత కోసం అరిజోనాలోని వరల్డ్ యూనివర్శిటీ నుండి గౌరవ డాక్టరేట్ పట్టా పొందారు. 1989లో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ దియోనారా గోల్డెన్ అవార్డు, 2004లో నడిగర్ తిలగం శివాజీ జీవితకాల సాఫల్య పురస్కారం, 2000లో డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు జీవిత సాఫల్య పురస్కారం. కర్ణాటక రాష్ట్రం నుంచి శ్రీ కృష్ణ దేవరాయ అవార్డు, 1969–1970 లో తమిళనాడు ప్రభుత్వం ద్వారా కలైమామణి, 1990లో తమిళనాడు రాష్ట్ర చలనచిత్ర గౌరవ పురస్కారం ఎంజీఆర్ అవార్డు, 1970లో ఇరు కోడుగల్ చిత్రానికి ఉత్తమ నటిగా తమిళనాడు రాష్ట్ర చలనచిత్ర అవార్డు, 1987లో సంసారం ఒక చదరంగం చిత్రానికి ఉత్తమ సహాయ నటిగా నంది అవార్డు, 2007లో అమూల్యం చిత్రానికి ఉత్తమ సహాయ నటిగా నంది అవార్డు, సైమా జీవితకాల సాఫల్య పురస్కారం (2013). కర్ణాటక ప్రభుత్వం నుండి రాజ్యోత్సవ అవార్డు (2015), స్త్రీరాట్నా అవార్డ్స్ (2019), వండర్ ఉమెన్ అవార్డ్స్ భారతీయ సినిమా ఎవర్‌గ్రీన్ ఎంటర్‌టైనర్, తమిళనాడు ప్రభుత్వం నుండి పురచ్చి తలైవి డాక్టర్ జె. జయలలిత స్పెషల్ కలైమామణి అవార్డు (2020), భారత ప్రభుత్వం చే పద్మశ్రీ పురస్కారం (2022) ఇలా ఆమె అవార్డులను అందుకున్నారు.

# ఇప్పట్లో జట్టు మారే ఉద్దేశం లేదు

## అర్జున్ టెండూల్కర్




దిగ్గజ క్రికెటర్ సచిన్ తనయుడిగా మనందరికీ సుపరిచితుడైన అర్జున్ టెండూల్కర్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. ఐపిఎల్‌లో అవకాశాలు రాక.. ఇటు టీమిండియాకు ఆడాలన్న కల కలగానే ఉండిపోగా.. దేశవాళీలో మాత్రం ఒకే జట్టుకు ఆడాలని భావిస్తున్నాడు. నాలుగేళ్ల క్రితం గోవాకు మారిన అర్జున్.. ఇప్పట్లో తనకు జట్టు మారే ఉద్దేశం లేదంటున్నాడు. కెరీర్ పరంగా ఒడిదొడుకులు ఎదుర్కొంటున్న అర్జున్ టెండూల్కర్ దేశవాళీ క్రికెట్‌పై దృష్టి సారించనున్నాడు. కొన్నాళ్లుగా గోవాకు ఆడుతున్న అతడు ఈమధ్య ఆ జట్టు ఒమన్ పర్యటనకు దూరమయ్యాడు. దాంతో, టెండూల్కర్ జట్టు మారుతున్నాడనే వార్తలు వచ్చాయి. అయితే.. తాను మాత్రం గోవాకే కట్టుబడి ఉన్నానని చెబుతున్నాడీ పేసర్. 2022% 23 సీజన్‌కు ముందు ముంబైను వీడి గోవాకు మారిన అతడు.. మరికొన్ని సీజన్లు జట్టు మారే ఆలోచన చేయడం లేదు. ఇప్పటివరకూ అర్జున్& గోవా తరఫున 50 వికెట్లు తీశాడు. ఐపిఎల్ 19వ సీజన్‌కు ముందు లక్నో సూపర్ జెయింట్స్ అర్జున్ టెండూల్కర్‌ను ట్రేడ్ పద్ధతిన తీసుకుంది. ఒక పాడ్‌కాస్ట్ షోలో మాట్లాడిన అర్జున్ బెంచ్ మీద ఉండడం ఇష్టం లేకనే ముంబైని వదిలేశానని చెప్పాడు. అయితే.. లక్నో జెర్సీతో కూడా అతడి రాత మారలేదు. లీగ్ దశలో చివరి మ్యాచ్‌కు మాత్రమే అర్జున్‌కు అవకాశం దక్కింది. ఫస్ట్‌క్లాస్ ఎంట్రీకి ముందు అర్జున్ మహారాష్ట్ర, గోవా తరఫున 7 లిస్ట్ ఏ మ్యాచ్‌లు, 9 టీ20లు మాత్రమే ఆడాడు. రంజీ ట్రోఫీలో ఆడాలన్న తన కలను నిజం చేసుకున్నాడు. గోవా జట్టు తరఫున రంజీ ట్రోఫీలో బరిలోకి దిగాడు. పొర్‌వోరిమ్ స్టేడియంలో రాజస్థాన్‌తో ఎలైట్ గ్రూప్ సీ మ్యాచ్‌లో బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా తొలి మ్యాచ్ ఆడాడు.

# చరిత్ర సృష్టించిన గాయత్రి-ట్రీసా జోడీ

**15 ఏళ్ల తర్వాత భారత్‌కు పతకం!**

బిడబ్ల్యుఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత అమ్మాయిలు పతకం ఖరారు చేశారు. మహిళల డబుల్స్‌లో సంచలన ఆటతో దూసుకెళ్తున్న గాయత్రి గోపిచంద్, త్రీసా జాలీ ద్వయం 15 ఏళ్ల నిరీక్షణకు తెరదించింది. 16వ రౌండ్‌లో ఏడో సీడ్‌కు షాకిచ్చిన ఈ ద్వయం.. ఈసారి 32వ రౌండ్‌లో నాలుగో సీడ్‌పై సంచలన విజయం సాధించింది. క్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టడం ద్వారా దేశానికి చరిత్రాత్మక పతకం అందించనుంది జంట. బ్యాడ్మింటన్ వరల్డ్‌కప్‌లో భారత అమ్మాయిలు చరిత్రాత్మక పతకం అందించారు. పీవీ సింధు విఫలమైనా మేమున్నాం అని చాటుతూ.. మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపిచంద్, త్రిసా జాలీలు 15 ఏళ్ల కరువు తీర్చారు. 16వ రౌండ్‌లో ఏడో సీడ్‌ను ఇంటికి పంపిన ఈ జంట.. శుక్రవారం నాలుగో సీడ్ జియా యీ ఫాన్ – ఝాంగ్ షు గ్జియాన్(చైనా)ను చిత్తు చేసింది. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో తొలి సెట్‌ను 1621తో కోల్పోయినా ఒత్తిడికి లోనవ్వని భారత ద్వయం రెండో సెట్‌ను 2115తో గెలుచుకుంది. నిర్ణయాత్మక మూడో సెట్‌లోనూ చైనా జోడీకి చెక్ పెడుతూ 2113తో మ్యాచ్‌ను ముగించింది గాయత్రి, త్రిసా జంట. తద్వారా.. అశ్విని పొన్నప్ప, గుత్తా జ్వాల అనంతరం.. మహిళల డబుల్స్‌లో పతకం ఖాయం చేసిన రెండో జంటగా వీరు రికార్డు నెలకొల్పారు. 2011లో జ్వాల, అశ్వినిలు కాంస్యం సాధించారు.




# 23న బాల్ బాడ్మింటన్ అండర్–16 సెలక్షన్ ట్రయల్

**హైదరాబాద్:** సంగారెడ్డి జిల్లా, బిహెచ్ఇఎల్ ఎంఐజిలోని శ్రీవాణి విద్యా నికేతన్ స్కూల్‌లో ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు జరిగే హైదరాబాద్ జిల్లా బాల్‌బాడ్మింటన్ చాంపియన్‌షిప్స్‌లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక కోసం సెలక్షన్ ట్రయల్‌ను నిర్వహిస్తున్నట్టు హైదరాబాద్ జిల్లా బాల్‌బాడ్మింటన్ సంఘం కార్యదర్శి ఎం. శ్రీనివాస ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–16 బాలురు, బాలికల విభాగాల్లో జరిగే ఈ ట్రయల్స్‌లో ఎంపికైన వారికి జిల్లా చాంపియన్‌షిప్స్‌లో పోటీపడే అవకాశం ఉంటుందని తెలిపారు. వనస్థలిపురం ఎన్‌జిఓస్ కాలనీలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ గ్రౌండ్స్‌లో ఈనెల 23వ తేదీన ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే ట్రయల్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9490682199, 6304070944, 9440344853 నంబర్లను సంప్రదించవచ్చని శ్రీనివాస ప్రసాద్ తమ ప్రకటనలో తెలిపారు.

# క్వార్టర్ ఫైనల్లో సాత్విక్ జోడీ ఓటమి..

బిడబ్ల్యుఎఫ్ ఛాంపియన్‌షిప్స్ డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్ – చిరాగ్ శెట్టి పోరాటం ముగిసింది. కచ్చితంగా పతకం గెలుస్తారనుకున్న ఈ ద్వయం క్వార్టర్ ఫైనల్లోనే నిష్క్రమించింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో వరల్డ్ నంబర్ 3 లియాంగ్ వీ కెంగ్ – వాంగ్ చాంగ్ ధాటికి భారత జోడీ చేతులెత్తేసింది. దాంతో, మూడోసారి ఈ టోర్నమెంట్‌లో పతకంతో మురవాలనుకున్న సాత్విక్ – చిరాగ్ ఆశలు ఆవిరయ్యాయి. నెదర్లాండ్స్ వేదికగా జరుగుతున్న బిడబ్ల్యుఎఫ్ ఛాంపియన్‌షిప్స్‌లో శుక్రవారం భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపిచంద్ – త్రిసా జాలీ ద్వయం క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లగా.. పురుషుల జంట మాత్రం నిరాశపరిచింది. ఈ ఛాంపియన్‌షిప్స్‌లో ఇది వరకు రెండుసార్లు మెడల్ కొల్లగొట్టిన సాత్విక్ సాయిరాజ్ – చిరాగ్ శెట్టి జోడీ క్వార్టర్స్ దాటలేదు. మూడో సీడ్ లియాంగ్ వీ కెంగ్ – వాంగ్ చాంగ్‌తో పోరులో తేలిపోయిన భారత జంట 1821, 921తో చిత్తుగా ఓడింది. తొలి సెట్‌లో కాస్త పోరాడినా.. రెండో సెట్‌లో ప్రత్యర్థికి బదులివ్వలేక మ్యాచ్‌ను అప్పగించేసింది సాత్విక్ చిరాగ్ ద్వయం.

## సైన్స్

# అనాదిగా ఆకాశాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం

### ప్రాచీన నాగరికతల నుంచి శాస్త్రీయ విప్లవం వరకు

ఖగోళశాస్త్ర చరిత్ర మానవ నాగరికత చరిత్రతో ముడిపడి ఉంది. భారతదేశం, బాబిలోనియా, ఈజిప్టు, గ్రీసు, చైనా, పర్షియా వంటి ప్రాంతాల్లో ప్రాచీనులు సూర్యుడు, చంద్రుడు, గ్రహాలు, నక్షత్రాల కదలికలను క్రమబద్ధంగా నమోదు చేశారు. రుతువుల మార్పు, వర్షాకాలం, వ్యవసాయ కార్యకలాపాలు, కాలగణన వంటి అంశాలకు ఈ పరిశీలనలు ఉపయోగపడ్డాయి.



భారతీయ సంప్రదాయంలో 'సూర్య సిద్ధాంతం' ఖగోళ గణనలకు సంబంధించిన అత్యంత ప్రాచీన గ్రంథాల్లో ఒకటి. ఆర్యభటుడు, వరాహమిహిరుడు వంటి శాస్త్రవేత్తలు భారతీయ ఖగోళ విజ్ఞానాన్ని ముందుకు తీసుకెళ్లారు. టెలిస్కోపు రాక ముందే ప్రాచీన ఖగోళ శాస్త్రవేత్తలు గ్రహణాల సమయాలను అంచనా వేయడం, భూమి–చంద్రుల పరిమాణాలతోపాటు, దూరాలను లెక్కించడం, భూమి కక్ష్యకు సంబంధించిన అంశాలను అర్థం చేసుకోవడం వంటి అనేక విషయాల్లో పురోగతి సాధించారు. అయితే భూమినే విశ్వానికి కేంద్రంగా భావించిన భూకేంద్ర నమూనా చాలా కాలం ప్రబలంగా ఉంది. ఐరోపాలో పునరుజ్జీవనోద్యమం, అనంతరం జరిగిన శాస్త్రీయ విప్లవం ఈ దృక్పథాన్ని మార్చాయి. నికోలస్ కోపర్నికస్ సూర్యకేంద్రక నమూనాను ప్రతిపాదించాడు. గెలీలియో గెలీలీ టెలిస్కోపును ఖగోళ పరిశీలనకు సమర్థంగా ఉపయోగించి చంద్రుని ఉపరితలం, గురుగ్రహ ఉపగ్రహాలు, శుక్రగ్రహ దశలు వంటి విషయాలను గమనించాడు. యోహానెస్ కెప్లర్ గ్రహాలు సూర్యుని చుట్టూ దీర్ఘవృత్తాకార కక్ష్యల్లో తిరుగుతాయని, వాటి గమనానికి సంబంధించిన నియమాలను వివరించాడు. ఐజాక్ న్యూటన్ గురుత్వాకర్షణ సిద్ధాంతం, గమన నియమాల ద్వారా ఈ పరిశీలనలకు భౌతిక పునాది అందించాడు. ఆయన ప్రతిబింబ దూరదర్శినిని కూడా అభివృద్ధి చేశాడు.

రాత్రి ఆకాశంలో కనిపించే నక్షత్రాలు, గ్రహాలు, తోకచుక్కలు, నెబ్యులాలు, గెలాక్సీలు మానవుడి ఆసక్తిని వేల సంవత్సరాలుగా రేకెత్తిస్తున్నాయి. ఆకాశంలో జరిగే మార్పులను గమనించి వాటి వెనుక ఉన్న కారణాలను తెలుసుకునే ప్రయత్నమే ఖగోళశాస్త్రానికి పునాది. నేడు హబుల్ వంటి అంతరిక్ష దూరదర్శినులు పంపే చిత్రాల్లో కనిపించే క్రాబ్ నెబ్యులా వంటి అద్భుత దృశ్యాలు ఈ శాస్త్రం ఎంత దూరం ప్రయాణించిందో చూపిస్తున్నాయి. క్రాబ్ నెబ్యులా ఒక సూపర్నోవా పేలుడు తర్వాత మిగిలిన అవశేషం. ఒకప్పుడు మన కంటికి కనిపించే ఆకాశ వస్తువుల కదలికలను మాత్రమే పరిశీలించిన ఖగోళ శాస్త్రం, ఇప్పుడు నక్షత్రాల జననం నుంచి గెలాక్సీల పరిణామం వరకు విశ్వంలోని



అత్యంత సంక్లిష్ట ప్రక్రియలను అధ్యయనం చేస్తోంది. 20వ శతాబ్దంలో ఖగోళశాస్త్రం పరిశీలనా ఖగోళశాస్త్రం, సైద్ధాంతిక ఖగోళభౌతిక శాస్త్రం అనే రెండు ప్రధాన దిశల్లో అభివృద్ధి చెందింది. పరిశీలనా ఖగోళశాస్త్రం టెలిస్కోపులు, డిటెక్టర్లు, కంప్యూటర్లు వంటి పరికరాల ద్వారా ఖగోళ వస్తువుల నుంచి సమాచారాన్ని సేకరిస్తుంది. సైద్ధాంతిక ఖగోళభౌతిక శాస్త్రం ఆ సమాచారాన్ని భౌతికశాస్త్రం, గణితశాస్త్రం ఆధారంగా విశ్లేషించి విశ్వంలో జరిగే ప్రక్రియలకు నమూనాలను రూపొందిస్తుంది. ఈ రంగంలో వృత్తిపరమైన శాస్త్రవేత్తలతో పాటు ఔత్సాహిక ఖగోళ పరిశీలకులు కూడా కొన్ని ముఖ్యమైన ఆవిష్కరణలకు దోహదపడ్డారు. విశ్వం విస్తృతి, అందులోని కోట్లాది నక్షత్రాలు, అనేక గెలాక్సీలు దృష్ట్యా ఇంకా ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు దొరకాల్సి ఉంది.

### టెలిస్కోపులో విశ్వ పరిణామం జాడ...

ఖగోళశాస్త్రం 19వ శతాబ్దంలో మరింత ఖచ్చితమైన శాస్త్రంగా మారింది. విలియం హెర్షెల్ యురేనస్‌ను కనుగొనడంతో పాటు అనేక నెబ్యులాలు, నక్షత్ర సమూహాలను నమోదు చేశాడు. ఫ్రెడరిక్ బెస్సెల్ 1838లో ఒక నక్షత్రానికి దూరాన్ని తొలిసారిగా నమ్మదగిన పద్ధతిలో కొలిచాడు. గణితశాస్త్రం, ఖగోళ యాంత్రికశాస్త్రం అభివృద్ధి చెందడంతో గ్రహాలు, ఉపగ్రహాల కదలికలను మరింత ఖచ్చితంగా అంచనా వేయగలిగారు. అదే సమయంలో స్పెక్ట్రోస్కోపీ, ఫోటోగ్రఫీ ఖగోళ పరిశోధన స్వరూపాన్నే మార్చాయి. సూర్యకాంతిలో కనిపించే స్పెక్ట్రల్ రేఖలను పరిశీలించడం ద్వారా సూర్యుడు, ఇతర నక్షత్రాల్లో ఏ మూలకాలు ఉన్నాయో తెలుసుకునే అవకాశం ఏర్పడింది. దీని వల్ల ఖగోళశాస్త్రం కేవలం ఆకాశంలో ఏముంది? అనే ప్రశ్నకే పరిమితం కాకుండా ఆ ఖగోళ వస్తువులు దేనితో



తయారయ్యాయి?, వాటి ఉష్ణోగ్రత ఎంత?, అవి ఎలా పరిణామం చెందుతున్నాయి? అనే ప్రశ్నలకు సమాధానాలు వెతకడం ప్రారంభించింది. 20వ శతాబ్దంలో ఈ మార్పు మరింత వేగమందుకుంది. పాలపుంత ఒక్కటే గెలాక్సీ కాదని, విశ్వంలో అనేక గెలాక్సీలు ఉన్నాయని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. గెలాక్సీలు పరస్పరం దూరమవుతున్నాయని పరిశీలనలు వెల్లడించడంతో విశ్వం విస్తరిస్తోందనే అవగాహన బలపడింది. క్వాజార్లు, పల్సార్లు, బ్లేజర్లు, రేడియో గెలాక్సీలు వంటి అత్యంత శక్తిమంతమైన ఖగోళ వస్తువులు కనుగొన్నారు. న్యూట్రాన్ నక్షత్రాలు, కృష్ణబిలాలు వంటి విపరీత పరిస్థితుల్లో ఉండే వస్తువులపై పరిశోధనలు సాగాయి. కాస్మిక్ మైక్రోవేవ్ బ్యాక్‌గ్రౌండ్ రేడియేషన్, హబుల్–లెమైట్రే సంబంధం, విశ్వంలోని తేలికపాటి మూలకాల సమృద్ధి వంటి ఆధారాలు బిగ్ బ్యాంగ్ నమూనాకు బలమైన మద్దతు ఇచ్చాయి.

# ఎన్నికల హామీలు విస్మరించిన బిజెపి ప్రభుత్వం

## సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పాలమాకుల జంగయ్య






**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం/హయత్‌నగర్/యాచారం :** బిజెపి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలు విస్మరించిందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు పాలమాకుల జంగయ్య విమర్శించారు. శుక్రవారం జిల్లా ప్రజాచైతన్య యాత్రంలో భాగంగా మంచాల మండలంలో పలు గ్రామాలు పర్యటించి మధ్యాహ్నం ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి సిపిఐ ప్రజా చైతన్య యాత్ర చేరటంతో సిపిఐ జిల్లా నాయకులు కావలి నర్సింహ్మ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు పాలమాకుల జంగ య్య, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆంధోజు రవీంద్ర చారీలు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభు త్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులైన ఆధాని, అంబానీలకు ధారదత్తం చేస్తూ, కార్మిక వర్గాల కు తీవ్ర అన్యాయం చేస్తుందని ఆరోపించారు. నీట్ పేప ర్ లీకైతే బాధితులపై చర్యలు చేపట్టడంలో ఘోరంగా విఫలం చెందిందన్నారు. పెండింగ్‌లో ఉన్న పాలమూ రుర–రంగారెడ్డి ఎత్తి పోత్తల ప్రాజెక్టు పథకాన్ని పూర్తి చేసి జాతీయ హోదా కల్పించి త్వరలో సాగు, తాగు నీ రందించాలని, విచ్చల విడిగా పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలు నియంత్రించాలన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక జిల్లాలో అస్తవ్యవస్థంగా తయారైన విద్య,వైద్యా రంగాలను అభివృద్ధి చేసి నిరుపేద ప్రజలకు మెరుగైన, విద్య, వైద్యం అందిచాలని ప్రభుత్వాన్నికి సూచించారు. జిల్లాల్లో సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య యాత్రకు సిపిఐ కా ర్యకర్తల భారీ సంఖ్యలో ఘన స్వాగతం పలికి బ్రహ్మ రథం పట్టడం అభినందనీయమన్నారు. ముందుగా మండల కేంద్రంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు పూల మాల వేసి నివాళ్ళులు అర్పించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు బుద్దుల జంగయ్య, ఎం.ప్రభులింగం, మహిళ సంఘం నాయకురాలు శ్రీదేవి, ఓరుగంటి యాదయ్య గౌడ్, దత్తు నాయక్, విద్యార్థి సంఘం నాయకులు క్రాంతి, విష్ణువర్ధన్ రెడ్డి, సుధాకర్, మండల కార్యదర్శి కావలి సురేష్, మహీళ సంఘం సభ్యురాలు పి.నీలమ్మ తదితరులు పాల్గోన్నారు.

**మతవిద్వేషాలు రెచ్చగొడుతున్న బిజెపి**

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతవిద్వేషాలు రెచ్చగొట్టి ప్రజలను ఇబ్బంది పెడుతుందని పాలమాకుల జంగయ్య విమర్శించారు శుక్రవారం సిపిఐ హయత్‌నగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో బస్సుతో పాటు డిజె నడుమ భారీ ర్యాలీ నిర్వహించారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ వీరన్న గుట్ట శాఖ వరకు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఉత్సాహంగా ర్యాలీలో కదం తొక్కారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. వీరన్న గుట్ట శాఖకు చేరుకున్న అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పార్టీ ఎర్రజెండాను ఆవిష్కరించారు. ఈ బస్సు జాతలో బికెంయు జిల్లా కార్యదర్శి బుద్దుల జంగయ్య, ఎఐకెఎస్ జిల్లా కార్యదర్శి ప్రభులింగం, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి దత్తు నాయక్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గ్యార క్రాంతి ఎఐఎస్ఎఫ్, జిల్లా కార్యదర్శి సామిడి వంశీ వర్ధన్ రెడ్డి, కార్యదర్శి శేషరాజుపల్లి శ్రీదేవి ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు సుధాకర్ తదితర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**సిపిఐ పార్టీలో పలువురు చేరిక...**

సిపిఐ అధ్వర్యంలో చేవేళ్ళ నుండి బయలు దేరిన బస్సు ప్రజా చైతన్యయాత్ర యాచారం మండలానికి చేరింది. యాచారం మండల సిపిఐ కార్యదర్శి మస్కు సంజీవ అధ్వర్యంలో నాయకులు బస్సు యాత్రకు ఘన స్వాగ తం పలికారు. మండల పరిధిలోని మంథనిగౌరేల్లి గ్రామానికి చేందిన కర్నాటి పెద్దయ్యతోబాటు పలువురు సిపిఐ పార్టీలో చేరారు వారికి జిల్లా కార్యదర్శి శాలువా కప్పి పార్టీలోకి అహ్వానించారు. ఈ కార్యక్రమంలో సిపి ఐ రాష్ట్ర సమితి సభ్యులు ఒరుగంటి యాదయ్యగౌడ్, బుద్దుల జంగయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కావలి నర్సింహ్మ, పి. శివకుమార్‌గౌడ్, నీలమ్మ తో బాటు ప్రజాసంఘాల నాయకులు ప్రభు, లింగం, శ్రీదేవి, క్రాంతి, వంశీవర్ధన్‌రెడ్డి,సుధాకర్, దత్తునాయక్ సిపిఐ మండల కార్యదర్శి మస్కు సంజివ తదితరులు పాల్గోన్నారు.

# అలుపెరుగని పోరాట యోధుడు సిద్ది

- పార్టీకి, ప్రజలకందించిన సేవలు చిరస్మరణీయం
- ఎర్ర జెండాను నమ్మిన కార్యకర్తలకు భరోసా సిద్ది
- నేటితరం కమ్యూనిస్టులకు ఆదర్శం
- సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా



**ప్రజాపక్షం/పాల్వంచ :** స్వార్థ ప్రయోజనాల కోసం జెండాలు, ఎజెండాలు మారుస్తూ రాజకీయాలను భ్రష్టు పట్టిస్తున్న ప్రస్తుత తరుణంలో దానికి భిన్నంగా నమ్మిన సిద్ధాంతం కోసం కట్టుబడి కడదాకా ఒకే జెండాతో మమేకమైన నికార్సయిన కమ్యూనిస్టు నాయకులు, అలుపెరుగని పోరాట యోధుడు సిద్ది వెంకటేశ్వర్లు అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా అన్నారు. సిపిఐ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ కార్యదర్శి సిద్ది వెంకటేశ్వర్లు 4వ, వర్ధంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ది వెంకటేశ్వర్లు స్మారక స్థూపానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యు లు ముత్యాల విశ్వనాథం సిపిఐ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం సాబీర్‌పాషా మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో ప్రజా ఉద్యమాలను తారా స్థాయికి చేర్చి పార్టీ బలోపేతానికి బాటలు వేసిన బలమైన నాయకుడు సిద్ది వెంకటేశ్వర్లు అని, ప్రజలకు, పార్టీ అభివృద్ధికి చేసిన ఆయన సేవలను కొనియాడారు. వి ద్యార్థి సంఘం మొదలు యువజన, వ్యవసాయ, కార్మిక సంఘం రాష్ట్ర నేతగా, ఉమ్మడి ఖమ్మం జిల్లా పార్టీ కార్యదర్శిగా, రాష్ట్ర సహా య కార్యదర్శిగా అనేక పదవులను చేపట్టి విజయవంతంగా నడిపించిన సిద్ది ఆ పదవులకే వన్నె తెచ్చిన అరుదైన నాయకుడన్నా రు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జనసేవాదళ్ బాధ్యులుగా వేలాది మందిని ఎర్రసైనికులను తయారు చేసి ప్రజా ఉద్యమాలకు ఊపి రి పోసిన చరిత్ర సిద్ది వెంకటేశ్వర్లు సొంతమన్నారు. ఏజెన్సీ ప్రాం తంలో బలమైన భూ పోరాటాలను నిర్వహించి వేలాది ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనత ఆయనకు దక్కిందన్నారు. ఎంతటి సమస్యనైనా నేర్పుగా పరిష్కరించ గలిగే సత్తా ఉన్న నేత అని, ఆయన సమయ స్ఫూర్తితో ఇతర పార్టీలకు చెందిన నాయకులను సైతం ఆకట్టుకొనేవారని చెప్పారు. పాల్వంచ ప్రాంతంలో నే కాకుండా అనేక ప్రాంతాలలో శ్రమజీవుల సంఘాలను ఏర్పా టు చేసి తద్వారా పార్టీ బలోపేతానికి పాటుపడ్డారని, ఎలాంటి బెదిరింపులకు, ఆర్థిక ప్రలోభాలకు లొంగకుండా నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ముందుకు సాగారని తెలిపారు. ఒకానొక దశలో పార్టీ పరిస్థితులు భిన్నంగా మారిన సమయంలో మొక్కవోని దీక్షతో అంకిత భావంతో పార్టీని నిలబెట్టేందుకు కృషి చేశారని స్పష్టం చేశారు. ఈ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆయన పిలుపు తో ఎందరో పార్టీలోకి వచ్చిన వారు నేటికీ కొనసాగుతున్నారని వెల్లడించారు. దేశంలో కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా తన గళాన్ని వినిపించి వ్యాపారుల్లో చెతన్యం చేశారని, ఆ రోజుల్లో కొందరు ఆయన మాటలను పెడచెవిన పెట్టారని కానీ మారిన పరిస్థితుల్లో వ్యాపారులు కమ్యూనిస్టుల అవసరాన్ని గుర్తిస్తున్నార ని, సిద్ది ఆశయ సాధన కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యు లు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు కొండలరావు, నిమ్మల రాంబాబు,ఇట్టి వెంకటరావు, కార్పొరేటర్ బోయిన విజయ, ప్రజా సంఘాల నాయకులు వల్లపు యాకయ్య, ఆలపాటి ప్రసాద్, సత్యనారాయణ, భుక్యా విజయ్, వేములపల్లి రాజశేఖర్, ఇరుకులపాటి సుధాకర్, రామాచారి, రాము, వెంకట్, బాబు, కిరణ్, వెంకన్న, అల్లి వెంకటేశ్వర్లు, వివిధ పార్టీల నాయకులు కనగాల అనంతరాములు, దొప్పలపూడి సురేష్, మానస శ్రీను, ఇటుకల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

## ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎండి ఉస్మాన్



**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** మున్సిపల్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జగిత్యాల జిల్లా మున్సిపల్ స్టాఫ్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ యూనియన్ (ఎఐటియుసి) జిల్లా కార్యదర్శి ఎండి ఉస్మాన్ డిమాండ్ చేశారు. ఈ మేర కు శుక్రవారం మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్‌కు యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎండి ఉస్మాన్ మాట్లాడుతూ జిఒ నంబర్ C/R No:741/2014/M22 ప్రకారం మున్సిపల్ కార్మికుల వేతనాల నుంచి ప్రతి నెలా ఇపిఫ్, ఇఎస్ఐ మొత్తాలను తప్పనిసరిగా జమ చేయాలని కోరారు. ఈ వివరాలను సంబంధిత పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసి కార్మికులకు పిఎఫ్ స్లిప్పులు అందించాలని డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన మాస్కులు, గ్లౌజులు, నూనె, సబ్బులు, చెప్పులు తదితర రక్షణ సామగ్రిని క్రమం తప్పకుండా పంపిణీ చేయాలని కోరారు.అలాగే జీతంలో కోత విధించకుండా 15 రోజుల క్యాజువల్ సెలవులు మంజూరు చేయాలని, వారానికి ఒకరోజు వీక్లీ ఆఫ్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పండుగ సెలవులను కూడా రొటేషన్ పద్ధతిలో అమలు చేయాలని కోరారు.మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను అధికారులు సానుకూలంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఎండీ ఉస్మాన్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు లంక శ్రీకాంత్‌తో పాటు ఉల్లెందుల శ్రీను,విజయ్,రాజేందర్,రాజేష్,సతీష్,చందు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రూపా రెడ్డి హత్య ఘటనపై నిరసన, ఆందోళన

## ఆందోళనకు సిపిఐ సంఘీభావం



**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** నల్గొండ జిల్లాలో స్కూల్ ప్రిన్సిపాల్ రూపా రెడ్డి హత్య ఘటనను నిరసిస్తూ నేడు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జిల్లా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేసిన నిరసన ఆందోళన కార్యక్రమానికి పాల్గొని సిపిఐ జిల్లా పార్టీ తరఫున సంఘీభావం ప్రకటించిచారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు సమాజంలో జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తల్లిదండ్రులు బాధ్యతతో మెలగాలన్నారు. గంజాయి చెడు అలవాట్లకు బానిసలై విద్యార్థులు పెడుతూవా పడుతున్నారని ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం పోలీస్ యంత్రాంగం కృషి చేయాలన్నారు. విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడుతూ తమ బంగారు భవిష్యత్తును ఆగం చేసుకుంటున్నారని తెలిపారు. రూప రెడ్డి హత్య తీవ్రంగా కలచి వేసిందని వారికి సిపిఐ తరఫున ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారథి రెడ్డి, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ బాధ్యులు సుధా అర్జున్ రెడ్డి, భూపాల్ రెడ్డి, మల్లారెడ్డి, ఖలీద్, ప్రైవేట్ స్కూల్స్ ఉపాధ్యాయులు, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్ ,మామిళ్ల సాంబలక్ష్మి , కేదాసు రమేష్, మంద శంకర్, తండా శ్రీనాథ్, నక్క నాగార్జున, మల్లయ్య, బాలాజీ, మేక వెంకటేష్, కోన సత్యం, ఎండి అలీమా, తండా మాధవి, తండా వినోద, కనకం పద్మ తదితరులు పాల్గొన్నారు.

# విశ్వసనీయ వార్తలతోనే ప్రజాస్వామ్యం బలోపేతం

- జెన్ జీపై సోషల్ మీడియా ప్రభావం అధికంగా ఉన్న నేపథ్యంలో యువతకు వాస్తవ, విశ్వసనీయ సమాచారాన్ని అందించాలి
- ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ జాతీయ సదస్సు ప్రారంభ కార్యక్రమంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా




**ప్రజాపక్షం/హైదరాబాద్:** డిజిటల్ యుగంలో వేగం కంటే వార్తలో వాస్తవికత, నిష్పక్షపాతం, విశ్వసనీయతే అత్యంత ముఖ్యమని, విశ్వసనీయ వార్తలతోనే ప్రజాస్వామ్యం బలోపేతమవుతుందని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్‌శుక్లా అన్నారు. ముందు నిజ నిర్ధారణ చేయాలని, ఆ తర్వాతే వార్తను ప్రసారం చేయాలని గవర్నర్ జర్నలిస్టులకు సూచించారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్' తొలి జాతీయ సదస్సును గవర్నర్ శుక్రవారం ప్రారంభించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రెస్ క్లబ్‌ల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ ప్రెస్ క్లబ్స్ ప్రతినిధులు జర్నలిస్టులను ఉద్దేశించి గవర్నర్ మాట్లాడుతూ మీడియా ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభం మాత్రమే కాదని, సమాజానికి కళ్లు, చెవులు, ప్రజల గొంతుక అని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), డేటా అనలిటిక్స్ వంటి సాంకేతిక పరిజ్ఞానాలు జర్నలిజానికి కొత్త అవకాశాలను కల్పిస్తున్నాయని, అదే సమయంలో డీప్‌ఫేక్స్, ఎఐ రూపొందించిన వీడియోలు, తప్పుడు సమాచారంతో కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో జర్నలిస్టుల బాధ్యత మరింత పెరిగిందన్నారు. సోషల్ మీడియా ప్రభావంతో జెన్‌జీ ఆలోచనా విధానం మారుతోందని, యువతకు వాస్తవ, విశ్వసనీయ సమాచారాన్ని అందించడంలో జర్నలిస్టుల పాత్ర కీలకం అన్నారు. వేగం కంటే వాస్తవ నిర్ధారణ ముఖ్యం అని పేర్కొన్న గవర్నర్ సోషల్ మీడియా ట్రెండ్స్, ఫేక్ న్యూస్‌కు గురికాకుండా ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా వార్తలు అందించాలని జర్నలిస్టులను కోరారు. సంచలనాత్మకత, వైరల్ కంటెంట్ కంటే విశ్వసనీయత, నైతిక ప్రమాణాలకు మీడియా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఫేక్ న్యూస్‌ను ఎదుర్కొనేందుకు డిజిటల్ లిటరసీ, ఎఐ లిటరసీ, ఫ్యాక్ట్ చెకింగ్ వంటి అంశాలపై జర్నలిస్టులకు ఫెడరేషన్ అవగాహన పెంచాలని సూచించారు. తప్పుడు సమాచారాన్ని అరికట్టడం ప్రభుత్వం ఒక్కదాని బాధ్యత మాత్రమే కాదని, మీడియా, సాంకేతిక సంస్థలు, పౌరులందరి సమష్టి బాధ్యత అని స్పష్టం చేశారు. 'నశా ముక్త్ భారత్' (మత్తు రహిత భారత్), 'టీబీ ముక్త్ భారత్' (టీబీ రహిత భారత్) వంటి జాతీయ కార్యక్రమాలను ప్రజా ఉద్యమాలుగా మలచడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించాలని గవర్నర్ పిలుపునిచ్చారు. తమ రచనలు, వార్తా సంస్థలు, డిజిటల్ వేదికల ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జర్నలిస్టులను కోరారు. జాతీయ సదస్సు భారతీయ జర్నలిజాన్ని మరింత బలోపేతం చేసి, విశ్వసనీయంగా, ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా తీర్చిదిద్దే దిశగా దోహదపడాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.దానకిశోర్, 'ద హిందూ' గ్రూప్ పబ్లిషింగ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ఎన్.రామ్, ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ అధ్యక్షులు గౌతమ్ లాహిరీ, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎస్.విజయ్‌కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వి.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో విద్యా కార్యక్రమాలు చేపట్టండి

- ఆక్స్‌ఫర్డ్ వర్సిటీకి సిఎం రేవంత్ రెడ్డి ఆహ్వానం
- సోమర్విల్ కాలేజీలో దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చిత్రపటాన్ని సందర్శించిన సిఎం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో విద్యా కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టాలని లండన్‌లోని ప్రపంచ ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం 900 ఏళ్ల చరిత్ర కలిగిన ప్రపంచ ప్రఖ్యాత లండన్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీని సందర్శించారు. తెలంగాణతో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ భాగస్వామ్య అవకాశాలు, రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి విద్య, పరిశోధన అవకాశాలు కల్పించే అంశాలపై ప్రముఖ విద్యావేత్తలతో విస్తృతంగా చర్చించారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ పరిధిలోని బ్లావాట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్కు చెందిన ప్రొఫెసర్ మాయా ట్యూడర్, బేలియోల్ కాలేజీకి చెందిన ప్రొఫెసర్ ఫైసల్ దేవ్జీతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 'తెలంగాణ రైజింగ్' విజన్‌ను వారికి సమగ్రంగా వివరించారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విద్యా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం రూపొందిస్తున్న ప్రణాళికలు, చేపడుతున్న చర్యలను వివరించారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ తమ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు, ప్రత్యేక పరిశోధన సామర్థ్యాలు, విస్తృతమైన విద్యా వ్యవస్థను హైదరాబాద్‌కు తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. హైదరాబాద్లో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసి, తెలంగాణ యువతకు, ఉద్యోగ నిపుణులకు ప్రపంచ స్థాయి విద్యా, పరిశోధన అవకాశాలు అందించేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ కీలక సమావేశంలో సీఎం కార్యాలయ సలహాదారు, ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ జాతీయ విద్యా విధానం కింద విదేశీ విశ్వవిద్యాలయాలకు అందుబాటులో ఉన్న అవకాశాలపై ఆయన సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. హైదరాబాద్, తెలంగాణలో విదేశీ విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేసుకునేందుకు ఉన్న అవకాశాలు, వాటికి లభించే ప్రయోజనాలను వివరించారు.తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ప్రొఫెసర్లు మాయా ట్యూడర్, ఫైసల్ దేవ్జీ సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర యువత, ఉద్యోగ నిపుణులతో కలిసి పనిచేయడానికి ఆసక్తి వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వంతో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో భాగస్వామ్యానికి ఉన్న పలు అవకాశాలను ఈ సందర్భంగా వారు ప్రస్తావించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్కు ప్రతినిధి బృందాన్ని పంపాలని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రతినిధులను తెలంగాణ బృందం ఆహ్వానించింది. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చారిత్రక సోమర్విల్ కాలేజీని సందర్శించారు. ఈ కాలేజీలో విద్యాభ్యాసం చేసిన దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చిత్రపటాన్ని సందర్శించారు. 2002లో సోనియా గాంధీ ఈ చిత్రపటాన్ని సోమర్విల్ కాలేజీకి బహూకరించిన విషయం తెలిసిందే. అనంతరం ముఖ్యమంత్రి, అక్కడే జీఎంఆర్ గ్రూప్ నిర్వహిస్తున్న యుటిలిటా బౌల్ను సందర్శించారు. జీఎంఆర్ గ్రూప్ కార్పొరేట్ చైర్మన్ కిరణ్ కుమార్ గ్రంథితో కలిసి అక్కడి సమగ్ర క్రీడా సదుపాయాలను పరిశీలించారు. ఈ ప్రాంగణంలో గోల్ఫ్ కోర్స్తో పాటు వివిధ క్రీడలకు సంబంధించిన మౌలిక సదుపాయాలు, హోటల్ ఉన్నాయి. తెలంగాణలో ప్రపంచస్థాయి క్రీడా మౌలిక సదుపాయాల ఏర్పాటుపై ముఖ్యమంత్రి జీఎంఆర్ ప్రతినిధులు, సంస్థ గ్లోబల్ స్పోర్ట్స్ యూనిట్‌తో మంతనాలు జరిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి, ప్రపంచస్థాయి క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని వారిని ఆహ్వానించారు. శుక్రవారం సాయంత్రం ప్రస్తుత ప్రిమియర్ లీగ్ చాంపియన్స్ ఆర్సెనల్, కోవెంట్రీ మధ్య జరిగే ఈపిఎల్ మ్యాచ్ను వీక్షించేందుకు ముఖ్యమంత్రి ఎమిరేట్స్ స్టేడియాన్ని సందర్శించనున్నారు.

# గ్లోబల్ స్థాయిలో 'ఇన్వెస్ట్ తెలంగాణ' సమ్మిట్

- ప్రపంచ పెట్టుబడిదారులను ఆకర్షించేలా పకడ్బందీ ఏర్పాట్లు
- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి: సిఎస్ సంజయ్ జాజు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణను ప్రపంచస్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో డిసెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్–ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'ను అత్యున్నత ప్రమాణాలతో విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం సమ్మిట్ ఏర్పాట్లపై సిఎస్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సమ్మిట్‌కు ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, వివిధ రంగాల నిపుణులను ఆకర్షించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. వివిధ దేశాల రాయబారులు, హైకమిషనర్లకు ప్రత్యేక ఆహ్వానాలు పంపడంతో పాటు ఆయా దేశాల్లోని ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను కూడా సమ్మిట్‌కు ఆహ్వానించాలని సిఎస్ సూచించారు. దేశంలోని ప్రముఖ పారిశ్రామిక సంస్థల ప్రతినిధులతో పాటు శాస్త్ర, సాంకేతిక, వైద్య, విద్య, మౌలిక వసతులు తదితర రంగాల ప్రముఖులను ముందుగానే ఆహ్వానించాలని ఆదేశించారు. సమ్మిట్ నిర్వహణ కోసం వివిధ కమిటీలను ఏర్పాటు చేసి, ఒక్కో కమిటీకి స్పష్టమైన బాధ్యతలు అప్పగించాలని పేర్కొన్నారు. అన్ని కమిటీలు పరస్పర సమన్వయంతో పనిచేసేలా పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణలోని వివిధ రంగాల సామర్థ్యం, పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా ప్రత్యేక ఎక్స్‌పోలను ఏర్పాటు చేయాలని సంజయ్ జాజు తెలిపారు. ఈ ఎక్స్‌పోల్లో ప్రముఖ కంపెనీలు, సంస్థలు భాగస్వాములయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే సమ్మిట్ నిర్వహణకు మార్గదర్శకత్వం అందించేందుకు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, నిపుణులతో కూడిన అడ్వైజరీ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను అంతర్జాతీయ వేదికపై సమర్థంగా ప్రదర్శించి, రాష్ట్రాన్ని ప్రపంచస్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా మరింతగా ప్రతిష్టించేలా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సిఎస్ స్పష్టం చేశారు. సమావేశంలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక, పరిశ్రమల శాఖ కమిషనర్ కృష్ణ ఆదిత్య, ఐటి శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, ఇన్వెస్ట్ తెలంగాణ సిఇఒ అజిత్ రెడ్డి, నిఖిల్ చక్రవర్తి పాల్గొన్నారు.

# వివేకా హత్య కేసులో కీలక పరిణామం

- తెలుగు రాష్ట్రాల్లో ఏడు చోట్ల ఇడి సోదాలు
- ఎంపి అవినాశ్ రెడ్డికి ఇల్లు, కార్యాలయంలో విస్తృత తనిఖీలు
- మరికొందరి నిందితుల ఇళ్లలోనూ...

**పులివెందుల :** మాజీ మంత్రి వివేకా హత్య కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఎంపి అవినాశ్ రెడ్డికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) షాక్ ఇచ్చింది. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణలో భాగంగా అవినాశ్ రెడ్డి ఇళ్లు, కార్యాలయాలపై దాడులకు దిగింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో శుక్రవారం తెల్లవారుజామునుంచి సోదాలు మొదలుపెట్టింది. ఆ మేరకు ఏడు చోట్ల ఈడీ అధికారులు తనిఖీలు జరుపుతున్నారు. హైదరాబాద్, పులివెందులలోని అవినాశ్ రెడ్డి నివాసాలు సహా ఆయన కార్యాలయాల్లో సోదాలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని కోకాపేటలోని వైసీపి ఎంపి వైఎస్ అవినాశ్ రెడ్డి విల్లాల్లోనూ ఈడీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో అవినాశ్ రెడ్డి తన ఇంట్లోనే ఉన్నట్లు తెలిసింది. ఈ సందర్భంగా మనీ లాండరింగ్, అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలు ఏమైనా ఉన్నాయా అన్న అంశంపై వారు ఆరా తీశారు. ఇందుకు సంబంధించిన కీలక డాక్యుమెంట్ల కోసం వెతికారు. అలాగే అవినాశ్ రెడ్డి ఆస్తుల వివరాలను సేకరించారు. ఎంపి అవినాశ్ రెడ్డితో పాటు వివేకా హత్య కేసు నిందితుల ఇళ్ల పైనా ఈడీ అధికారులు దాడులకు దిగారు. మరోవైపు, పులివెందులలోని దేవి రెడ్డి శివశంకర్ రెడ్డి, ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్ ఇళ్లలోనూ సోదాలు చేశారు. తొండూరు మండలం టి.తుమ్మలపల్లిలో ఎర్ర గంగిరెడ్డి నివాసంలో, అలాగే పులివెందులలోని జగన్ సమీప బంధు సునీల్ రెడ్డి ఇంట్లోనూ సోదాలు నిర్వహించారు. ఈడీ అధికారులు వేర్వేరు బందాలుగా ఏర్పడి ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అనేక కీలక పత్రాలను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. వివేకా హత్య కేసులో ఏ4 నిందితుడు డ్రైవర్ దస్తగిరి ఇంటిలోనూ ఈడీ అధికారులు సోదాలు నిర్వహించి దస్తగిరి పంచాయతీలు చేసిన అనేక కీలక డాక్యుమెంట్లను జిరాక్స్ చేసుకొని తీసుకెళ్లినట్లు సమాచారం. ఎలాంటి ఉద్రిక్తతలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్తగా సీఆర్‌పిఎఫ్ బలగాలను రంగంలోకి దింపినట్లు సమాచారం. ఈ సందర్భంగా వైసీపి మున్సిపల్ ఇంఛార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ఈడీ అధికారులు తమను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయలేదని తెలిపారు. ఎంపి అవినాశ్ రెడ్డి ఇంటిని తనిఖీ చేసేందుకు ఈడీ అధికారులు వచ్చిన విషయం తెలుసుకుని తాను ఇంటి వద్దకు వెళ్లినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు కేవలం ఆస్తి వివరాలు మాత్రమే అడిగారని, తమను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయలేదని స్పష్టం చేశారు.

**అవినాశ్ రెడ్డి నివాసంలో రూ.24 లక్షలు సీజ్ : ఇడి**

ఎంపి వైఎస్ అవినాశ్ రెడ్డి నివాసంలో లెక్క చూపని రూ.24 లక్షలు సీజ్ చేసినట్లు ఈడీ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. ఎంపి నివాసంలో రెండు బ్యాంక్ లాకర్ల తాళాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపింది. నెల రోజుల ముందే వివేకా హత్యకు కుట్ర జరిగిందని దస్తగిరి వెల్లడించారని గుర్తు చేసింది. హత్య కోసం దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి రూ.40 కోట్లు ఆఫర్ చేశారని పేర్కొంది. రూ.40 కోట్లలో వాటాగా రూ.5 కోట్లు... దస్తగిరికి ఇస్తానని ఎర్ర గంగిరెడ్డి ప్రలోభపెట్టారని ఈడీ పేర్కొంది. సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్, చార్జ్‌షీట్లు ఆధారంగా ఈసీఐఆర్ నమోదు చేసినట్లు తెలిపింది. ఐపిసీ (121డీ), 302 సెక్షన్ పిఎంఎల్‌ఏ కింద కేసు నమోదు చేశామని ఈడీ వివరించింది. ఈ సోదాల్లో నేరానికి సంబంధించిన కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలు సీజ్ చేశామని స్పష్టం చేసింది. హైదరాబాద్, కడప నగరాల్లోని మొత్తం ఏడు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించినట్లు ఈడీ వివరించింది.

# పబ్లిక్ హెల్త్ ఇఎన్‌సి భాస్కర్‌రెడ్డిపై బదిలీ వేటు

- నూతన ఇఎన్‌సిగా వై.సాయప్ప రెడ్డి నియమాకం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ శాఖలో భారీ పరిణామాలు చోటుచేసుకున్నాయి. తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సి) ఎస్.భాస్కర్ రెడ్డిపై ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. ఆయనను ఈఎన్‌సి బాధ్యతల నుంచి తక్షణమే తొలగిస్తూ, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్‌ఎంఆర్‌ఎల్) చీఫ్ ఇంజనీర్‌గా బదిలీ చేసింది. ఈ మేరకు పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ నూతన ఈఎన్‌సిగా వై.సాయప్ప రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

**పోస్టింగ్‌లలో అక్రమాలు.. ఫిర్యాదుల పరంపర**

ఇటీవల కాలంలో పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగంలో జరిగిన ఇంజనీర్ల పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో తీవ్ర అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. భాస్కర్ రెడ్డి తన పదవిని దుర్వినియోగం చేస్తూ నియమ నిబంధనలకు విరుద్ధంగా, ఇష్టారీతిన పదోన్నతులు, బదిలీలు చేశారనే ఆరోపణలు వచ్చాయి. అర్హులైన అధికారులకు అన్యాయం చేస్తూ సొంత నిర్ణయాలతో వ్యవహరించారని బాధితులు, విభాగ అధికారులు ప్రభుత్వానికి వరుసగా ఫిర్యాదులు చేశారు. జిహెచ్‌ఎంసిలో సస్పెన్షన్‌లో ఉన్న ఒక ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను ఎంఎంసికి బదిలీ చేయడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తం అయ్యాయి. సస్పెన్షన్‌లో ఉన్న అధికారికి ఏ విధంగా బదిలీ చేశారనే విషయం అప్పట్లో తీవ్ర చర్చనీయంశంగా మారింది.

**ప్రభుత్వం సీరియస్ యాక్షన్**

అందిన ఫిర్యాదులపై స్పందించిన ప్రభుత్వం ఈ వ్యవహారంపై ప్రాథమిక విచారణ జరిపింది. ఆరోపణల్లో ప్రాథమిక సత్యముందని తేలడంతో శాఖపరమైన ప్రతిష్ఠను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలకు ఉపక్రమించింది. ఈ క్రమంలోనే భాస్కర్ రెడ్డిని కీలకమైన పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం ఈఎన్‌సి స్థానం నుంచి తొలగించి, హెచ్‌ఎంఆర్‌ఎల్ విభాగంలోకి పంపించింది. అయితే నూతన ఈఎన్‌సిగా బాధ్యతలు చేపట్టిన వై.సాయప్ప రెడ్డి కూడా జూనియర్ అని తెలిసింది. సీనియరిటీ జాబితాను పక్కన పెట్టి, సాయప్ప రెడ్డికి ఈఎన్‌సి బాధ్యతలు అప్పగించడంపై ప్రస్తుతం పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగంలో కొత్త చర్చకు తెర లేసింది.

# సిఎం విదేశీ పర్యటనపై రాజకీయం తగదు

- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి విదేశీ పర్యటనకు సంబంధించిన అనుమతుల అంశాన్ని కాంగ్రెస్ అనవసరంగా రాజకీయం చేస్తోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు విమర్శించారు. హైదరాబాద్ బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సిఎంతో వెళ్లే అధికారుల ప్రతినిధి బృందానికి పెట్టుబడుల సమావేశాల కోసం కేంద్రం ఇప్పటికే అనుమతులు ఇచ్చిందని తెలిపారు. రాజకీయ కోణంలో ఈ వ్యవహారాన్ని చూడడం సరికాదన్నారు. విదేశీ పర్యటనలకు సంబంధించిన అనుమతులు రాజ్యాంగ, భద్రత, దౌత్యపరమైన నిబంధనల ప్రకారమే మంజూరవుతాయని చెప్పారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ విజయేందర్, డాక్టర్ ప్రమోద్‌లకు రాంచందర్ రావు పార్టీ కండువా కప్పి బిజెపిలోకి సాదరంగా ఆహ్వానించారు.

**వైద్య విద్యార్థుల సమస్యలపై పోరాడతాం**

ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో అదనపు ఫీజుల దోపిడిపై పోరాటం చేస్తామని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. హైదరాబాద్ బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నీట్, ఎంబిబిఎస్ విద్యార్థుల తల్లిదండ్రుల ప్రతినిధి బృందం ఆయన్ను కలసి వినతిపత్రం సమర్పించింది. నిబంధనల ప్రకారం నాలుగున్నర ఏళ్ల కోర్సుకే ఫీజు వసూలు చేయాల్సి ఉండగా, కొన్ని యాజమాన్యాలు ఐదేళ్లకు వసూలు చేస్తూ విద్యార్థులను వేధిస్తున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై రాంచందర్ రావు స్పందిస్తూ టిఎఎఫ్ఆర్‌సి, ఎన్ఎంసి ఆదేశాలను అమలు చేసి, బాధితులకు న్యాయం జరిగే వరకు బిజెపి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

# సిఎం పర్యటన రద్దు తీవ్రమైన అంశం

- బిజెపి నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు పొలిటికల్ క్లియరెన్స్ రాకపోవడం తీవ్రమైన అంశమని నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్ అన్నారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ డెలిగేషన్ పర్యటన కొనసాగుతుండగా, ఒక్క సిఎం పర్యటననే కేంద్రం ఎందుకు నిలిపివేసిందో ఆలోచించాలన్నారు. క్లియరెన్స్ రాకముందే టికెట్లు ఎందుకు కొన్నారని ప్రశ్నించారు. విదేశీ పర్యటనలకు వెళ్లేటప్పుడు ఎఫ్‌సిఆర్ఎ, భద్రతాపరమైన నిబంధనలు ఉంటాయని, ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఓవైసీ కుమార్తె పెళ్లికి హాజరయ్యేందుకు సిఎం ఈ పర్యటన ప్లాన్ చేసుకున్నారని అన్నారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందన్నారు.




# మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ 'నైరా' కలెక్షన్ విడుదల

- శ్రీనిధి శెట్టి నటించిన సరికొత్త ప్రచార చిత్రం ఆవిష్కరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ 'నైరా' పేరుతో సరికొత్త సహజ రత్నాల ఆభరణాల కలెక్షన్‌ను విడుదల చేసింది. ఈ కలెక్షన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న నటి శ్రీనిధి శెట్టి నటించిన ప్రచార చిత్రాన్ని సంస్థ ఆవిష్కరించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న 'జెమ్‌స్టోన్ జ్యువెలరీ ఫెస్టివల్'లో భాగంగా 'నైరా' కలెక్షన్‌ను పరిచయం చేస్తున్నారు. రత్నాలు, అన్‌కట్ ఆభరణాల తయారీ ఛార్జీలపై 25 శాతం వరకు తగ్గింపు అందిస్తున్నట్లు సంస్థ తెలిపింది. ఈ ప్రత్యేక ఆఫర్ సెప్టెంబర్ 14 వరకు కొనసాగనుంది. సహజ రత్నాల అందాన్ని ఆధునిక డిజైన్లతో మేళవిస్తూ 'నైరా' కలెక్షన్‌ను రూపొందించినట్లు మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పి.అహ్మద్ తెలిపారు. సంప్రదాయ పనితనం, శిల్పకళతో పాటు సమకాలీన డిజైన్లను ఇందులో పొందుపరిచినట్లు పేర్కొన్నారు.

# షావుకారు జానకి మృతికి ప్రముఖుల సంతాపం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రముఖ నటి, పద్మశ్రీ షావుకారు జానకి మృతి పట్ల రాజకీయ, సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు. అలాగే తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. చిన్నతనం నుంచే నాటకాల్లో వివిధ పాత్రలు పోషిస్తూ కెరీర్‌ను ప్రారంభించిన షావుకారు జానకి దాదాపు ఏడు దశాబ్దాల పాటు చలనచిత్ర రంగంలో తనదైన ముద్ర వేశారని ఒక సందేశంలో సిఎం పేర్కొన్నారు. 'షావుకారు' సినిమాలో అసమాన ప్రతిభ కనబరిచి షావుకారు జానకిగా స్థిరపడ్డారని గుర్తు చేస్తూ, తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో దాదాపు 400 చిత్రాల్లోనే కాకుండా హిందీ, మలయాళ చిత్రాల్లో కూడా నటించి ప్రేక్షకులను మెప్పించారని సిఎం తెలిపారు. పలు మేటి చిత్రాల్లో షావుకారు జానకి పోషించిన పాత్రలు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తాయని కొనియాడారు. చలనచిత్ర రంగంలో ఆమె లేని లోటు పూడ్చలేనిదని అన్నారు. ఆమెకు శాంతి చేకూర్చాలని భగవంతుడు ప్రార్థిస్తూ, అమె కుటుంబ సభ్యులకు, అభిమానులకు ముఖ్యమంత్రి సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

**బి.మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి**

పద్మశ్రీ షావుకారు జానకి గారి మృతి పట్ల టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర దిగ్భ్రాం తి వ్యక్తం చేశారు. దక్షిణ భారత చలనచిత్ర రంగంలో ఏడు దశాబ్దాలకుపైగా తన నటనా ప్రతిభతో ప్రేక్షకులను అలరించిన షావుకారు జానకి మరణం తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమలకు తీరని లోటని ఆయన పేర్కొన్నారు.

**షావుకారు జానకి మృతి సినీ రంగానికి తీరని లోటు: కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

ప్రముఖ సీనియర్ నటి, పద్మశ్రీ షావుకారు జానకి మృతి పట్ల సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో వందలాది చిత్రాల్లో నటించి తన సహజ నటనతో కోట్లాది మంది ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**జానకి ఇకలేరనే వార్త ఎంతో బాధ కలిగించింది: చిరంజీవి**

షావుకారు జానకి ఇకలేరనే వార్త ఎంతో బాధ కలిగించిందని మెగాస్టార్ చిరంజీవి ఆవేదన వ్యక్తం చేశారు. 'షావుకారు' చిత్రంతో మొదలైన ఆమె సుదీర్ఘ సినీ ప్రస్థానం తెలుగు, తమిళంతో పాటు పలు భాషల్లో దాదాపు ఏడు దశాబ్దాలపాటు కొనసాగింది. భారతీయ చిత్ర పరిశ్రమకు ఆమె అందించిన సేవలు చిరస్మరణీయం. షావుకారు జానకి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను అని చిరంజీవి పేర్కొన్నారు.

**షావుకారు జానకి ఆత్మకు శాంతి చేకూరాలి: పవన్ కళ్యాణ్**

ప్రముఖ నటి షావుకారు జానకి కన్నుమూశారని తెలిసి చింతించాను. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను అని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, సినీ నటుడు పవన్‌కళ్యాణ్ అన్నారు. సినిమా పేరునే ఇంటి పేరుగా మార్చుకున్న నటి జానకి. షావుకారు జానకి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను అని తెలిపారు.

**తీరని లోటు : తమ్మారెడ్డి భరద్వాజ**

షావుకారి జానకి మరణం ముఖ్యంగా సౌత్ సినిమా ఇండస్ట్రీకి తీరని లోటని ప్రముఖ దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. ఆమె గొప్పనటి అని చెప్పారు. మొదటి సినిమానే ఆమె ఇంటిపేరుగా మారిపోయిందని తెలిపారు. షావుకారి జానకి ఆత్మకు శాంతి కలగాలని తమ్మారెడ్డి భరద్వాజ ప్రగాఢ సంతాపం తెలిపారు.

**ఆమెకు బాగా నచ్చిన సినిమా 'శ్రీకారం': అంకురం ఉమా మహేశ్వర్ రావు**

షావుకారి జానకి మరణం చాలా కలచి వేసిందని అంకురం సినిమా దర్శకుడు ఉమా మహేశ్వర్ రావు అన్నారు. ఆమె మరణ వార్త విని చాలా బాధ పడ్డానని చెప్పారు. నేను తీసిన శ్రీకారం సినిమా ఆమెకు చాలా ఇష్టమైన సినిమా అని ఒకటి రెండుసార్లు కలిసినప్పుడు చెప్పిందని అన్నారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

**ఆమె పాత్రలు గుర్తుండిపోతాయి : జూనియర్ ఎన్టీఆర్**

షావుకారి జానకి మరణం ఎంతో బాధ కల్గించిందని జూనియర్ ఎన్టీఆర్ తన సోషల్ మీడియాలో పేర్కొన్నారు. భారతీయ సినిమా రంగంలో షావుకారు జానకి తనదైన ముద్ర వేశారని అన్నారు. వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రతిస్తున్నానని చెప్పారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# దానం అనర్హతపై వచ్చే 16న తీర్పు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఖైరతాబాద్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పార్టీ ఫిరాయింపులకు పాల్పడినందున ఆయనపై అనర్హత వేటు వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌లపై హైకోర్టులో వాదనలు పూర్తయ్యాయి.. తీర్పును సెప్టెంబరు 16న వెలువరిస్తామని ప్రకటించింది. దానం కాంగ్రెస్‌లో చేరారని, కాంగ్రెస్ నుంచి సికింద్రాబాద్ లోక్‌సభ సీటుకు పోటీ చేశారని, ఆయనపై అనర్హత ప్రకటించాలన్న పిటిషన్‌లను స్పీకర్ కొట్టివేశారు. ఈ తీర్పును సవాలు చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపి పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వేర్వేరుగా వేసిన పిటిషన్లను చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ పూర్తి చేసింది పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదిస్తూ.. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన దానం ఆ పార్టీకి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారని తెలిపారు. కాంగ్రెస్ జాతీయ నాయకులు, సీఎం సమక్షంలో బహిరంగంగా ఆ పార్టీలో చేరినట్లు పత్రికలు, మీడియాలో వార్తలు వచ్చాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేశారని తెలిపారు. దీనిపై దానం తరఫు న్యాయవాది ప్రతివాదన చేస్తూ, పత్రికలు, మీడియాలో వచ్చిన కథనాలను ఆధారంగా చేసుకుని అనర్హత వేటు వేయాలని కోరడం సమంజసం కాదన్నారు. దానం బీఆర్ఎస్ సభ్యత్వానికి రాజీనామా చేయలేదని, ఆ పార్టీ కూడా ఆయనను బహిష్కరించలేదని తెలిపారు. ఇతర పార్టీల నేతలను కలవడాన్ని వ్యక్తిగత అంశంగా చూడాలని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడంపై రాజ్యాంగంలో ఎలాంటి నిషేధం లేదని వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును సెప్టెంబరు 16కు వాయిదా వేసింది.

## వరకట్న వేధింపులు, కుల దూషణ కేసులో నలుగురికి జైలు శిక్ష

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** వరకట్న వేధింపులు,కుల దూషణ కేసులో నలుగురు నిందితులకు నల్లగొండ ప్రత్యేక సెషన్స్ కోర్టు జైలు శిక్ష విధించింది. ఒక్కొక్కరికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.3 వేల చొప్పున జరిమానా విధించినట్లు జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తెలిపారు.నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్‌లో 2021లో కేసు నమోదైంది.ఈ కేసులో నిందితులు కల్లూరి స్వామినాథ్ (ఏ1),ప్రమీల (ఏ2),కల్లూరి యాదయ్య (ఏ3), కల్లూరి ఎల్లయ్య (ఏ4)లు నేరస్థులుగా తేలడంతో ప్రత్యేక సెషన్స్ జడ్జి శుక్రవారం తీర్పు వెలువరించారు.ఐపీసీ 498ఏ కింద 6 నెలల జైలు రూ.1000 జరిమానా,వరకట్న నిషేధ చట్టం సెక్షన్ 3 కింద 6 నెలల జైలు రూ.1000 జరిమానా, ఎస్‌సి/ఎస్‌టి చట్టం కింద 6 నెలల జైలు రూ.1000 జరిమానా విధించారు.జరిమానా చెల్లించకపోతే ఒక్కో నేరానికి అదనంగా 15 రోజుల జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించారు. మూడు నేరాలకు కలిపి 18 నెలల శిక్ష అయినా,శిక్షలను ఏకకాలంలో అమలు చేయాలని కోర్టు ఆదేశించడంతో నిందితులు 6 నెలల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది.కేసులో పకడ్బందీగా దర్యాప్తు చేసిన ఎస్‌ఐ ఎ.రాజశేఖర్ రెడ్డి,దర్యాప్తు అధికారి జి.వెంకటేశ్వర్ రెడ్డి,స్పెషల్ పీపీ దర్శనం నర్సింహ, ఎస్‌డీపీఓ కె.శివరాం రెడ్డి,సీఐ కె.ఆది రెడ్డి,ఎస్‌ఐ బి.శివ ప్రసాద్,కోర్టు లైజన్ అధికారులు పి.నరేందర్,ఎన్.మల్లికార్జున్ లను ఎస్‌పి అభినందించారు. బాధితులకు న్యాయం జరిగేలా పోలీస్ శాఖ శాస్త్రీయంగా దర్యాప్తు చేస్తుందని తెలిపారు.




## నిషేధిత జాబితాలోని ఇళ్ల స్థలాలు, పట్టా భూములను తొలగించాలి : సిపిఐ

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** 22 ఏ నిషేధిత జాబితాలో నమోదైన అర్హులైన ఇళ్ల స్థలాలు, పట్టా భూములను వెంటనే పరిశీలించి జాబితా నుంచి తొలగించాలని సిపిఐ ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య మాట్లాడుతూ తమకు చట్టబద్ధమైన హక్కులు పట్టాదారు పాసుబుక్కులు, రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నప్పటికీ నివేదిత జాబితాలో చేర్చడంతో క్రయవిక్రయాలు రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. 22 ఏ కింద నిషేధితంగా నమోదు అయిన భూములను భూభారత రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి వివాదాలు లేని పట్టా భూములు ఇంట్ల స్థలాలను గుర్తించి వెంటనే జాబితా నుంచి తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని తహసీల్దారును కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.శ్రీనివాస్, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చిలివేరు అంజయ్య, కలకొండ సంజీవ, ప్రజాసంఘాల నాయకులు మల్లె మల్లారెడ్డి, నల్లవెల్లి ముత్యాలు, వీరమల్ల యాదయ్య, సుర్వి నరసింహ, గ్రామ శాఖల కార్యదర్శులు, మహిళా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## ఎన్నికలు బ్యాలెట్ ద్వారా నిర్వహించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుందాం

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** సెప్టెంబర్ 1న ఢిల్లీలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, సిపిఐ రాష్ట్ర సమితిసభ్యులు కొప్పోజు సూర్యనారాయణ పిలుపునిచ్చారు. జాతీయ పార్టీ పిలుపుమేరకు బదలావ్ జరూర్ హై మార్పు కావాలి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం హుజూర్‌నగర్ మండలంలోని అమరవరం గ్రామంలో ప్రజా చైతన్యయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజేపి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో నిరుద్యోగం భాగా పెరిగిపోయిందని, యువత నిరాశ, నిస్పృహలలో ఉందన్నారు. దేశంలో ఎన్నికలు బ్యాలెట్ ద్వారా నిర్వహించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కోరారు. రైతులు పండించిన పంటలకు సీటు ప్లస్ 50 స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేస్తామని హామీ ఇచ్చి నేటి వరకు నేరవేర్చలేదన్నారు. మండల కార్యదర్శి కందుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అమరవరం గ్రామంలో ఉన్న ఇల్లులేని నిరుపేదలందరికి కూడా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇచ్చే ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్, గుంజ వెంకన్న, రామిరెడ్డి, సాయి, బ్రహ్మం పాల్గొన్నారు.

## 2027 గోవా ఎన్నికలకు ఆప్, ఆర్‌జిపిలతో పొత్తుకు కాంగ్రెస్ చర్చలు

**పనాజీ :** గోవా అసెంబ్లీ ఎన్నికలు 2027 నేపథ్యంలో ఐక్య కూటమిని ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), రివల్యూషనరీ గోవాన్స్ పార్టీ (ఆర్జిపి)లతో అధికారికంగా పొత్తు చర్చలు ప్రారంభించింది. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు గిరీష్ చోడంకర్, విలేకరులతో మాట్లాడుతూ ఆప్, ఆర్జిపి నాయకులతో సానుకూల ప్రాథమిక చర్చలు జరిగాయని ధృవీకరించారు. అయితే, గోవా ఫార్వర్డ్ పార్టీ (జిఎఫ్‌పి) పొత్తు చర్చలపై విధించిన తాత్కాలిక సస్పెన్షన్‌ను ఎత్తివేసిన తర్వాతే వివరణాత్మక సీట్ల పంపకం చర్చలు ప్రారంభమవుతాయని ఆయన పేర్కొన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా, రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో ఐక్య కూటమిగా పోరాడటానికి భావసారూప్యత గల పార్టీలను ఏకతాటిపైకి తీసుకురావడానికి కాంగ్రెస్ చొరవ తీసుకుందని ఆయన అన్నారు. కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవడానికి గోవా ఆప్ అధిపతి వాల్మీకి నాయక్, ఆర్జిపి అధ్యక్షుడు వీరేష్ బోర్కర్ సానుకూల సంకేతాలు ఇచ్చారని చోడంకర్ అన్నారు. పొత్తుపై అధికారిక చర్చలు త్వరలో ప్రారంభమవుతాయని, ఈ సందర్భంగా సీట్ల పంపకంతో సహా ఇతర వివరాలపై చర్చించే అవకాశం ఉందని ఆయన తెలిపారు. తాత్కాలికంగా చర్చలను నిలిపివేసిన గోవా ఫార్వర్డ్ పార్టీతో పొత్తుకు కాంగ్రెస్ కూడా సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. 2022 రాష్ట్ర ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్న జిఎఫ్‌పి, ఈ నెల ప్రారంభంలో, తీరప్రాంత రాష్ట్రంలోని మొత్తం 40 నియోజకవర్గాలపై దృష్టి పెట్టాలనుకుంటున్నామని పేర్కొంటూ చర్చలను నిలిపివేసింది. 2022 గోవా అసెంబ్లీ ఎన్నికలలో, 40 స్థానాలకు గాను బిజెపి 20 గెలుచుకోగా, కాంగ్రెస్ 11 స్థానాలను కైవసం చేసుకుంది. అప్పుడు జిఎఫ్‌పి ఒక స్థానాన్ని గెలుచుకుంది.

## కేవలం 15 మిల్లుల్లో...

# రూ.419.08 కోట్ల ధాన్యం పక్కదారి!

### తొవ్విన కొద్దీ బయటపడుతున్న మిల్లర్ల అక్రమాలు

### మిగతా 50 మిల్లుల్లో తనిఖీ చేస్తే ఇంకా ఎన్ని కోట్లు బయటపడనుందో!

### పౌరసరఫరాల శాఖ అధికారుల తనిఖీలో వెలుగుచూడని అక్రమాలు

### విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో బట్టబయలు



**ప్రజాపక్షం/సూర్యాపేట :** సిఎంఆర్ ధాన్యంలో మిల్లర్ల అక్రమాలు తొవ్వినా కొద్ది బయటపడుతున్నాయి. గత నెల రోజుల నుండి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్వహిస్తున్న వరుస తనిఖీలతో కోట్లాది రూపాయల ప్రభుత్వ ధాన్యం పక్కదారి పట్టిచ్చినట్లుగా అధికారులు గుర్తించారు. 2022 నుండి 2026 రబి సీజన్ వరకు జిల్లాలో దాదాపు 60 నుండి 75 రైస్ మిల్లులకు పౌర సరఫరాల శాఖ అధికారులు ప్రతి సీజన్‌లో సిఎంఆర్ కోసం వేలాది మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్లకు అప్పగించారు. కేవలం 15 మిల్లుల్లో తనిఖీలు చేయగా 1.55 లక్షల టన్నులకు పైగా ధాన్యం ఇప్పటి వరకు పక్కదారి పట్టించగా దీని విలువ రూ.419.08 కోట్లు ఉన్నట్లుగా అధికారుల లెక్కల్లో తేలింది. మిగతా 50కు పైగా ఉన్న రైస్ మిల్లుల్లో అధికారులు తనిఖీ చేస్తే ఇంకా ఎంత బయటపడనుం దోననే ప్రజల్లో చర్చ సాగుతుంది. మిల్లర్లకు అప్పగించిన ధాన్యాన్ని స్థానిక పౌరసరఫరాల శాఖ అధికారులు నెలనెలా తనిఖీలు చేసినా ఎక్కడ వెలుగుచూడని అక్రమాలు విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో బయటప డడం వారి పనితీరుకు అద్దం పడుతుంది. జిల్లా వ్యాప్తంగా అధికారులు దాదాపు 75 మిల్లులకు సిఎంఆర్ కోసం ధాన్యం కేటాయించగా ఇప్పటి వరకు అధికారులు 15 రైస్ మిల్లుల్లో తనిఖీలు నిర్వహిస్తే రూ.419.08 కోట్ల విలువైన ధాన్యం మిల్లర్లు పక్కదారి పట్టించిట్లుగా తేలింది. మిగతా 50 మిల్లుల్లో తనిఖీలు చేస్తే ఇంకా ఎన్ని వందల కోట్లు విలువైన ధాన్యం పక్కదారి పట్టిన్నట్లు బయటపడనుందో అనే చర్చ ప్రజల్లో పెద్దఎత్తున సాగుతుంది.

అధికారులు ధాన్యం కేటాయించిన కొన్ని రోజుల్లోనే కొంతమంది మిల్లర్లు దానిని బహిరంగ మార్కెట్‌లో విక్రయించి కోట్లాది రూపాయలు వెనకేసుకున్నట్లు దీనిని బట్టి స్పష్టమవు తుంది. ప్రభుత్వానికి చిక్కకుండా ఆ సొమ్ముతో బినామీల పేర్లతో ఆస్తులు కూడబెట్టినట్లు వార్తలు గుప్పుమంటున్నాయి.

మిల్లర్లకు సిఎంఆర్ కోసం ధాన్యం కేటాయించిన తరువాత జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు నెలనెలా ఆ మిల్లుల్లో తనిఖీలు చేసి ధాన్యం నిలువలు ఉన్నాయా లేవా అని తేల్చడం జరుగుతుంది. కానీ వీరి తనిఖీల్లో మాత్రం ఎక్కడ కూడా మిల్లర్లు అక్రమాలకు పాల్పడలేదని ధాన్యం నిల్వలు ఉన్నట్లుగా ప్రభుత్వానికి నివేదిక అందజేయడం జరిగింది. కానీ మిల్లర్లు ప్రభుత్వ ధాన్యాన్ని పక్కదారి పట్టిస్తున్నట్లు ఆయా ప్రచార మాధ్యమాలు వార్తా కథనాలు వచ్చినా అందులో వాస్తవం లేదని కొట్టిపారేస్తూ ఇన్ని రోజులు వచ్చారు. బకాయిలు పేరుకపోవడంతో గత నెల రోజుల నుండి జిల్లాలో విజిలెన్స్ అధికారులు వరుస తనిఖీలు చేస్తుండడంతో మిల్లర్ల అక్రమాలు బట్టబయలు అయ్యాయి. దీనితో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారుల పనితీరు ఎలా ఉందో ఇట్టే స్పష్టమవుతుంది. పౌరసరఫరాల శాఖ అధికారులు జిల్లాలో గత మూడు సంవత్సరాల క్రితం మూతపడ్డ రైస్ మిల్లులకు కూడా కోట్ల రూపాయల ధాన్యం కేటాయించినట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించడం అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది.

## సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి

### లోక్యతండలో గడపగడపకూ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ పర్యటన



**ప్రజాపక్షం/త్రిపురారం:** అధికారులు,ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా సమన్వయంతో అన్ని రంగాల్లో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ సూచించారు.ఇటీవల లోక్యతండ గ్రామస్తులతో కలిసి లోక్యతండ గ్రామ అభివృద్ధిపై ఢిల్లీలో ఎస్టీ కమిషన్‌కు వినతిపత్రం అందజేశారు. దీంతో శుక్రవారం ఢిల్లీ ఎస్‌సి కమిషన్ ఆదేశానుసారం నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ త్రిపురారం మండలం లోక్యతండలో పర్యటించి గడపగడపకు తిరుగుతూ క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ రోడ్లు,ఇందిరమ్మ ఇళ్లు,గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలు,మిషన్ భగీరథ నీటిపై ఆరా తీసి సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.గ్రామంలో పూరిగుడిసె కనబడటంతో గుడిసెలోకి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడి ఇందిరమ్మ ఇల్లు అందే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎల్‌నినో కారణంగా వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో పాటు సాగర్ జలాశయంలో సాగు నీటికి అవసరమైన నీరు లేనందున ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ ఆర్‌డిఓ రమణారెడ్డి,తహసీల్దార్ గాజుల ప్రమీల, ఎంపీడీవో విజయకుమారి, విద్యుత్ ఏఈ బాలు నాయక్,వ్యవసాయ అధికారి పార్వతి,మండల విద్యాధికారి రవి నాయక్, వైద్యాధికారి వనిత,మిషన్ భగీరథ డీఈ మధు, సర్పంచ్ నేనావత్ జ్యోతి కాంతారావు పాల్గొన్నారు.




## సాగర్ నీటిని ఏపి దోచుకుపోతున్నా పట్టించుకోరా? : మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ:** నాగార్జున సాగర్ నీళ్లను ఆంధ్రప్రదేశ్ యథేచ్ఛగా దోచుకుపోతున్నా జిల్లా మంత్రులు నోరు మూసుకున్నారని,మంత్రులు చేతకాని దద్దమ్మలని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి మండిపడ్డారు.శుక్రవారం నల్లగొండలోని కెబిఆర్ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీశైలం నుండి నిత్యం నీటి దోపిడీ జరుగుతోంది.జిల్లాలో ఈఇద్దరు మంత్రుల వల్ల వ్యవసాయం ఆగమైంది.సాక్ష్యాలతో సహా ఆంధ్ర నీటి దోపిడీని కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదు. శ్రీశైలంలో పోతిరెడ్డిపాడు ద్వారా చిల్లు పెట్టి నదిని మొత్తం మళ్లించుకుంటున్నారు. ఎమ్మెల్సీ ఎంసి కోటిరెడ్డి,జెడ్‌పి మాజీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి,మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి, నల్లమోతు భాస్కరరావు,హుజూర్‌నగర్ ఇంచార్జ్ ఒంటెద్దు నరసింహారెడ్డి,మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి,బోనగిరి దేవేందర్ తదితర కార్పొరేటర్లు,నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

## ఎఐటియుసి మండల నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/మోత్కూర్ :** మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని కెఆర్ భవన్ లో జరిగిన ఎఐటియుసి మోత్కూర్ మండల 2వ రోజు జరిగిన 3వ మహాసభకు ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్మికులంతా ఏకమై తమ సమస్యల పరిష్కారం కోసం ఎఐటియుసిలో చేరి పోరాటాలు నిర్వహించాలని అలాగే లేబర్ కార్డులు తీసుకోవాలని లేబర్ యూనియన్ ద్వారా అనేక హక్కులు పొందాలని వారు తెలియజేస్తూ తదనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా అన్నెపు వెంకట్, అధ్యక్షులుగా తొంట తిరుపతి, ఉపాధ్యక్షులు ఎడ్ల ఆనందు, ఎండి సాదిక్, ప్రధాన కార్యదర్శి జంగా నరసయ్య, సహాయ కార్యదర్శిలు ఎండి పాషా, బొడ్డుపల్లి లక్ష్మయ్య, కోశాధికారి రాపోలు రాజు, కార్యవర్గ సభ్యులుగా జంగ లింగం, పురుగుల రవి, ఎండి జానీ, ఎర్రబెల్లి ముత్యాలు, గుర్రం మధు శేఖర్, నోముల రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బుష్పక నరసింహ, మొగుల శేఖర్ రెడ్డి, తాడూరు లక్ష్మి నరసయ్య పాల్గొన్నారు.

## పాడైపోయిన రోడ్లన్నీ బాగు చేయాల్సిందే

### ఎఐవైఎఫ్ డిమాండ్

### నిర్లక్ష్యం వహిస్తే ఎంఎల్‌ఏ క్యాంపు ఆఫీస్ ముట్టడి



**ప్రజాపక్షం/డిండి:** డిండి మండలంలో పాడైపోయిన రోడ్లను పూర్తి చేయాలని శుక్రవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో తలపెట్టిన పాదయాత్ర మండలంలోని గోనకోల్ గ్రామంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి బొల్లె శైలేష్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ పాదయాత్రకు ముఖ్య అతిథిగా ఏఐవైఎఫ్ నల్గొండ జిల్లా అధ్యక్షులు ఎనమల్ల నవీన్ హాజరై మాట్లాడుతూ గోనకల్ గ్రామం నుండి ఏఐవైఎఫ్ డిండి మండల అధ్యక్ష కార్యదర్శులు కాంపల్లి ప్రవీణ్, ఎలిమినేటి నరేష్ ఆధ్వర్యంలో ఏఐవైఎఫ్ నాయకులు 50 మందితో పాదయాత్ర ప్రారంభం చేసి డిండి పోలీస్ స్టేషన్ వరకు 4 కిలోమీటర్లు పాదయాత్రగా వచ్చి అక్కడ రోడ్డుపై బైఠాయించి గంట పాటు నిరసన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో నవీన్ మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాల క్రితం రాష్ట్ర రహదారుల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి 08/01/2024న డిండి మండల కేంద్రంలో డిండి నుండి దేవరకొండ రోడ్డు నిర్మాణం కోసం శిలాఫలకం ప్రారంభించి ఈరోజు వరకు దానిని పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు. డిండి మండలంలోని తౌక్లాపూర్ నుండి నగర దుబ్బ తండా వరకు , రమాంతాపూర్ నుండి గదరాల్ల తండా వరకు, వావిల్‌కోల్ నుండి బ్రహ్మణపల్లి తండా వరకు, శాంతిగూడెం గ్రామానికి, కందుకూరు నుండి నిజాం నగర్ గ్రామం వరకు, కింది శేషాయికుంట నుండి మీది శేషాయికుంట వరకు, బొగ్గులదోన గేటు నుండి బొగ్గుల దోన గ్రామం వరకు కిష్టంపల్లి గేటు నుండి పడమటిపల్లి గ్రామం వరకు అన్ని గ్రామాలలోని రోడ్లన్నీ గుంతల మయంగా అయి ప్రమాదాలు పొంచి ఉన్నాయని తక్షణమే ఈ ఆగస్ట్ నెలలో రోడ్ల మరమ్మతులు చేపట్టాలని స్థానిక ఎంఎల్‌ఏ బాలునాయక్‌ను కోరారు. లేనిపక్షంలో వచ్చే నెల పెద్ద ఎత్తున భారీ ఉద్యమాలు చేపడతామని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమానికి సిపిఐ, ఏఐఎస్ఎఫ్ పూర్తి మద్దతు ప్రకటించారు. ఈకార్యక్రమంలో ఏఐవైఎఫ్ డిండి మండల కోశాధికారి మధుకర్, ఉపాధ్యక్షులు భూపాల్, కొండల్, సహాయ కార్యదర్శి బాలపిర్, వెంకటేష్, ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షులు హనుమంతు, ఏఐఎస్ఎఫ్ నాగర్ కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌కుమార్, డివిజన్ అధ్యక్షులు వినయ్, డిండి మండల కార్యదర్శి సిద్దు, సిపిఐ తౌక్లాపూర్ గ్రామశాఖ కార్యదర్శి చక్రి పాల్గొన్నారు.

## బాధితుల పట్ల గౌరవంగా వ్యవహరించి తక్షణ పరిష్కారం

### యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్‌పి

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారు,సందర్శకులతో మర్యాదగా,ఓర్పుతో,గౌరవప్రదంగా వ్యవహరించాలని యాదాద్రిభువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ అన్నారు.చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు.జనరల్ డైరీ ఎంట్రీలు,సిసిటిఎన్ఎస్ పనితీరు,స్టేషన్ నిర్వహణ,వివిధ రిజిష్టర్లు,రికార్డులను సమగ్రంగా పరిశీలించారు.పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న సీజ్ చేసిన మోటర్ సైకిళ్ళను పరిశీలించారు.స్టేషన్ కార్యకలాపాలపై సమీక్షించారు. ఈ తనిఖీలో చౌటుప్పల్ డిఎస్పీ పి.మధుసూధన్‌రెడ్డి,సిఐ జి.మన్మథకుమార్ లు పాల్గొన్నారు.

# చేదెక్కిన చక్కెర!

### చరిత్రలో ఎన్నడూ లేనంత ధరల మంట.. సామాన్యుడి వంటింటిపై కేంద్ర విధానాల భారం

### పెరగనున్న టీ, కాఫీ, స్వీట్లు, ఐస్‌క్రీమ్ ధరలు

### ఇథనాల్ తయారీ కంపెనీలకు భారీగా చెరుకు సరఫరా

### దిగుమతులపై నిషేధాలే కారణం

### జూన్‌లో రిటేల్ కిలో చక్కెర ధర రూ.44 లు...నేడు రూ.75లు

### మరో పది రోజుల్లో సెంచరికి దగ్గర్లో ఉంటుందని ప్రచారం?

**ప్రజాపక్షం/హైదరాబాద్:** చక్కెర అంటే తీపి. కానీ ఇప్పుడు ఆ తీపే సామాన్యుడి జీవితంలో చేదుగా మారుతోంది. ఒకప్పుడు కిలో చక్కెర ధర పెరిగితే అది చిన్న వార్తగా కనిపించేది. ఇప్పుడు కిలోకు రూ.75లకు పైగా దాటిన ధరలు సామాన్య కుటుంబాల బడ్జెట్‌ను కుదిపేస్తున్నాయి. రానున్న రోజుల్లో చక్కెర ధర రూ.100లు దాటుతుందని బహిరంగ మార్కెట్‌లో ప్రచారం జరుగుతున్నది. గత కొద్దికాలంలో చక్కెర ధరలు భారీగా పెరగడంతో వినియోగదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. దేశంలోని కీలక మార్కెట్లలో హోల్‌సేల్ ధరలు కూడా రికార్డు స్థాయికి చేరుకున్నాయి. జూన్ మాసంలో రిటైల్ ధర రూ.44 ఉండగా ప్రస్తుతం రూ.75కి చేరింది. ఫలితంగా టీ, కాఫీ, స్వీట్లు, ఐస్‌క్రీమ్ తదితర ధరలు పెరగనున్నట్లు సమాచారం. దేశంలో చక్కెర ఉత్పత్తికి అవసరమైన చెరుకు లభ్యతపై ఒత్తిడి పెరుగుతోంది. మహారాష్ట్ర, కర్ణాటక వంటి ప్రధాన చెరుకు ఉత్పత్తి రాష్ట్రాల్లో వర్షపాతం, పంట దిగుబడిపై ప్రభావం పడటంతో చక్కెర ఉత్పత్తి అంచనాలు తగ్గాయి. అదే సమయంలో దేశీయ డిమాండ్ పెరుగుతోంది. పండుగల సీజన్ దగ్గరపడుతుండటంతో ఆగస్టు నుంచి నవంబర్ మధ్య చక్కెర వినియోగం మరింత పెరిగే అవకాశం ఉంది. పెట్రోల్‌లో ఇథనాల్ కలపడం ద్వారా దిగుమతి చేసుకునే ముడిచమురుపై ఆధారపడటాన్ని తగ్గించడం కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. ఈ విధానంలో భాగంగా చెరుకు రసం, సిరప్, మొలాసిస్ వంటి చెరుకు ఆధారిత ఉత్పత్తులను ఇథనాల్ తయారీకి మళ్లిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం 202425 సీజన్‌లో 34 లక్షల టన్నుల చక్కెర ఇథనాల్ తయారీకి మళ్లించబడింది. దేశంలో చక్కెర నిల్వలు సమృద్ధిగా ఉన్నప్పుడు ఇథనాల్ కోసం చెరుకు, చక్కెరను మళ్లించడం ఒక విధానం కావచ్చు. కానీ దేశీయ మార్కెట్‌లో సరఫరా ఒత్తిడికి గురై, ధరలు రికార్డు స్థాయికి చేరుతున్న సమయంలో అదే విధానాన్ని కొనసాగించడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దేశీయ సరఫరాను కాపాడేందుకు చక్కెర ఎగుమతులపై కేంద్రం ఇప్పటికే ఆంక్షలు విధించింది. గత మే నెలలో చక్కెర ఎగుమతులను సెప్టెంబర్ 30వ తేదీ వరకు నిషేధిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. విదేశాలకు చక్కెర వెళ్లకుండా నియంత్రించినా దేశీయ మార్కెట్లో ధరలు తగ్గకపోవడం పరిస్థితి తీవ్రతను స్పష్టం చేస్తోంది. ఈ పరిస్థితుల్లో దేశీయ వినియోగానికి అవసరమైన చక్కెరను ముందుగా కాపాడే విధానం కేంద్రం అవలంబించాల్సిన అవసరం ఉంది.

**పెట్రోల్‌కు ఇథనాల్ కావాలి.. కానీ తీపి ఎవరికీ?**

ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ కార్యక్రమం దేశ ఇంధన భద్రతకు ఉపయోగకరమైన విధానమే. 2024–25లో పెట్రోల్‌లో ఇథనాల్ కలపడం 19.24 శాతానికి చేరిందని కేంద్రం వెల్లడించింది. 2025–26లో 20 శాతం లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది. కానీ ఇంధన అవసరాల కోసం వ్యవసాయ ఉత్పత్తుల వినియోగం పెరుగుతున్నప్పుడు ఆహార వినియోగం, పారిశ్రామిక వినియోగం, ఇంధన వినియోగం మధ్య సమతుల్యత తప్పనిసరి. చక్కెర ఉత్పత్తి తగ్గుతున్న సమయంలో కూడా చెరుకును ఇథనాల్ వైపు మళ్లిస్తే దేశీయ చక్కెర మార్కెట్‌పై మరింత ఒత్తిడి పడే ప్రమాదం ఉంది. ఇదే కారణంగా కేంద్రం ఇథనాల్ విధానాన్ని పరిస్థితులకు అనుగుణంగా సర్దుబాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది.



రాయిటర్స్ నివేదిక ప్రకారం, చక్కెర సరఫరా పెంచేందుకు చెరుకును ఇథనాల్‌కు మళ్లించడాన్ని పరిమితం చేసే అవకాశాన్ని కేంద్రం పరిశీలిస్తోంది. ఇథనాల్ తయారీకి చెరుకుపైనే అధికంగా ఆధారపడకుండా మొక్కజొన్న, దెబ్బతిన్న ఆహార ధాన్యాలు వంటి ప్రత్యామ్నాయ ముడి పదార్థాల వినియోగాన్ని పెంచే అవకాశం ఉంది. కేంద్రం ఇప్పటికే చెరుకు ఆధారిత ఇథనాల్ ప్లాంట్లను మల్టీ ఫీడ్‌స్టాక్ ప్లాంట్లుగా మార్చేందుకు సహకార చక్కెర కర్మాగారాలకు పథకం ప్రకటించింది. చక్కెర ధరలు మండుతున్న సమయంలో చెరుకును పూర్తిగా చక్కెర తయారీకి ప్రాధాన్యమివ్వడం, అవసరమైన మేరకు మాత్రమే ఇథనాల్‌కు మళ్లించడం వంటి తాత్కాలిక సమతుల్య విధానం అవసరమనే వాదనకు బలం ఉంది.

**ఆలస్యంగా మేల్కొన్న కేంద్రం?**

ధరలు పెరిగిన తర్వాత కేంద్రం చర్యలకు దిగింది. బల్క్ వినియోగదారుల చక్కెర నిల్వ పరిమితిని 30 రోజుల నుంచి 15 రోజులకు తగ్గించింది. తాజాగా 10 లక్షల టన్నుల ముడి చక్కెరను సుంకం లేకుండా దిగుమతి చేసుకునేందుకు అనుమతించింది. ఇది సమస్యను పరిష్కరించే ప్రయత్నమే అయినప్పటికీ సమస్య ఎలా పరిష్కారం అవుతుందనే ప్రశ్న మాత్రం మిగిలే ఉంది. ‘ధరలు ఆకాశాన్ని తాకిన తర్వాత దిగుమతులు ఎందుకు? సరఫరా ఒత్తిడి పెరుగుతున్న సంకేతాలు ముందే కనిపించినప్పుడు ముందస్తు చర్యలు ఎందుకు తీసుకోలేదు? దేశంలో చక్కెర ఉత్పత్తి, నిల్వలు, ఇథనాల్‌కు మళ్లింపు, ఎగుమతులు, దిగుమతులు ఈ మొత్తం వ్యవస్థను సమన్వయంతో నిర్వహించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపైనే ఉంది. చక్కెర రంగాన్ని నియంత్రించేందుకు ఉత్పత్తి, విక్రయాలు, దిగుమతులు, ఎగుమతులు, విడుదల కోటాలపై కేంద్రానికి అధికారాలు ఉన్నాయని ప్రభుత్వమే చెబుతోంది. 2026–27 సీజన్‌కు చెరుకు ఎఫ్ఆర్‌పీని క్వింటాల్‌కు రూ.365గా కేంద్రం నిర్ణయించింది.చెరుకు రైతుకు సరైన ధర అందాలి. అది ప్రభుత్వ బాధ్యత’ అని రైతులు, వ్యాపారస్తులు అంటున్నారు.

విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, దర్శకుడు అనిల్ రావిపూడి క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జి స్టూడియోస్ సమర్పిస్తున్నాయి.

రీల్

## అక్టోబర్ 9న రానున్న 'ఇట్లు అర్జున'



డైరెక్టర్ వెంకీ కుడుముల నిర్మాతగా వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్ను తెరకెక్కిస్తున్న చిత్రం 'ఇట్లు అర్జున'. ఈ సినిమాతో అనీష్ హీరోగా పరిచయం అవుతుండగా, డెబ్యూ దర్శకుడు మహేష్ ఉప్పల దర్శకత్వం వహిస్తున్నారు. అనన్యర రాజన్ కథానాయికగా నటిస్తున్నారు. టైటిల్ గ్లింప్స్, ఇప్పటికే విడుదలైన రెండు పాటలు ఇప్పటికే ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచాయి. 'ఇట్లు అర్జున' అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. విడుదల తేదీని ప్రకటిస్తూ విడుదల చేసిన పోస్టర్ ఆసక్తికరంగా ఆకట్టుకుంటోంది. పోస్టర్లో అనీష్ స్టైలిష్ లుక్లో ఓ భవనం పైకప్పు నుంచి దూకుతూ ఏదో పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లుగా కనిపిస్తుండగా, అనన్యర రాజన్ చేతులు కట్టుకుని, విభిన్నమైన ఎక్స్‌ప్రెషన్‌తో కనిపించడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. సినిమాకు ఇప్పటివరకు విడుదలైన ప్రమోషనల్ కంటెంట్లో కనిపించిన లీడ్ పెయిర్ కెమిస్ట్రీ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ చిత్రంలో అనీష్ చెవిటి మూగ యువకుడి పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఎస్. థమన్ సంగీతం అందిస్తుండగా, రాజా మహాదేవన్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. రామ్ కుమార్ ఏ ప్రొడక్షన్ డిజైనర్గా, కోటి కే ఎడిటర్గా పనిచేస్తున్నారు. యాక్షన్ సన్నివేశాలకు దిలీప్ సుబ్బరాయన్ కొరియోగ్రఫీ చేస్తున్నారు.

## సెప్టెంబర్ 4న 'ధర్మస్థల నియోజకవర్గం'



మూవింగ్ డ్రీమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై సుమన్, సాయికుమార్, నటరాజ్, రాయంచ కొక్కుర వరుణ్ సందేశ్, వితికా షేరు ప్రధాన పాత్రలలో నటిస్తున్న చిత్రం 'ధర్మస్థల నియోజకవర్గం'. జై జ్ఞాన ప్రభ తోట దర్శకత్వంలో మేరుం భాస్కర్ నిర్మిస్తోన్న ఈ పొలిటికల్ ఎంటర్టైనర్ చిత్రం.. సెప్టెంబర్ 4న వరల్డ్ వైడ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ చిత్రాన్ని 'పివిఆర్ సినిమాస్ డిస్ట్రిబ్యూషన్' ద్వారా ఆంధ్ర,తెలంగాణలో రిలీజ్ చేయనున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ లో ఈ చిత్ర ప్రెస్ మీట్ నిర్వహించారు. నటుడు సుమన్ మాట్లాడుతూ ఈ మూవీ మీద నాకు మంచి నమ్మకం ఉంది. సినిమా హిట్ అవుతుందనే ఆశిస్తూ వచ్చాను. డైరెక్టర్ జై జ్ఞాన ప్రభ కథ చెప్పినప్పుడే ప్రేక్షకుల్ని ఆకట్టుకునే సినిమా అవుతుందని నమ్మాను. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ సినిమాను మా దర్శక నిర్మాతలు తెరకెక్కించారు. సెట్ లో అన్నీ కుదరకపోతే ఒక్కోసారి షూటింగ్ క్యాన్సిల్ చేసిన సందర్భాలూ ఉన్నాయి. కానీ క్వాలిటీ మీద కాంప్రమైజ్ కాలేదు. ఈ చిత్రంలో ఒక మంచి క్యారెక్టర్ చేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది. సెప్టెంబర్ 4న ఈ సినిమాను చూసి మీరంతా ఆదరించాలని కోరుకుంటున్న అన్నారు. హీరోయిన్ వితికా షేరు మాట్లాడుతూ నేను హీరోయిన్ గా కంటే ఒక నటిగా మంచి గుర్తింపు పొందాలని కోరుకున్నాను. నటిగా నాకు మంచి పేరు తెచ్చే క్యారెక్టర్ ను ఈ సినిమాలో చేశాను అన్నారు.నటి కస్తూరి మాట్లాడుతూ అర్థం పర్థం లేని కామెడీ, డ్రామా ఉన్న సినిమా కాదిది. ఒక పర్పస్ ఫుల్ మూవీ. ప్రేక్షకుల్ని ఆలోచింపజేసే చిత్రమిది. ఇలాంటి సినిమా ఇప్పుడున్న సొసైటీకి కావాలి. జెన్ జీ ఆటపాటలతో సరదాగా సమయం గడపడం లేదు. ఆలోచిస్తున్నారు అన్నారు.పివిఆర్ సినిమాస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఉదయ్ మాట్లాడుతూ రీసెంట్ గా వస్తున్న సినిమాలన్నీ హిట్ అవుతున్నాయి. అదే కోవలోనే ఈ ధర్మస్థల నియోజకవర్గం సినిమా కూడా హిట్ అవుతుందని ఆశిస్తున్నాను అని అన్నారు. సంగీత దర్శకుడు మహావీర్ ఏలేందర్ , హీరో నటరాజ, చిత్ర దర్శకుడు జై జ్ఞాన ప్రభ తోట, నిర్మాత మేరుం భాస్కర్ పాల్గొన్నారు. **ఈ చిత్రానికి సంగీతం: మహావీర్ ఎల్లంధర్, పాటలు : చంద్రబోస్, సింగర్: సునీత, డి ఓ పి: వెంకట హనుమ, ఫైట్స్: నందు మాస్టర్, కొరియోగ్రఫీ: శ్రష్టి వర్మ,**

## 'ఇరుముడి'కి నేనే డబ్బింగ్ చెప్పా

## చిట్ చాట్ లో బాల నటి బేబి నక్షత్ర

మాస్ మహారాజా రవితేజ నటించిన 'ఇరుముడి'. ప్రియ భవాని శంకర్ హీరోయిన్గా నటిస్తున్నారు. శివ నిర్వాణ దర్శకత్వంలో, మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 21న థియేటర్లలోకి విడుదలైంది. ఈ సినిమా హిట్ టాక్ తెచ్చుకుంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన బేబీ నక్షత్ర మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. నా పేరు నక్షత్ర. మాది కేరళ. నేను ఏడో క్లాస్ చదువుకుంటున్నాను. ఇప్పటివరకు కన్నడ, మలయాళం, తమిళ్ భాషల్లో కలిపి ఆరు సినిమాలు చేశాను. దర్శకుడు శివ నిర్వాణ ఇన్స్టాగ్రామ్లో నా రీల్స్ చూసి ముందుగా మా అమ్మని సంప్రదించారు. 'ఇరుముడి' నా తొలి తెలుగు సినిమా కావడం చాలా ఆనందంగా ఉంది.రవితేజ తో వర్క్ చేయడం చాలా హ్యాపీగా అనిపించింది. ఇరుముడి సినిమా హిట్ అవ్వడం చాలా హ్యాపీగా ఉంది. రవితేజ నాతో ఫ్రెండ్లీగా ఉన్నారు. ఆయన అంటే నాకు చాలా ఇష్టం. రవితేజ సినిమాల్లో నాకు 'విక్రమార్కుడు' చాలా ఇష్టం. ఇందులో నా పాత్ర పేరు మణికంఠ. నేను రవి తేజ కూతురిగా నటించాను. ప్రియా మేడమ్ నా తల్లి పాత్రలో నటింకాహారు. రవితేజ, ప్రియా మేడమ్ ఇద్దరూ నాతో ఎంతో ఫ్రెండ్లీగా ఉన్నారు. ఈ సినిమాకి స్వయంగా డబ్బింగ్ చెప్పాను. ఈ సందర్భంగా మా అమ్మకు థాంక్స్ చెప్తున్నాను. తనే నాకు చాలా సపోర్ట్ చేస్తుంది. ముఖ్యంగా మా టీచర్స్ నాకు చాలా సపోర్ట్ చేస్తున్నారు. మా పేరెంట్స్, టీచర్స్ సపోర్ట్తోనే నేను సినిమాలు చేయగలుగుతున్నాను.'ఇరుముడి'లో పాటలన్నీ నాకు ఇష్టం. కాకపోతే 'యాలో యాలో' పాట నా ఫేవరెట్. దర్శకుడు శివ నిర్వాణ సపోర్ట్తోనే ఈ సినిమాను చాలా కాన్ఫిడెంట్గా చేయగలిగాను. సీలేరులో ఈ సినిమాను షూట్ చేశాం. అక్కడి ప్రదేశాలు నాకు కేరళ లాగే అనిపించాయి. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో పనిచేయడం చాలా హ్యాపీగా ఉంది. వారి నిర్మాణంలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నాను.




## 'బ్యాడ్ టైం బ్యాండ్ బాజా' పాడుకుంటున్న అల్లరి నరేష్

కామెడీ సినిమాలతో ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అల్లరి నరేష్ మరోసారి తనకు బాగా కలిసొచ్చిన జానర్లో సందడి చేయబోతున్నారు. ఆయన హీరోగా నటిస్తున్న ఫాంటసీ కామెడీ ఎంటర్టైనర్ 'రంభ ఊర్వశి మేనక'. చంద్ర మోహన్ చింతాడ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ బ్యానర్లపై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ నిర్మిస్తున్నారు.తాజాగా బ్యాడ్ టైం బ్యాండ్ బాజా సాంగ్ రిలీజ్ చేశారు. 'బ్యాడ్ టైం బ్యాండ్ బాజా' పేరుకు తగ్గట్టుగానే పాట ఆద్యంతం ఫుల్ ఎనర్జీ, ఫన్తో సాగుతుంది. హీరో జీవితంలో ఎదురయ్యే బ్యాడ్ టైమ్ను కామెడీగా ప్రజెంట్ చేస్తూ, క్యాచీ ట్యూన్తో పాటను ఆసక్తికరంగా తీర్చిదిద్దారు. చేతన్ భరద్వాజ్ కంపోజ్ చేసిన ఎనర్జిటిక్ ట్యూన్కు రామ్ మిరియాల తన ప్రత్యేకమైన వాయిస్తో మరింత జోష్ తీసుకొచ్చారు.భాస్కరభట్ల రవికుమార్ అందించిన లిరిక్స్ పాటలోని కామెడీ, ఫన్ ఎలిమెంట్ను మరింత ఎలివేట్ చేస్తున్నాయి.రంభ ఊర్వశి మేనక గా రాశి సింగ్, విష్ణుప్రియ, ప్రిషా సింగ్ ప్రజెన్స్ ఆకట్టుకుంది. రామ్ మిరియాల ఎనర్జిటిక్ వోకల్స్, భాస్కరభట్ల క్యాచీ లిరిక్స్ ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.'రంభ ఊర్వశి మేనక' సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. అల్లరి నరేష్, సురభి, రాశి సింగ్, విష్ణుప్రియ, ప్రిషా సింగ్, వెన్నెల కిషోర్, నరేష్ వి.కె., శ్రీనివాస్ రెడ్డి, రచ్చ రవి, మురళీధర్ గౌడ్ తదితరులు నటించిన **ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రామ్ రెడ్డి, ఆర్ట్ డైరెక్టర్: బ్రహ్మ కడలి, ఎడిటర్: చోటా కె. ప్రసాద్.**



## త్రివిక్రమ్‌తో పోల్చడం గౌరవంగా భావిస్తున్నాను

### 'విశ్వనాథ్ అండ్ సన్స్' దర్శకుడు వెంకీ అట్లూరి



తమిళ అగ్ర కథానాయకుడు సూర్య నటించిన తాజా చిత్రం 'విశ్వనాథ్అండ్ సన్స్'. లక్కీ భాస్కర్ సక్సెస్ తరువాత దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మమితా బైజు కథానాయికగా నటించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్య దేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. సహజమైన హాస్యం, సున్నితమైన భావోద్వేగాలతో హృదయాన్ని హత్తుకునే కుటుంబ కథా చిత్రంగా ఆగస్టు 14న థియేటర్లలో అడుగుపెట్టిన 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమాకి ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. కేవలం నాలుగు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.150 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించిన ఈ చిత్రం, అఖండ విజయం దిశగా దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో దర్శకుడు వెంకీ అట్లూరి మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. చాలా చాలా సంతోషంగా ఉంది. మేము ఊహించిన దానికంటే అద్భుతమైన స్పందన లభిస్తోంది. నిజానికి ఆయన ఒక ఫ్యామిలీ స్టోరీ కోసం చూస్తున్నారు. అదే విషయం నాకు చెప్పారు. సూర్యకి కథ చాలా నచ్చింది. అయితే ఈ కథకు అనవసరమైన కామెడీ లేదా కమర్షియల్ అంశాలు జోడించకుండా.. నిజాయితీగా చెబుదామని అన్నారు. అందుకే క్లైమాక్స్ విషయంలో చాలా జాగ్రత్త తీసుకున్నాము. నేను సినీ పరిశ్రమలోకి రావడానికి స్ఫూర్తి మణిరత్నం , త్రివిక్రమ్ . అలాంటిది త్రివిక్రమ్ తో నన్ను పోల్చడం అనేది గౌరవంగా భావిస్తున్నాను. త్రివిక్రమ్ 'నువ్వు నాకు నచ్చావ్' సినిమా అంటే నాకు చాలా ఇష్టం. సంభాషణలు సరదాగా ఉంటూనే, జీవిత సత్యాలు చెబుతాయి. ఆ సినిమా నాలో ఎంతో స్ఫూర్తి నింపింది. ఆ తరహా రచన రాయడానికి ఇష్టపడతాను.వయసు వ్యత్యాసం ఉన్న బంధంపై కథ రాయాలని మొదట అనుకున్నాను. 40 ఏళ్ళు వచ్చినా పెళ్ళి చేసుకోకపోవడానికి బలమైన కారణం ఉండాలి. దాని చుట్టు అల్లుకున్న కథ ఇది. నా దృష్టిలో మనుషులు చెడ్డవారు కాదు. పరిస్థితుల వల్ల ఒక్కోలా ప్రవర్తిస్తూ ఉంటారు. అదే విషయాన్ని సినిమాలో చెప్పడం జరిగింది. ఈ కథ నేను 2022 లోనే అనుకున్నాను. అప్పుడు సూర్యని దృష్టిలో ఉంచుకొని రాయలేదు. సితార ఎంటర్టైన్మెంట్స్ సూర్య మార్కెట్ ను దృష్టిలో ఉంచుకొని తమిళంలో చిత్రీకరించాము. తెలుగు రాష్ట్రాలతో పోలిస్తే తమిళనాడులో థియేటర్ల సంఖ్య తక్కువ. టికెట్ ధరలలో కూడా వ్యత్యాసం ఉంది. అందుకే అక్కడ వసూళ్లు తక్కువ వచ్చాయని అనిపిస్తుంది. కానీ, మన దగ్గరతో పోలిస్తే అక్కడ లాంగ్ రన్ ఉంటుంది. కరుప్పు విషయంలో అదే జరిగింది. 'విశ్వనాథ్ అండ్ సన్స్' కూడా లాంగ్ రన్ లో తమిళంలో భారీ వసూళ్లు సాధిస్తుంది.

# కార్మిక హక్కులు బలహీన పర్చవద్దు

### అమర్‌జిత్ కౌర్ డిమాండ్

### సుప్రీం కోర్టు జై బీర్ సింగ్ తీర్పుపై ఆందోళన



**న్యూఢిల్లీ:** కొత్త కార్మిక కోడ్‌లు కార్మికుల హక్కులను బలహీనపరిచే సాధనాలుగా మారకూడదని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ సింగ్ స్పష్టంచేశారు. సామాజికఆర్థిక న్యాయం, సమానత్వం, కార్మిక గౌరవం, సంఘటిత హక్కులపై రాజ్యాంగబద్ధమైన నిబద్ధతను బలోపేతం చేయాలని శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో కార్మిక హక్కులు, సామాజిక న్యాయం, రాజ్యాంగ సమానత్వ పరిరక్షణలో న్యాయవ్యవస్థ ప్రశంసనీయమైన పాత్ర పోషించిందన్నారు. సంస్థాగత అధికారం, ఆర్థిక ప్రయోజనాల ప్రభావానికి న్యాయవ్యవస్థ లోనుకారాదని అమర్‌జిత్ కౌర్ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం యూపీ వర్సెస్ జై బీర్ సింగ్ కేసులో ఇచ్చిన తీర్పు క్రమంలో 1947 నాటి పారిశ్రామిక వివాదాల చట్టం కింద 'పరిశ్రమ' నిర్వచనంపై ఆందోళన వ్యక్తం చేశారు. పారిశ్రామిక సంబంధాల కోడ్2020లోని సెక్షన్ 2 (పి)ను ప్రస్తావించారు. బెంగళూరు నీటి సరఫరా కార్యాచరణకు సంబంధించిన తీర్పులోని న్యాయసూత్రాలను మెజారిటీ ధర్మాసనం కొనసాగించినప్పటికీ, 'పరిశ్రమ' నిర్వచనాన్ని పునర్ వ్యాఖ్యానించడంతోపాటు పారిశ్రామిక సంబంధాల కోడ్‌లోని సెక్షన్ 2(పి)ను నిరాకరించడం వల్ల కొత్త కార్మిక చట్టాల పరిధిలో కార్మికులకు సంబంధించిన కీలక ప్రశ్నలు ఇంకా అపరిష్కృతంగానే ఉంటాన్ని అమర్‌జిత్ కౌర్ గుర్తుచేశారు. ఈ విషయంలో జస్టిస్ బీవీ నాగరత్న ఇచ్చిన భిన్నాభిప్రాయ తీర్పును ప్రత్యేకంగా ప్రస్తావించారు. పారిశ్రామిక వివాదాల చట్టం స్థానంలో పారిశ్రామిక సంబంధాల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఈ పునర్విమర్శ అవసరాన్ని జస్టిస్ నాగరత్న ప్రశ్నించారన్నారు. ప్రభుత్వ రంగ కార్యకలాపాలు ప్రైవేటుపరమైతే కార్మికులపై ప్రభావం, రక్షణ కోల్పోయే పరిస్థితిని ఆమె ప్రస్తావించినట్లు అమర్‌జిత్ కౌర్ పేర్కొన్నారు. జస్టిస్ బాగ్చీ కూడా కేసు విచారణకు సంబంధించిన అంశాలను అంగీకరించినప్పటికీ, మెజారిటీ ధర్మాసనం ప్రతిపాదించిన పునర్వ్యాఖ్యానాన్ని తిరస్కరించారన్నారు. ఒక సంస్థ స్వభావం కంటే అది నిర్వహించే కార్యకలాపాల స్వభావానికే ప్రాధాన్యత ఉండాలన్నారు. కొత్త కార్మిక కోడ్‌లో సార్వభౌమ విధులు, స్వచ్ఛంద, సామాజిక, దాతత్వ సంస్థలకు మినహాయింపులు...కార్మికులను పారిశ్రామిక సంబంధాల చట్టపరమైన రక్షణకు దూరం చేయొచ్చని అమర్‌జిత్ కౌర్ ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వ కార్యకలాపాలన్నింటినీ 'సార్వభౌమ విధులు'గా పరిగణించరాదని, ఒక సంస్థను దాతత్వ సంస్థగా పిలిచినంత మాత్రాన అక్కడ పని చేస్తున్న ఉద్యోగుల ప. పారిశ్రామిక స్వభావాన్ని కోల్పోదని స్పష్టం చేశారు. ప్రైవేటీకరణ, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టీకరణ, ప్రభుత్వప్రైవేటు భాగస్వామ్యాలు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగి పని స్వభావం కంటే యాజమాన్య సంస్థ హోదాకు అధిక ప్రాధాన్యతివ్వడం కార్మికులకు నష్టమని హెచ్చరించారు. మెజారిటీ ధర్మాసనం అనుసరించిన విధానం సంస్థాగత, యాజమాన్య ప్రయోజనాలకు కార్మికుల సావహిక హక్కులు, బేరసారాల శక్తి కంటే ఎక్కువ ప్రాధాన్యతిచ్చే నిర్మాణాత్మక ధోరణిని ప్రతిబింబిస్తోందన్నారు. న్యాయవర్తుల వ్యక్తిగత ఉద్దేశాలను ప్రశ్నించడం లేదని చెప్పారు. కార్మిక శక్తిని బలహీనపరిచే న్యాయ వ్యాఖ్యల సామాజిక పరిణామాలను విస్మరించలేమని అన్నారు. సామాజిక, ఆర్థిక న్యాయం, సమానత్వం, కార్మిక గౌరవం, సంఘటిత స్వేచ్ఛకు రాజ్యాంగం హామీ ఉన్నందున యజమాని... ప్రభుత్వ సంస్థ లేదా కాంట్రాక్టర్ లేదా దాతత్వ సంస్థ అయినా కార్మికులకు సమానమైన పని రక్షణ నిరాకరించేలా పారిశ్రామిక సంబంధాల కోడ్‌ను ఉపయోగించడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు అమర్‌జిత్ కౌర్ వెల్లడించారు.

## రూ.264 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

50.9 శాతం అధికంగా నమోదైంది. రాయదుర్గ్ వంటి కీలక ఐటి, వాణిజ్య కారిడార్‌లో పెట్టుబడిదారుల ఆసక్తి ఏ స్థాయిలో ఉందో ఈ వేలం ఫలితం స్పష్టం చేస్తోంది. జాతీయ స్థాయి ప్రముఖ డెవలపర్ల మధ్య నెలకొన్న తీవ్ర పోటీతో ధర భారీగా పెరిగినట్లు టిజిఐఐసి వెల్లడించింది. రాయదుర్గ్ భూముల ధరలు స్వల్ప వ్యవధిలోనే భారీగా పెరుగుతున్నాయి. 2026 మేలో టిజిఐఐసి నిర్వహించిన వేలంలో ఎకరాకు రూ.237 కోట్లు ధర పలికింది. తాజాగా ఆ రికార్డును అధిగమిస్తూ ప్లాట్ పి1ఎకరాకు రూ.264 కోట్లకు చేరింది. కేవలం మూడు నెలల వ్యవధిలోనే ధరలో గణనీయమైన పెరుగుదల చోటుచేసుకోవడం హైదరాబాద్ ప్రీమియం రియల్ ఎస్టేట్ మార్కెట్‌పై ఉన్న నమ్మకానికి నిదర్శనంగా అధికారులు పేర్కొన్నారు. ఈ వేలం ఎంఎస్‌టిసి ఈఆక్షన్ ప్లాట్‌ఫామ్ ద్వారా నిర్వహించారు. జెఎల్‌ఎల్ ప్రత్యేక లావాదేవీ సలహాదారుగా వ్యవహరించింది. పారదర్శక ప్రక్రియతో జాతీయ స్థాయి డెవలపర్లు పోటీలో పాల్గొనేలా అవకాశం కల్పించినట్లు టిజిఐఐసి తెలిపింది.టిజిఐఐసి వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. శశాంక మాట్లాడుతూ.. రాయదుర్గ్ ప్లాట్ పి1 వేలం విజయవంతం కావడం తెలంగాణ భవిష్యత్తుపై డెవలపర్ వర్గాలకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమన్నారు. ఇది కేవలం భూమి ధర పెరుగుదల మాత్రమే కాదని, పారదర్శకత, మౌలిక వసతులు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం వంటి ప్రభుత్వ విధానాలకు మార్కెట్ నుంచి లభించిన స్పష్టమైన మద్దతని పేర్కొన్నారు.హైదరాబాద్ ప్రపంచస్థాయి వ్యాపార కేంద్రంగా రూపాంతరం చెందుతోందని, తాజా వేలం ఫలితాలు దేశంలోని ప్రముఖ పెట్టుబడి గమ్యస్థానాల్లో హైదరాబాద్ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయని శశాంక తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు నాయకత్వంలో తెలంగాణలో పారదర్శక, వ్యాపార అనుకూల వాతావరణం ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు.వ్యూహాత్మక భూముల మానిటైజేషన్, పారదర్శక కేటాయింపు ప్రక్రియలు, అత్యున్నత స్థాయి మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా తెలంగాణ పారిశ్రామిక, ఆర్థిక అభివృద్ధికి టిజిఐఐసి మరింత ఊతమివ్వనుందని అధికారులు తెలిపారు.

## రెవెన్యూ కార్యాలయంలో టాయిలెట్ శుభ్రం చేసిన మంత్రి జూపల్లి

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి:** నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం పెంట్లవెల్లి మండల్ రెవెన్యూ కార్యాలయాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా టాయిలెట్ అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించి, మంత్రి స్వయంగా శుభ్రం చేసి అధికారులకు కనువిప్పు కలిగించారు. దరఖాస్తులు ఫైళ్ల పరిష్కారంలో జరుగుతున్న జాప్యంపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పెండింగు ఉంచి, వారిని కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడం సరికాదని మందలించారు. ఇకనైనా పనితీరును మార్చుకోవాలి. హితవు పలికారు. పారిశుద్ధ్య సామాగ్రి, టైల్స్ ఏర్పాటుకు మంత్రి తన వంతుగా తక్షణ ఆర్థిక సాయం అందించి, కార్యాలయ పరిసరాలతో పాటు టాయిలెట్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. ప్రజలకు అందించే సేవల్లో జాప్యం లేకుండా చూడటంతో పాటు కార్యాలయాల్లో పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం అధికారుల బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు.



## పతనం తప్పదు

(మొదటి పేజీ తరువాయి)

చైతన్యవంతులైన ఈ తరాన్ని చూసి మోడీ భయపడుతున్నాడని సాంబశివరావు తెలిపారు.మోడీ విధానాల కారణంగా యువత తీవ్ర అసహనానికి గురైందని, అసహనం నుంచి ఆవేశం వచ్చిందని దీంతో మోడీ తలవంచక తప్పలేదని ఆయన తెలిపారు.యువతరం ముఖ్యంగా జెన్ జీ వీధుల్లోకి పోరాట మార్గం ఎంచుకోవటంతో మోడీ అహంకారంపై తొలి వేటు పడిందన్నారు. అందుకే స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా దిమాగీ నక్సల్స్ అన్న పదాన్ని తెరపైకి తెచ్చి ప్రశ్నించేవారిని దిమాగీ నక్సల్స్‌గా ముద్ర వేసి నిర్బంధించే ప్రయత్నం చేస్తుందని కూనంనేని తెలిపారు. మావోయిస్టులను లేదా కమ్యూనిస్టులను భౌతికంగా హతమార్చినా భావజాలాన్ని తుద ముట్టించేందుకు దిమాగి నక్సల్స్ పేరుతో నిర్బంధాలు, హతమార్చటం లాంటి చర్యలకు పాల్పడే ప్రమాదం ఉందని ఆయన తెలిపారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన మోడీ ఉన్న ఉద్యోగాలను ఊడగొడుతున్నారని మోడీ ఏవలం అంబానీ, అదానీ కోసం ప్రదానిగా పనిచేస్తున్నారని కూనంనేని ఆరోపించారు. ప్రపంచ వ్యాప్తంగా వామపక్ష భావజాలం పెరుగుతుందని, పెట్టుబడిదారి దేశం అమెరికాలో ట్రంప్‌కు వ్యతిరేకంగా సోషలిస్టులు వరుస విజయాలు సాధిస్తున్నారని న్యూయార్క్ మేయర్‌ను సోషలిస్టు భావజాలం ఉన వ్యక్తి గెలుచుకున్నారన్నారు. సమాజ చోధకశక్తి యువతేనని మారిన మారుతున్న పరిణామాలను నిరంతరం అధ్యయనం చేస్తూ పోరాటతత్వాన్ని అలవర్చుకోవాలి. యువత సైద్ధాంతిక నైతిక శారీరక బలాన్ని పెంపొందించుకోవాలని యువతకు సూచించారు.







**పోరాటాల కాణాచి ఏఐవైఎఫ్– వలీ, దర్మేంద్ర**

భారతదేశ యువజనోద్యమాలకు దిక్సూచి ఏఐవైఎఫ్ అని పోరాటాల కాణాచిగా పెరుగాంచిందని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలీ ఉల్లా ఖాద్రీ, కల్లూరి దర్మేంద్ర తెలిపారు.యువజన సమాఖ్య మహాసభలో వారు మాట్లాడుతూ పాలకులు యువతకు సంబందించిన ఏ పథకాలను అమలు చేయటం లేదని ఆరోపించారు.యువతకు ఉపాధి ఉద్యోగాల కోసం ఏఐవైఎఫ్ పోరాడుతుందని వారు తెలిపారు. ఉద్యోగ ఉపాదికల్పనకు సంబంధించి పాలకులు కార్యాచరణ ప్రకటించాలని డిమండ్ చేశారు.బయ్యారం ఉక్కు పరిశ్రమ సాధన కోసం పోరాడతామని, వలీ, దర్మేంద్ర తెలిపారు. ఈ మహాసభలలో సిపిఐ జాతియ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, కొండపర్తి గోవిందరావు, నానబాల రామకృష్ణ తదితరులు ప్రసంగించగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, షేక్ జానిమియా, ఎపూరి లతాదేవి, బిజి క్లెమెంట్ పలువురు జిల్లా కార్యవర్గ సభ్యులు పావులూరి మల్లిఖార్జునరావు, కొల్లి రవి, అహ్వాన సంఘం అధ్యక్షలు కొల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి దూసరి గోపాలరావు, ఏఐఎస్ఎఫ నాయకులు రామకృష్ణ, లక్ష్మణ్, ఏఐవైఎఫ్ నాయకులు శ్రీనాధ్ రెడ్డి, శ్రావణ్శ్రావణ్, చింతల రమేష్, కొల్లి రవి తదితరులు పాల్గొన్నారు.



## బిజెపి కార్యకర్తలు దాడి

(మొదటి పేజీ తరువాయి)

'కాక్రోచ్ జనతా పార్టీ' బృందాన్ని, బిజెపి కార్యకర్తల అండతో గ్రామస్తులు అడ్డుకున్నారు. బారికేడ్లు ఏర్పాటు చేసి వారిని బలవంతంగా వెనక్కి నెట్టివేశారు. జైపూర్ జిల్లాలోని రాంపుర కన్వర్ పుర గ్రామానికి వెళ్లిన సిజెపి బృందానికి చేదు అనుభవం ఎదురైంది. తమ కార్యకర్తలపై దాడి జరిగిందని, రాళ్లు రువ్వారని ఆ పార్టీ ఆరోపించింది. రాష్ట్ర పోలీసులు జోక్యం చేసుకోవడంలో విఫలమయ్యారని పార్టీ సహకన్వీనర్ అశుతోష్ రంకా విమర్శించారు. తమ బృందంపై దాడి చేశారని, వాహనాలను ధ్వంసమయ్యాయని, మహిళా మద్దతుదారుల పట్ల దురుసుగా ప్రవర్తించారని రంకా ఆరోపించారు. ఈ నేపథ్యంలో రాజస్థాన్‌లో ఏం జరుగుతోందని సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. 'అశుతోష్, ఇతర సిజెపి వలంటీర్ల ప్రాణాలు తీయడానికి బిజెపి గూండాలు ప్రయత్నిస్తున్నారు. రాజస్థాన్ పోలీసులు ఇలాంటి దాడిని ఎలా సమర్థిస్తారని నిలదీశారు. అయితే బగ్రు డిఎస్‌పి ధర్మేంద్ర శర్మ మాత్రం తనకు అలాంటి ఘటన గురించి ఏమీ తెలియదని చెప్పారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలలో, సిజెపి బృందం గ్రామంలోకి ప్రవేశించడానికి ప్రయత్నిస్తున్నప్పుడు పెద్ద సంఖ్యలో ప్రజలు వారితో వాగ్వాదానికి దిగడం, సభ్యులను నెట్టివేయడం కనిపించాయి. కొన్ని క్లిప్‌లలో కార్ల అద్దాలు పగిలిపోయి ఉండటం కూడా కనిపించింది. అవి సిజెపి బృందానికి చెందినవిగా భావిస్తున్నారు. గత కొన్నేళ్లుగా రాంపుర కన్వర్‌పురలోని పాఠశాల ఒక గేదెల కొట్టంలో నడుస్తోందని, తాము పరిశీలన కోసం అక్కడికి వెళ్లినప్పుడు తమపై బహిరంగంగా దాడి చేశారని రంకా విలేకరులతో చెప్పారు. తమపై రాళ్లు రువ్వారని, కార్ల అద్దాలు పగలగొట్టి తమ బృందంపై రాళ్ల వర్షం కురిపించారన్నారు. తమ దుస్తులు చింపేశారన్నారు. రాజస్థాన్ విద్యాశాఖ మంత్రి మదన్ దిలావర్ ఆదేశాల మేరకే సిజెపి బృందంపై దాడి జరిగిందని రంకా ఆరోపించారు. 'మిస్టర్ దిలావర్ – మీరు నేడు గూండాలను పంపి, దేశం దృష్టిలో మొత్తం రాజస్థాన్ రాష్ట్రానికి అవమానం తెచ్చారు. కానీ ఇలాంటి గూండాలకు భయపడే రకం మనుషులం మేము కాదు' అని హెచ్చరించారు. బిజెపి గూండాయిజాన్ని ప్రత్యక్షంగా చూసిందని, రాజస్థాన్ ప్రజాస్వామ్యానికి ఇది ఒక చీకటి రోజన్నారు. తాము మీకు 48 గంటల సమయం ఇస్తున్నాము, వీరందరినీ అరెస్టు చేయాలి, పాఠశాలల్లోకి బయటి వ్యక్తుల ప్రవేశాన్ని నిషేధించే ఉత్తర్వును ఉపసంహరించుకోవాలి, లేకపోతే, ఈ ఉద్యమం కేవలం విద్యకు మాత్రమే పరిమితం కాకుండా మదన్ దిలావర్‌ను లక్ష్యంగా చేసుకుంటుందని రంకా హెచ్చరించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderbad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com